

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

మార్చి, 2025

సంపుటి - 11 | సంచిక-03 | పేజీలు- 52 | వెల : ₹ 20/-



## ఉగాది శుభాకాంక్షలతో...

# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో
# గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




మానసిక మరియు పోషకాహార నాణ్యతలు, వ్యక్తి వికాసం పై ఉండే ప్రభావం అన్న అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య



విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన అమెరికాలోని ఆబర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ఉన్నత స్థాయి బృందం



విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న భారతీయ వరి పరిశోధన సంస్థ, హైదరాబాద్




బోధన సిబ్బంది క్రీడలు, సాంస్కృతిక మరియు సాహిత్య పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య




బోధనేతర సిబ్బంది క్రీడలు, సాంస్కృతిక మరియు సాహిత్య పోటీల కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి ఆరంభిస్తున్న రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సిహెచ్. విద్యాసాగర్



పూసా కృషి విజ్ఞాన్ మేళా, న్యూఢిల్లీలో విశ్వవిద్యాలయ స్టాల్

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

మార్చి, 2025

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ క్రోధి నామ సం॥ర మాఘ శుద్ధ తదియ నుండి ఫాల్గుణ శుద్ధ పాడ్యమి వరకు



## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

**డా॥ ఆర్. సునీతా దేవి**
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ ఎన్. రామగోపాల వర్మ
ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

డా॥ ఎ. వి. రామాంజనేయులు
ప్రధాన శాస్త్రవేత్త (అగ్రో) & హెడ్



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు. డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



చిరునామా :
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380
e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.......... 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు.......... 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ.......... 10
4. సాంకేతిక వ్యాసాలు
- యాసంగి వరి సాగులో తెల్లకంకుల సమస్య-యాజమాన్యం.......... 11
- వరిలో డ్రోన్‌ల ద్వారా జీవనియంత్రణ మందులు పిచికారి చేయడానికి పాటించాల్సిన నిర్దిష్ట ప్రమాణాలు.......... 12
- రబీజొన్న పంటలో సస్యరక్షణ.......... 14
- వేసవి అవరాలలో సస్యరక్షణ.......... 15
- వేసవి నువ్వులలో చీడపీడల యాజమాన్యం.......... 18
- తెలంగాణలో వెదురు సాగుకు అనువైన జాతులు మరియు అవకాశాలు.......... 20
- ఈ-కెనాన్ అడవి పందులను పారద్రోలే సమగ్ర పరికరం.......... 25
- జాతీయ బడ్జెట్ 2025-26లో వ్యవసాయరంగ కేటాయింపులు.......... 26
- "వ్యవసాయ డిజిటల్ యాప్‌లు: రైతాంగానికి సమయోచిత సేవలు".......... 28
- అజొల్లా సాగుతో -పాడి రైతు బాగు.......... 30
- వ్యవసాయ పదవినోదం.......... 31
- మార్చి మాసంలో ఉద్యానపంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.......... 32
- మామిడి పూత, పిందెదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.......... 34
- మిరపలో ఆశించు వైరస్ తెగుళ్లు-యాజమాన్య పద్ధతులు.......... 36
- అధిక కొవ్వు, ఉప్పు మరియు చక్కెర తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు.......... 38
- పాడిపశువుల్లో వచ్చే ఉత్పాదక వ్యాధులు-చికిత్స మరియు నివారణ పద్ధతులు.......... 41
- వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్.......... 44
- చిన్న జీవాలలో పీపీఆర్‌వ్యాధి: కారణాలు, లక్షణాలు మరియు నివారణ.......... 45

5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు.......... 46
6. రైతన్నకో ప్రశ్న.......... 47
7. విశ్వవిద్యాలయ వార్తలు.......... 48
8. రైతు విజయగాథ
- జనుము విత్తనోత్పత్తి-కోతులకు మరియు అడవి పందులకు పరిష్కారమా?.......... 49

# మార్చి మాసం క్యాలెండర్ - 2025

## స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ క్రోధి నామ సం॥ర ఫాల్గుణ శుద్ధ విదియ నుండి శ్రీ విశ్వావసు నామ సం॥ర చైత్ర శుద్ధ విదియ వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>ఉ.7.30-9.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ.3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ.12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ.1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ.10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ.9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| **30** శ్రీ విశ్వావసునామ సం॥ర చైత్ర శు॥ పాడ్యమి ప. 2-44 రేవతి సా. 6-43 ఉ.వ. 7-30 ల 9-00 | **31** విదియ ప. 12-20 అశ్విని సా. 5-04 ప.వ. 10-21 ల 11-51 రా.వ. 2-00 ల 3-29 | | | | | **1** ఫాల్గుణ శుద్ధ విదియ తె. 3-17 పూర్వాభాద్ర ప. 2-06 రా.వ. 10-59 ల 12-28 |
| **2** తదియ రా. 12-52 ఉత్తరాభాద్ర ప. 12-20 రా.వ. 11-32 ల 1-01 | **3** చవితి రా. 10-30 రేవతి ఉ. 10-43 తె.వ. 5-19 ల | **4** పంచమి రా. 8-07 అశ్విని ఉ. 9-02 ఉ.శే.వ. 6-48 వ సా.వ. 5-58 ల 7-27 | **5** షష్ఠి సా. 5-48 భరణి ఉ. 7-22 కృత్తిక తె. 5-53 సా.వ. 6-37 ల 8-07 | **6** సప్తమి ప. 3-39 రోహిణి తె. 4-34 రా.వ. 8-59 ల 10-30 | **7** అష్టమి ప. 1-41 మృగశిర తె. 3-29 ఉ.వ. 9-54 ల 11-26 | **8** నవమి ప. 12-01 ఆర్ద్ర రా. 2-44 ఉ.వ. 11-37 ల 1-10 |
| **9** దశమి ఉ. 10-44 పునర్వసు రా. 2-25 ప.వ. 2-34 ల 4-09 | **10** ఏకాదశి ఉ. 9-52 పుష్యమి రా. 2-32 ఉ.వ. 10-27 ల 12-04 | **11** ద్వాదశి ఉ. 9-29 ఆశ్రేష తె. 3-07 ప.వ. 3-38 ల 5-16 | **12** త్రయోదశి ఉ. 9-38 మఘ తె. 4-13 ప.వ. 3-40 ల 5-20 | **13** చతుర్దశి ఉ. 10-15 పుబ్బ తె. 5-47 ప.వ. 12-44 ల 2-26 | ○ **14** పూర్ణిమ ఉ. 11-25 ఉత్తర పూర్తి ప.వ. 1-34 ల 3-18 | **15** ఫాల్గుణ బ॥ పాడ్యమి ప. 12-59 ఉత్తర ఉ. 7-44 సా.వ. 4-57 ల 6-43 |
| **16** విదియ ప. 2-51 హస్త ఉ. 10-05 సా.వ. 6-57 ల 8-43 | **17** తదియ సా. 4-57 చిత్ర ప. 12-40 రా.వ. 6-52 ల 8-39 | **18** చవితి రా. 7-02 స్వాతి ప. 3-16 రా.వ. 9-26 ల 11-12 | **19** పంచమి రా. 8-58 విశాఖ సా. 5-43 రా.వ. 10-05 ల 11-50 | **20** షష్ఠి రా. 10-36 అనూరాధ రా. 7-56 రా.వ. 1-57 ల 3-41 | **21** సప్తమి రా. 11-50 జ్యేష్ఠ రా. 9-45 తె.వ. 6-12 ల | **22** అష్టమి రా. 12-34 మూల రా. 11-07 ఉ.శే.వ. 7-54 రా.వ. 9-25 ల 11-07 |
| **23** నవమి రా. 12-49 పూర్వాషాఢ రా. 12-00 ఉ.వ. 9-03 ల 10-43 | **24** దశమి రా. 12-34 ఉత్తరాషాఢ రా. 12-24 ఉ.వ. 8-07 ల 9-45 తె.వ. 4-23 ల 5-59 | **25** ఏకాదశి రా. 11-48 శ్రవణం రా. 12-19 తె.వ. 4-13 ల 5-47 | **26** ద్వాదశి రా. 10-37 ధనిష్ఠ రా. 11-47 వర్జ్యము లేదు | **27** త్రయోదశి రా. 9-02 శతభిషం రా. 10-54 ఉ.వ. 6-43 ల 8-15 తె.వ. 4-59 ల | **28** చతుర్దశి రా. 7-09 పూర్వాభాద్ర రా. 9-43 ఉ.శే.వ. 6-30 వ | ● **29** అమావాస్య సా. 5-02 ఉత్తరాభాద్ర రా. 8-18 ఉ.వ. 6-44 ల 8-14 |

**14 హోళీ**
**30 ఉగాది**
**31 ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)**
**21 షహదత్ హజత్ అలీ (ఆర్.ఎ)**
**28 జుమాతుల్ వదా / సాబ్-ఇ-క్వాదర్**

### పూర్వాభాద్ర కార్తె (04.03.25 నుండి 16.03.25)

| | | |
|---|---|---|
| వరి | : | ఆలస్యంగా నాటితే రెండవ దఫా ఎరువులు వేయుట, సస్యరక్షణ. |
| గోధుమ | : | కోతలు. |
| జొన్న | : | వేసవి పంటకు సస్యరక్షణ. |
| రాగి | : | రబీ రాగి కోతలు. |
| సజ్జ | : | సస్యరక్షణ. |
| వేరుశనగ | : | ఎరువులు – సస్యరక్షణ |
| చెఱకు | : | జనవరిలో నాటిన పైరుకు ఎరువులు వేయుట, సస్యరక్షణ. |
| పప్పుదినుసులు | : | మాగాణిలో విత్తిన పెసర, మినుము కోయుట. |

### ఉత్తరభాద్ర కార్తె (17.03.25 నుండి 30.03.25)

| | | |
|---|---|---|
| రబీ ఆముదం | : | సస్యరక్షణ, కోతలు. |
| గోధుమ | : | ఆలస్యంగా విత్తిన పంట కోతలు. |
| వేరుశనగ | : | డిశెంబర్‌లో విత్తిన పంట నుండి కాయ త్రవ్వుట. |
| పప్పుదినుసులు | : | పెసర, మినుము కోతలు. |
| వరి | : | అశ్వని కార్తెలో వేయబోయే వరిని విత్తుట. రబీలో వేసిన వరిని కోయుట |
| మొక్కజొన్న | : | రబీలో వేసిన మొక్కజొన్న కోతలు |

# పెరటి మరియు మిద్దె తోటలు పెంచుదాం - పోషకాహార భద్రత సాధిద్దాం



అల్దాస్ జానయ్య
**ఉపకులపతి**

పోషకాహారలోపం ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసే తీవ్రమైన ఆరోగ్య సమస్య. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలు మరియు వివిధ రోగాలకు పోషకాహారలోపం అనేది ముఖ్య కారణంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు తెలియజేస్తున్నాయి. మనదేశంలో ఆహార ఉత్పత్తుల స్వయం సమృద్ధి సాధించినప్పటికీ పోషకాహార లోపం నిర్మూలనలో వెనుకబడి ఉన్నాము. ప్రపంచ ఆకలి సూచిక నివేదిక ప్రకారం భారతదేశంలో సుమారు 13.7% జనాభా పోషకాహారలోపంతో బాధపడుతున్నారని అంచనా వేయడం జరిగింది.

పోషకాహారలోపం మానవాభివృద్ధి మరియు దేశ ఆర్థిక ప్రగతికి ముఖ్యమైన సవాలుగా పరిణమించింది. ప్రపంచీకరణ వలన జంక్ ఫుడ్ / ఫాస్ట్ ఫుడ్ కల్చర్ త్వరగా వ్యాప్తి చెందడంతోపాటు ఆహార నాణ్యతా నియంత్రణ వ్యవస్థ బలహీనంగా ఉంది. దురదృష్టవశాత్తు మనదేశంలో కూడా ఈ సంస్కృతి విపరీతంగా వ్యాప్తి చెందటం జరుగుతున్నది. తద్వారా యువత ఊబకాయం, వివిధ పోషకాహార రుగ్మతలకు గురవుతున్నారు. బాలింతలు, గర్భవతులు మరియు చిన్నపిల్లలు కూడా ఈ విషవలయంలో చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా మనరాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు, గ్రామీణ ప్రాంతాల స్త్రీలు, పిల్లల్లో పోషకాహార రుగ్మతలను ఎక్కువగా గమనించడం జరిగింది.

పోషకాహారలోపాన్ని అధిగమించి సమతుల ఆహారాన్ని అందించడానికి పెరటి, మిద్దెతోటలు పెంపకం చాలా సులభమైన మరియు ఉత్తమమైన మార్గం. గ్రామీణ ప్రాంతాల వారు పెరటితోటలు, పట్టణ, నగర ప్రాంతాల వారు మిద్దెతోటలు పెంపకం ద్వారా పోషక, ఆహార భద్రతతోపాటు గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనోపాధికి దోహదపడుతుంది. వీటి ద్వారా వచ్చే పండ్లు మరియు కూరగాయలు ముఖ్యంగా పేద కుటుంబాల మరియు గ్రామీణ ప్రాంతాల వారికి సూక్ష్మపోషకాలకు మంచి వనరులని చెప్పవచ్చు. ఒక కుటుంబానికి కావాల్సిన రోజూవారి పోషకాలను వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచడం ద్వారా అందించవచ్చు. ప్రతి ఇంటిలో 3-4 రకాల ఆకుకూరలు, 4-5 రకాల కూరగాయలు, 1-2 రకాల పండ్ల మొక్కలు పెంచడం ద్వారా సంవత్సరం పొడవునా పురుగుమందుల అవశేషాలు లేని పోషక విలువలు గల తాజా కూరగాయలు, పండ్లు నిత్యం ఆహారంలో లభించడమే కాకుండా కుటుంబ ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడంతోపాటు కుటుంబ అవసరాలు పోగా మిగిలిన ఉత్పత్తులను అమ్మడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడి కేంద్రాల్లో ఖాళీ ప్రదేశాలలో కూరగాయలు (టమాట, వంకాయ, క్యాబేజీ మొ॥), ఆకుకూరలు (పాలకూర, తోటకూర, గోంగూర మొ॥) మరియు పండ్లు (జామ, అరటి, బొప్పాయి, అల్లనేరేడు, సపోట, సీతాఫలం, మొ॥) పెంచి వారికి అందించే మధ్యాహ్న భోజనంలో చేర్చడం వలన సమతుల ఆహారాన్ని అందించవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో ఆహార వైవిధ్యంను అలవరచడం, పోషకాహార భద్రత ప్రాముఖ్యతను వివరించడం, పంటకోతకు ముందు, కోత తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను, మెళకువలను నేర్పించడం ద్వారా పోషకాహారలోపాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చును.

మన విశ్వవిద్యాలయం విస్తరణలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ఆహార వైవిధ్య అవసరం, పోషకాహార అవసరం, వాటి ప్రాముఖ్యత, పెరటి, మిద్దెతోటల పెంపకం వంటి అంశాలపై శిక్షణా కార్యక్రమాలు, ప్రదర్శన క్షేత్రాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుంది. మనం ఆరోగ్యంగా జీవించాలన్నా, దేశ అభివృద్ధికి విలువైన వనరులుగా ఎదగాలన్నా మనం తీసుకునే ఆహారం, స్వచ్ఛమైన, నాణ్యమైన మరియు సమపోషకాలను కలిగి సేంద్రియ పద్ధతిలో పండించిన మన ఇంటి పంట మన వంట గదికి చేరితే రుచికరమైన, శ్రేష్టమైన ఆహారం మన నోటికి చేరుతుంది. తద్వారా ఆధునిక వైద్య పితామహుడిగా విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందిన హిప్పొక్రేట్స్ చెప్పినట్లు “ఆహారం నీ ఔషధం మరియు ఔషధం మీ ఆహారంగా” మారి మనం ఆరోగ్యంగా జీవిస్తాము.

కావున ప్రతి ఒక్కరు పెరటి, మిద్దెతోటల ఆవశ్యకతను తెలుసుకొని, వీటిని పెంచుకొంటూ, సమతుల పోషకాహారాన్ని తీసుకొని అందరూ ఆరోగ్యంగా జీవిస్తారని ఆశిస్తూ...

(అల్దాస్ జానయ్య)
**ఉపకులపతి**



## వరి

- వరిలో పిలక వేసే దశ / దుబ్బు చేసే దశ / గంట పోసే దశ చాలా కీలకమైనవి. ఈ దశలో సరియైన నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం మరియు పురుగులు తెగుళ్ళ యాజమాన్యం చేయనట్లైతే, వరిలో దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.
- రైతులు క్రమం తప్పకుండా పొలంలో కలియ తిరుగుతూ, నీటిని, పురుగులు, తెగుళ్ళ ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరం మేరకు మాత్రమే పురుగులు, తెగుళ్ళ మందులు పిచికారి చేయాలి. అనవసరంగా ఖర్చు చేయకుండా, నిపుణుల సలహాల మేరకు మాత్రమే పురుగులు /తెగుళ్ళ మందులు వాడాలి.
- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి పైర్లు దుబ్బు చేసే దశ నుండి చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ యాసంగి వరి పంటలో మొవ్వు చనిపోవడం అధికంగా గమనించడం జరిగింది. సాధారణంగా వరి పంటలో కాండం తొలిచే పురుగు రెండు దశల్లో (పిలక దశ మరియు చిరుపొట్ట దశల్లో) ఆశిస్తుంది. కనుక మార్చి మాసంలో వరి పంట అంకురం నుండి చిరుపొట్ట దశల్లో ఉన్న వరి పైర్లలో రెక్కల పురుగు ఉధృతిని బట్టి పురుగు మందులు పిచికారి చేయాలి. ఈ యాసంగిలో పురుగు ఉధృతి అధికంగా ఉంది. కావున తెల్లకంకులు ఎక్కువగా వచ్చి రైతులు నష్టపోయే అవకాశం ఉంది.
- కాండం తొలిచే పురుగు నివారణకు ముందస్తుగానే చిరుపొట్ట దశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% యస్‌పి 400 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60 మి.లీ. లేదా ఐసోసైక్లోసిరమ్ 120 మి.లీ. పిచికారి చేయాలి. ఒకసారి తెల్లకంకులు ఏర్పడిన తర్వాత ఎలాంటి పురుగు మందులు పిచికారి చేసినా ప్రయోజనం ఉండదని గమనించాలి.
- చౌడు ఉన్న ప్రాంతాలలో వరి పొలంలో నీరు ఉంచడం వలన చౌడు ప్రభావం తగ్గుతుంది
- రెక్కల పురుగులను లేదా గ్రుడ్ల సముదాయాలను రైతులు ఎప్పటికప్పుడు గమనించాలి.
- ఈ యాసంగిలో జనవరి–ఫిబ్రవరి మాసాల్లో చలి, చౌడు, జింకు ధాతులోపం మరియు సల్ఫైడ్ దుష్ప్రభావం వలన వరి పైర్ల ఎదుగుదల లోపించింది. రైతులు పంట ఎదుగుదల కొరకు పైపాటుగా నత్రజని ఎరువును అధిక మొత్తంలో వేయడం జరిగింది. ఇలాంటి పరిస్థితులలో ముఖ్యంగా మార్చి మాసంలో అగ్గితెగులు (ఆకుమచ్చ మరియు మెడవిరుపు దశ) ఆశించే అవకాశం ఉంది. కావున తెగులు తొలిదశలో ఎకరానికి ఐసోప్రోథయోలేన్ 300 మి.లీ. లేదా కాసుగామైసిన్ 500 మి.లీ. పిచికారి చేయాలి. ఒకవేళ ఉధృతి అధికంగా ఉన్నట్లైతే ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + టెబ్యుకొనజోల్ 80 గ్రా. లేదా అజాక్సీస్ట్రోబిన్ 16.7% + ట్రైసైక్లోజోల్ 33.3 యస్‌సి 200 మి.లీ. లేదా పికాక్సీస్ట్రోబిన్ + ట్రైసైక్లోజోల్ 400 మి.లీ. ఎకరానికి పిచికారి చేయాలి.
- తెగులు ఉధృతి గమనించినట్లైతే పొలాన్ని పూర్తిగా ఆరబెట్టినట్లైతే ఉధృతి ఇంకా ఎక్కువయ్యే అవకాశం ఉందని రైతులు గమనించాలి.

**డా॥ సిహెచ్. దామోదర్ రాజు, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 9440225385**

## మొక్కజొన్న

- యాసంగిలో ముందుగా విత్తుకున్న మొక్కజొన్న పైరుకోతకు సిద్ధంగా ఉంటుంది. పంట పరిపక్వదశకు చేరుకున్నప్పుడు కోత చేపట్టాలి. కండెల పైపొర ఎండిపోవుట, గింజలు వేలిగోరుతో నొక్కినప్పుడు గట్టిగా ఉండి నొక్కులు ఏర్పడకపోవుట, కొన్ని రకాలలో గింజ అడుగు భాగంలో నల్లటి



## చిరుధాన్యాలు

చార ఏర్పడుట వంటి లక్షణాలను బట్టి పరిపక్వదశను గుర్తించవచ్చు. కొన్ని వంగడాలలో పక్వదశకు చేరుకున్న తర్వాత కూడా పైరు పచ్చగా ఉండడం గమనించవచ్చు. గింజలలో 25-30 శాతం తేమ ఉన్నప్పుడు కోత చేపట్టాలి.

- కోసిన కండెలను ఎండలో బాగా ఆరబెట్టి గింజలలో సుమారు 15 శాతం తేమ ఉండగా యంత్రాల సహాయంతో నూర్పిడి చేసి గింజలను 2-3 రోజులు ఎండలో 10-12 శాతం తేమ వరకు ఆరబెట్టాలి.
- యాసంగిలో ఆలస్యంగా విత్తుకున్న మొక్కజొన్న పైరు పూతదశలో ఉన్న ఎడల నీటిని సమృద్ధిగా అందచేస్తూ నాల్గవ దఫా నత్రజని ఎరువును ఎకరాకు 50 కిలోల యూరియా రూపంలో పైపాటుగా వేయవలెను.
- కాండం కుళ్ళు తెగులు ఆశించు ప్రాంతాల్లో పూతదశ నుండి పైరు బెట్టకు గురి కాకుండా చూడవలెను. పొడతెగులు ఆశించినచో నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన 1-2 ఆకులను తీసివేయవలెను. కలుపు లేకుండా శుభ్రమైన పంటసాగును అవలంబించవలెను. ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి పొడతెగులును నివారించుకోవచ్చు.
- ప్రస్తుత యాసంగిలో బాగా ఆలస్యంగా విత్తిన మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించడం జరిగింది. పైరు మోకాలు ఎత్తు నుండి పూతదశకు వచ్చే వరకు పురుగు నివారణకు తగిన చర్యలు చేపట్టాలి. దీని నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పైనిటోరమ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పైరుపై మొక్కజొన్న సుడి తడిచేటట్లు పిచికారి చేయాలి. ఇసుక మరియు సున్నం కలిపిన మిశ్రమాన్ని 9:1 నిష్పత్తిలో ఎకరానికి 10 కిలోలు మొక్క సుడిలో పడునట్లుగా వేయాలి.

**జొన్న:** ఆలస్యంగా, నీటి పారుదల క్రింద వేసిన జొన్న పంటకు గింజ పాలుపోసుకునే దశలో బెట్టకు గురికాకుండా ఒక నీటి తడి ఇవ్వాలి. వర్షాధారంగా నల్లరేగడి పొలాల్లో విత్తిన జొన్న పంట కోతకు వస్తుంది. కంకుల్లో గింజ క్రింద భాగాన నల్లటి చార ఏర్పడిన తరువాత కోతను చేపట్టాలి. గింజలో తేమ శాతం 10% వరకు వచ్చేవరకు ఎండబెట్టుకొని నిల్వ చేసుకోవాలి.

**సజ్జ:** జనవరి మాసంలో విత్తుకున్న సజ్జ పంట పూత దశలో ఉంటుంది. బెట్ట నుండి పంటను కాపాడటానికి నీటితడులు ఇవ్వాలి. త్రుప్పు తెగులు ఆశించినప్పుడు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. మొక్కలు చిన్నగా ఉన్నట్లైతే అంతరకృషి చేసుకోవాలి.

**రాగి:** రాగి పంట పూత దశలో ఉంటుంది కావున పంట బెట్టకు గురికాకుండా నీటి తడులు ఇవ్వాలి. మొక్కల పైన అగ్గితెగులు గమనించినట్లైతే 1 గ్రా. కార్బండాజిమ్ 2.5 గ్రా. లేదా మ్యాంకోజెబ్ 2 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**కొర్ర:** కొర్ర పంట పూత దశలో ఉన్నట్లైతే బెట్టకు గురికాకుండా నీటితడులు ఇవ్వాలి.

**డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## వేరుశనగ

- యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం కోతదశలో ఉంది. అదేవిధంగా ప్రత్తి తరువాత ఆలస్యంగా సాగు చేసిన పంట ప్రస్తుతం గింజ పట్టే దశలో ఉంది. ఈ పరిస్థితులలో పంట నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.
- కోత సమయంలో కాయలు 70 నుండి 80% వరకు పక్వానికి వచ్చినప్పుడు మాత్రమే కోత చేపట్టాలి.



- ప్రస్తుతం వేరుశనగ కోత చేపట్టే యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా కూలీల కొరతను నియంత్రించవచ్చు. కోతానంతరం కాయలను 8-9% తేమ వచ్చే వరకు ఆరబెట్టాలి.
- ఆలస్యంగా సాగు చేసిన వేరుశనగలో ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి తెగులును గమనించిన వెంటనే ఒక ఎకరానికి 400 గ్రాముల క్లోరోథాలోనిల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ శిలీంధ్రనాశిని త్రుప్పు తెగులును కూడా అరికడుతుంది.
- కాండం కుళ్ళు తెగులును గమనించినప్పుడు ఒక లీటరు నీటికి 1 మి.లీ టెబ్యుకొనజోల్ కలిపి మొదళ్ళు తడిచేట్లు పిచికారి చేసుకోవాలి.

## ఆముదం

- యాసంగిలో సాగు చేసిన ఆముదం ప్రస్తుతం రెండో గెల దశలో ఉంది. ఈ పరిస్థితులలో పంటను నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.
- వేసవిలో రసంపీల్చు పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. నివారణకు 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ లేదా 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- ఎండు తెగులు గమనించినప్పుడు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి మొదళ్ళు తడిచే విధంగా పిచికారి చేయాలి.

## నువ్వులు

- వేసవిలో సాగు చేసిన నువ్వుల పంట ప్రస్తుతం 40-50 రోజుల దశలో ఉన్నది. ఈ దశలో పంట పూత మరియు కాయలు వస్తాయి కాబట్టి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.
- రసం పీల్చే పురుగుల ఉధృతిని గమనించినట్లైతే లీటరు నీటికి 2.0 మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచికారి చేసుకోవాలి.
- బూడిద తెగులును గమనించినట్లైతే లీటరు నీటికి 3 గ్రా. గంధకం కలిపి పిచికారి చేసుకోవాలి.

## కుసుమ

- యాసంగిలో సాగు చేసుకున్న కుసుమ పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. కోత ఉదయాన్నే కోసినప్పుడు గింజలు రాలడం తక్కువగా ఉండటమే కాకుండా ముల్లు మెత్తగా ఉండి కోత సులభం అవుతుంది.
- కోసిన తరువాత గింజలో 5-8% తేమ వచ్చే వరకు ఆరబెట్టాలి. దీనివలన గింజ నాణ్యత తగ్గకుండా ఉంటుంది.

## ప్రొద్దుతిరుగుడు

- వేసవిలో సాగు చేసిన ప్రొద్దుతిరుగుడు పంట ప్రస్తుతం 40-50 రోజుల దశలో ఉన్నది. ఈ దశలో పైపాటుగా ఎకరాకు 16 కిలోల యూరియాను పంటకు అందించాలి.
- ఆకర్షక పత్రాలు వికసించే దశలో లీటరు నీటికి 2 గ్రా. బోరాక్స్ పొడిని కలిపి పిచికారి చేసుకోవాలి.
- తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందే నెక్రోసిస్ తెగులును గమనించినట్లైతే లీటరు నీటికి 0.5 గ్రా. థయోమిథాక్సామ్ కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ యస్. వాణిశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.8186945838**

## అపరాలు

**పెసర, మినుము:** మెట్టలో అయితే విత్తిన వెంటనే ఎకరాకు లీటరు పెండిమిథాలిన్ 200 లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి. ఊద మరియు గడ్డిజాతి కలుపు నివారణకు వరి మాగాణుల్లో పైరు



విత్తిన 20-25 రోజుల మధ్యలో ఎకరాకు 250 మి.లీ. ఫినాక్సిప్రాప్-పి-ఇథైల్ లేదా 400 మి.లీ. క్విజలోపాప్ ఇథైల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి ఊదను సమర్థవంతంగా నివారించుకోవచ్చు. ఊదతో పాటు వెడల్పాటి కలుపు జాతి మొక్కలు ఉన్నట్లైతే ఎకరాకు ఇమాజితాఫిర్ 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసి కలుపును సమర్థవంతంగా నివారించుకోవచ్చు.

**నీటి యాజమాన్యం:** బెట్ట పరిస్థితుల్లో అవసరం మేరకు కీలక దశల్లో 1-2 తడులు ఇచ్చినచో మంచి దిగుబడులు సాధించవచ్చు. వేసవిలో నీటి పారుదల క్రింద పండిస్తారు. కానీ ఆలస్యంగా విత్తినప్పుడు చివరిలో పైరు బెట్టకు గురయ్యే అవకాశమున్నది. కాబట్టి అవకాశమున్నచోట పైరు పూత దశకు ముందుగా అనగా 30 నుండి 40 రోజుల వయస్సులో తేలికపాటి నీటి తడి ఇవ్వవలెను. సాధారణంగా మొత్తం పంట కాలంలో 300-450 మి.మీ. నీరు అవసరం ఉంటుంది.

**సస్యరక్షణ:**

**తెల్లదోమ:** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేకాక పల్లాకు తెగులును కూడా వ్యాపింపచేస్తాయి. తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మిథైల్ డెమటాన్ 2.0 మి.లీ. లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేయవలెను.

**తామర పురుగులు:** ఈ పురుగులు పైరు తొలి దశలో ఎక్కువగా ఆశించి ఆకుల్లో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగచేయుటమే కాకుండా ఆకుముడత అనే వైరస్‌ను వ్యాపింపచేస్తాయి. తామర పురుగుల నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**కంది:** యాసంగి కంది ప్రస్తుతం పరిపక్వత దశ నుండి కోత దశలో ఉంది. 80% పైన కాయలు పరిపక్వత చెందినట్లైతే పంట కోతకు సిద్ధంగా ఉన్నట్లుగా నిర్ధారించి, పంటను కోసి 1-2 రోజులు చేనులోనే ఎండిన తర్వాత పంటను గూళ్ళుగా పెట్టి వారం పది రోజులకు నూర్పిడి చేసినట్లైతే గింజలోని తేమ చాలా వరకు తగ్గి, నూర్పిడి సులువుగా జరుగును. ఆ తర్వాత గింజలను 9-10% తేమ ఉండేవరకు బాగా ఎండనిచ్చి నిల్వ చేయాలి. కోతకు 3-5 రోజుల ముందు క్వినాల్‌ఫాస్ 25% ఇ.సి 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో నిల్వలో పురుగు తాకిడిని ముఖ్యంగా బ్రూచిడ్స్ ఆశించకుండా కాపాడవచ్చు. నిల్వ చేసేటప్పుడు బాగా ఎండనిచ్చి ఆ తర్వాత ఏదైనా వంటనూనె 5 మి.లీ. కిలో గింజలకు పట్టించి నిల్వ చేసినచో నిల్వలో పురుగు ఉధృతిని తగ్గించవచ్చును.

**శనగ:**

**పంట కోత:** పంట పరిపక్వత దశకు చేరిన తర్వాత ఆకులు మరియు కాయలు పసుపు రంగుకు మారి ఆ తర్వాత వరి గడ్డి రంగుకు మారును. ఆకులు పూర్తిగా రాలిపోయి మొక్కలు ఎండిపోవును. మొక్కలను మొదలు వరకు కోసి కుప్పగా వేసుకొని ట్రాక్టర్‌తో తొక్కించి లేదా కర్రలతో కొట్టి కాయల నుండి గింజలను వేరు చేయాలి. యాంత్రీకంగా కంబైన్డ్ హార్వెస్టర్‌తో కూడా పంటను కోయవచ్చును.

**కోతానంతర జాగ్రత్తలు:** పంట కోసిన తర్వాత గింజలు తగినంతగా ఎండు వరకు ఆరబెట్టాలి. నూర్పిడి యంత్రాలతో కానీ, చేతితోకానీ నూర్చుకోవచ్చు. దుమ్ము, ధూళి, తాలు గింజల విత్తనాలను తొలగించి నిల్వ చేయాలి. నిల్వ చేయడానికి విత్తనాలలో తేమ 9 శాతం మించకుండా చూడాలి.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**



## చెఱకు

- ఈ వేసవి కాలంలో చెఱకు పంట బాల్యదశలో ఉంటుంది. ఇది చాలా కీలకమైన తేమ సున్నితమైన దశ. అనుకూలమైన వాతావరణ పరిస్థితులలో మొక్క మరియు మోడెం తోటలు బాల్యదశలో ఎక్కువ సంఖ్యలో పలకలు అభివృద్ధి చెంది, తర్వాత పంట ఏపుగా ఎదిగే దశకు చేరుకుంటాయి. నీటి ఎద్దడి మరియు అధిక ఉష్ణోగ్రత వలన మొక్క ఒత్తిడికి లోనై తోటలలో పిలకల సంఖ్య క్రమేపి తగ్గి, దీని ప్రభావం తోట ఎదుగుదలపై ఉండి దిగుబడి గణనీయంగా తగ్గుతుంది.
- ఆలస్యంగా నాటిన చెఱకు తోటలకు పోషక లోపాలతో పాటు చీడపీడల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. మోడెం సాగులో ఇనుము, జింక్ మరియు మాంగనీసు ధాతువుల లోపాలు ఎక్కువగా కనబడుతుంటాయి. కావున బాల్యదశలో ఉన్న చెఱకును నీటి ఎద్దడి, ఎండతీవ్రత బారిన పడకుండా తగు యాజమాన్య పద్ధతులు పాటించాలి.

1. ఇనుప ధాతువు లోపం వల్ల ఆకులు పాలిపోయి లేత పసుపు రంగు నుండి తెలుపు రంగుకు మారుతాయి. ఈ లక్షణాలు ఈనెల మధ్యభాగంలో ఏర్పడి ఈనెలకు సమాంతరంగా రేఖలుగా ఆకులకు పొడవునా చారలు ఏర్పడతాయి. ఉధృత దశలో ఉన్నప్పుడు లేత ఆకులు పూర్తిగా తెల్లగా మారతాయి. ఇనుము లోపం కనిపించిన వెంటనే ఒక శాతం అన్నబేధిని (ఫెర్రస్ సల్ఫేట్) మొక్కలపై పిచికారి చేసి లోపాన్ని సరిదిద్దుకోవాలి. లీటరు నీటికి 10 గ్రా. అన్నబేధి చొప్పున ఒక బద్ద నిమ్మకాయ లేదా 2 గ్రా. నిమ్మ ఉప్పు కలుపుకొని వారం, పది రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.
2. జింకు లోపం కనిపించిన మొక్కలలో ఆకుల ఈనెల వెంబడి పసుపు రంగు చారలు ఏర్పడి, లోపం ఎక్కువ అయినప్పుడు పెరుగుదల నిలిచిపోతుంది. దుబ్బు చేయడం నిలిచిపోయి, కొత్తగా ఏర్పడిన పిలకలు నిర్వీర్యం అవుతాయి. లోపం కనిపించిన తోటలకు లీటరు నీటికి 2 గ్రా. జంకు సల్ఫేట్ (0.2% ద్రావణం) చొప్పున వారం వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. ఆఖరి దుక్కిలో ముందుగానే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ చొప్పున నేలలో వేసినట్లైతే లోపం రాకుండా నివారించవచ్చు.
3. కార్శి తోటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించకపోవడం వలన కార్శితోటలలో సగటు చెఱకు దిగుబడులు పెరగకపోవడం ప్రధాన కారణం. అందువలన చెఱకు సాగు వేసే రైతులు వివిధ రకాల ఎంపిక నుండి మొక్క తోటలను సకాలంలో నరకటం వరకు జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. చెఱకును నరికిన తరువాత కార్శి చేయడం వలన విత్తనపు ఖర్చుతో పాటు పొలం తయారీ ఖర్చు తగ్గి చెఱకు సాగులో ఎంతో లాభం చేకూరుతుంది. దిగుబడుల విషయంలో మొక్క తోటలలో కన్నా కార్శి తోటలలో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు. మోడు చెక్కిన 10-20 రోజుల లోపల భూమిలో తగినంత పదును ఉన్నప్పుడు రెండు సాళ్ల వరుసల మధ్య దుక్కి చేసి భూమి గుల్ల బారేటట్లు చేయాలి. మొక్క తోట వేర్లు నశించి ప్రతి పిలకల నుండి కొత్త వేరు అభివృద్ధి చెందుతుంది. దీని వలన కార్శి తోటల వేర్లకు ప్రాణ వాయువు సక్రమంగా అందుతుంది. అంతేకాకుండా తడులు పెట్టినప్పుడు నీరు భూమిలోకి ఇంకి కార్శి పిలకలకు నీరు, పోషకాలు సమాంతరంగా తీసుకుంటాయి.

డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్
వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్,
ఫోన్ నెం. 9849535756

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాల (జూన్ నుండి సెప్టెంబర్) కాలంలో 962.6 మి.మీ వర్షపాతం (+30 శాతం), పోస్ట్ మాన్సూన్ సీజన్‌లో (అక్టోబర్ నుండి డిసెంబర్) 86.5 మి.మీ వర్షపాతం (−24 శాతం) మరియు చలి కాలంలో (జనవరి నుండి ఫిబ్రవరి) 0.2 మి.మీ వర్షపాతం (−98 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (27.02.2025) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి − 113 శాతం (5324752), జొన్న − 152 శాతం (212214), మొక్కజొన్న − 127 శాతం (750840), కంది − 181 శాతం (5798), శనగ − 66 శాతం (219398), పెసర − 37 శాతం (8550), మినుములు − 89 శాతం (42735), ఉలవలు − 32 శాతం (372), వేరుశనగ − 90 శాతం (235810), ప్రొద్దుతిరుగుడు − 74 శాతం (16840) మరియు కుసుమ − 57 శాతం (6771) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం యాసంగి పంటకాలంలో ఇప్పటి వరకు 109 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 115 శాతం, పప్పుదినుసులు 67 శాతం, నూనె గింజల పంటలు 79 శాతం సాగుచేయటం జరిగింది.

భారత వాతావరణ విభాగం న్యూఢిల్లి వారి ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం రాష్ట్రంలో మార్చి మాసంలో కనిష్ట మరియు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం నుండి సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే సూచనలున్నాయి మరియు వర్షపాతం సాధారణం నుండి సాధారణం కంటే తక్కువ నమోదయ్యే సూచనలున్నాయి.

### వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- నీటి వసతి గల ప్రాంతాలలో పచ్చిమేత కొరకు పశుగ్రాస పంటలుగా జొన్న మరియు మొక్కజొన్న పంటలను వేసుకోవచ్చును. తక్కువ నీటి వసతి గల ప్రాంతాలలో పశుగ్రాస పంటలుగా సజ్జ మరియు బొబ్బర్ల పంటలను వేసుకోవచ్చును.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కారణంగా నీటి వసతి తక్కువ ఉన్న ప్రాంతాలలో ఆరుతడి పంటలకు నేల స్వభావం బట్టి 10−15 రోజుల వ్యవధిలో తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి.
- వరి పంట దుబ్బు చేసే దశ నుండి అంకురం దశ వరకు పొలంలో 2 సెం.మీ. నీరు నిలువ ఉంచాలి. అంకురం దశ నుండి పూత దశ వరకు నీటి లభ్యతని బట్టి పొలంలో 2 సెం.మీ. నుండి 5 సెం.మీ. నీరు నిలువ ఉంచాలి.
- మొక్కజొన్న పూత దశ ఏర్పడే 10 రోజుల ముందు నుండి కంకి ఏర్పడిన 25 రోజుల తర్వాత వరకు పంట బెట్ట పరిస్థితులను తట్టుకోలేదు కావున రైతులు పైరుకు జీవసంరక్షక నీటి తడి ఇవ్వవలెను.
- పూత దశలో ఉన్న పెసర మరియు మినుము పంటలకు (35−40 రోజుల) తేలికపాటి నీటి తడి ఇవ్వాలి.
- యాసంగిలో ఆలస్యంగా సాగు చేసిన వేరుశనగ గింజ అభివృద్ధి దశలో ఉంది. ఈ దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.
- 40 నుండి 50 రోజుల దశలో ఉన్న నువ్వుల పంట పూత మరియు కాయ ఏర్పడుతుంది కాబట్టి పంటను నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.

ఈ మాసంలో నెలకొనే వాతావరణ పరిస్థితులు ఈ క్రింద ఉదహరించిన పురుగులు తెగులు వివిధ పంటలలో ఆశించుటకు అనుకూలం.

- ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన పెసర మరియు మినుము పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగి పల్లాకు తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు,
- ముందు జాగ్రత్త చర్యగా ఎకరానికి 10 పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి.
- ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన నువ్వుల పంటలో రసంపీల్చే పురుగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు, 1.0 గ్రా. ఎసిఫేట్ లేదా 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9492359789

# యాసంగి వరి సాగులో తెల్ల కంకి సమస్య-యాజమాన్యం

డా॥ ఆర్. శ్రవణ్ కుమార్, డి. అశ్విని, బి. మాధవి, డా॥ వై. హరి, జి. నీలిమ, డా॥ బి. సతీష్ చంద్ర, డా॥ వి. వెంకన్న, డా॥ సి.హెచ్. రాములు, డా॥ కె. రాజేంద్రప్రసాద్, డా॥ సి.హెచ్. అనూష మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్



ప్రస్తుతం మన రాష్ట్రంలో యాసంగి వరి పంట వివిధ దశలలో కనిపిస్తున్నది. యాసంగిలో వరి పంటను ముఖ్యంగా మొగిపురుగు ఆశించి ఎక్కువ నష్టం కలిగిస్తుంది. అందువలన మొగి పురుగు వలన కలిగే నష్టం (తెల్లకంకులు) మరియు యాజమాన్యం గురించి క్రింద వివరించడం జరిగింది.

ఈ మొగిపురుగు కేవలం వరిని మాత్రమే ఆశిస్తుంది. దీనినే కాండంతొలిచే పురుగు అని పిలుస్తారు. ఈ పురుగు నారుమడిలో ఆశిస్తే మొక్కలు చనిపోతాయి. పిలకదశలో ఆశిస్తే మొవ్వులు ఎండి చనిపోతాయి. అంకురం నుండి చిరుపొట్ట దశలో ఆశించినప్పుడు ఈనిన తర్వాత తెల్లకంకులు బయటికి వస్తాయి. ప్రస్తుతం చాలా ప్రాంతాలలో ఈ తెల్లకంకులు ఏర్పడి, నష్టం కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పిలకదశలో ఆశించినప్పుడు సరియైన నివారణ చర్యలు తీసుకోనట్లైతే తర్వాత తెల్లకంకులు ఎక్కువగా ఏర్పడి దిగుబడిలో తీవ్రనష్టం వచ్చే అవకాశం ఉంటుంది.

ఈ పురుగు జీవిత చక్రంలో నాలుగు దశలు ఉంటాయి. గ్రుడ్డు దశ, లార్వా, ప్యూపా మరియు రెక్కల పురుగు దశ. వీటిలో లార్వా దశ పంటను తిని నష్టం కలిగిస్తుంది. ఈ పురుగు జీవిత చక్రం 32 నుండి 45 రోజులలో పూర్తవుతుంది. తల్లి రెక్కల పురుగు గ్రుడ్లను గుంపులు గుంపులుగా ఆకుల కొనలపై మరియు కాండం మీద పెడ్తుంది. ఒక్కో గుంపులో 100-200 గ్రుడ్లు ఉంటాయి. గ్రుడ్లను గోధుమ రంగు వెంట్రుకలతో కప్పివేస్తుంది. గ్రుడ్ల నుండి 5-8 రోజులలో పిల్ల పురుగులు బయటికి వస్తాయి. తొలుత తెలుపు గోధుమ రంగులో ఉండే పిల్ల పురుగులు, ఎదిగిన తర్వాత నారింజ-పసుపు రంగు తలను కలిగి ఉంటాయి. లార్వా దశ 33-41 రోజులలో పూర్తవుతుంది. ప్యూపాదశను కాండము లోపల జరుపుకొంటుంది. ప్యూపా నుండి 6-10 రోజులలో రెక్కల పురుగులు బయటికి వస్తాయి. తల్లి రెక్కల పురుగు మధ్యస్థ సైజులో ఉండి, గోధుమ రంగు లేదా ఎండుగడ్డి లేదా పసుపురంగులో ఉండి రెక్కలను కలిగి, ముందు జత రెక్కలపై నల్లని చుక్కను కలిగి ఉంటాయి.

### యాజమాన్యం:

- పురుగు ఉధృతిని గమనించడానికి దీపపు ఎరను, సోలార్ దీపపు ఎరను లేదా లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసి నిఘా ఉంచాలి.
- పిలకదశలో ఎకరానికి 3 చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చి అందులో వారానికి బుట్టకి 25-30 రెక్కల పురుగులు పడినట్లైతే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- పిలకదశలో ఉన్న వరి పంటలో ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3 సిజి లేదా 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి లేదా 4 కిలోల క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు బురద పదనులో వేయాలి.
- వరి పంట చిరుపొట్ట దశలో రెక్కల పురుగు ఉధృతి గమనించినట్లైతే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పి 2 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఐసోసైక్లోసిరామ్ 0.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- సస్యరక్షణ మందులు ఉపయోగించేటప్పుడు సరియైన సిఫారసు చేసిన జాగ్రత్తలు పాటించాలి.
- పంటను కోసేటప్పుడు నేలకు దగ్గరగా కోయాలి. కొయ్య కాళ్ళు పెద్దగా ఉండకూడదు.
- వేసవిలో లోతు దుక్కులు చేపట్టాలి.
- సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9885257714

# వరిలో డ్రోన్ల ద్వారా జీవనియంత్రణ మందులు పిచికారి చేయడానికి పాటించాల్సిన నిర్ధిష్ట ప్రమాణాలు



**కె. సుప్రియ, కె. భార్గవి, డా॥ యస్. రామగోపాల వర్మ, డా॥ టి. కిరణ్ బాబు, డా॥ యస్. ఉపేందర్ మరియు డా॥ యస్. లింగయ్య**

వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారతదేశంలో పండించే పంటలలో వరి మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో వరి పంట 2.3 మిలియన్ హెక్టార్ విస్తీర్ణంలో సాగు చేయబడుతుంది. దురదృష్టవశాత్తు వరి పంటను వివిధ రకాల చీడపీడలు ఆశించడం వలన చాలా ఆర్థిక నష్టానికి గురవుతుంది. ఈ నష్టాన్ని అరికట్టడానికి వ్యవసాయ రంగం వినూత్న పద్ధతులను పాటించవలసి ఉంటుంది. ప్రస్తుత వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. నూతన టెక్నాలజీ సహాయంతో సాగు పద్ధతులు సులభతరం అయ్యాయి. ఇందులో భాగంగా డ్రోన్ల వినియోగం రోజురోజుకి పెరుగుతుంది.

వ్యవసాయ రంగంలో డ్రోన్లు ముఖ్యంగా పురుగు మందులు, గడ్డి మందులు, పిచికారి చేయడం, ఎరువులు, విత్తనాలు చల్లడం, పంట చేలల్లో ఫోటోలు తీసి చీడపీడల్ని గుర్తించి సరైన సమయంలో పిచికారి చేయడం వంటి పనులు చేస్తున్నాయి. వ్యవసాయ కూలీల కొరత, నీటి కొరత రోజురోజుకీ పెరుగుతుంది. బరువైన పంపుతో వరిలాంటి పంట పొలాల్లో దిగి పిచికారి చేయడం చాలా కష్టతరంగా ఉంటుంది. అంతేకాకుండా ఎక్కువ సమయం పడుతుంది. డ్రోన్ల ద్వారా పురుగు మందులు, ఎరువులను ఉపయోగించడం, నేల సామర్థ్యాన్ని పరీక్షించడం మరియు సమర్థవంతమైన నీటి యాజమాన్యం చేయడం వలన పెట్టుబడులను సులభంగా తగ్గించవచ్చు. అలాగే పంటనాణ్యత మరియు దిగుబడి పెరిగి రైతుకు లాభాలు చేకూరుతాయి.

అయితే ప్రస్తుతం డ్రోన్లు రసాయన మందులు పిచికారి చేయడానికి ఎక్కువగా వాడుతున్నారు. రసాయన మందులు ఎక్కువగా వాడటం వలన చీడపీడలకు మందులను తట్టుకునే శక్తి ఏర్పడుతుంది మరియు పర్యావరణం దెబ్బతింటుంది. అలాగే పండ్లు మరియు కూరగాయలు మరియు ఇతర పదార్థాలలో రసాయన అవశేషాలు ఉంటున్నాయి.

ఈ మధ్యకాలంలో ప్రజలలో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్నందున సేంద్రియ వ్యవసాయానికి ఎక్కువ ఆదరణ పెరుగుతుంది. అందువలన జీవనియంత్రణ మందుల వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో డ్రోన్ల ద్వారా జీవనియంత్రణ మందులను పిచికారి చేయడానికి కావలసిన నిర్ధిష్ట ప్రమాణాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రయత్నంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2022 మరియు 2023వ సంవత్సరంలో పరిశోధన చేపట్టి, డ్రోన్లతో జీవనియంత్రణ మందులు పిచికారి చేసేటప్పుడు పాటించాల్సిన నిర్ధిష్ట ప్రమాణాలను రూపొందించడం జరిగింది. ఈ పరిశోధనలో వరిలో ముఖ్యంగా ఉపయోగించే జీవనియంత్రణ మందులు అయిన బవేరియా బాసియానా, లెకానిసిలీయం లెకాని, బాసిల్లస్ తురింజియెన్సిస్ కుర్స్టాకి మరియు సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్‌లను డ్రోన్ ద్వారా పిచికారి చేయడానికి ఉపయోగించారు.

| జీవనియంత్రణ మందు | డ్రోన్ మోతాదు |
|---|---|
| 1. బవేరియా బాసియానా | 68.03 గ్రా./లీ. |
| 2. లెకానిసిలియం లెకాని | 68.03 గ్రా./లీ |
| 3. బాసిల్లస్ తురింజియెన్సి వర్ కుర్స్టాకి | 27.21 గ్రా./లీ |
| 4. సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ | 68.03 గ్రా./లీ |

### వరిలో డ్రోన్ ద్వారా జీవనియంత్రణ మందులను పిచికారి చేయడానికి పాటించాల్సిన నిర్ధిష్ట ప్రమాణాలు:

నాసిక / నాజిల్ : ఫ్లాట్ ఫ్యాన్ నాజిల్ వాడడం వలన మొక్క యొక్క అన్ని భాగాలకు మందు సరఫరా అవుతుంది.

డ్రోన్ ఎగిరే వేగం : 3.6 మీ./సె.

డ్రోన్ ఎగిరే ఎత్తు : 2.5 మీ.

- జీవనియంత్రణ మందులు సిఫారసు చేయబడిన మోతాదులో మాత్రమే వాడాలి. కానీ డ్రోన్‌తో పిచికారి చేసేటప్పుడు నీటి పరిమాణం తక్కువగా ఉంటుంది. సాధారణ పంపుతో పిచికారి చేయడానికి ఒక హెక్టారుకి 500 లీటర్ల నీరు అవసరం అయితే, డ్రోనుకి కేవలం 36.75 లీటర్ల నీరు మాత్రమే అవసరం అవుతుంది.
- డ్రోనుతో పిచికారి చేయడానికి గాలి వేగం ఉన్నప్పుడు ముఖ్యం. గాలి వేగం గంటకు 5-10 కి.మీ. వరకు పిచికారి చేయవచ్చు. అంతకన్నా ఎక్కువ గాలి వేగం ఉంటే డ్రోనుతో పిచికారి చేయకూడదు.
- డ్రోన్‌తో పిచికారి చేయడానికి ఉదయం 6 గం. నుండి 9 గం.వరకు మరియు మధ్యాహ్నం 3 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు అనుకూలంగా ఉంటుంది.
- పిచికారి చేసిన తర్వాత కనీసం 6-12 గంటల పాటు వర్షం పడకుండా ఉండేలాగా ప్రణాళిక వేసుకోవాలి.
- హైటెన్షన్ ఎలక్ట్రిక్ లైన్లు సెల్‌ఫోన్ టవర్ల దగ్గర డ్రోన్లను వాడకూడదు.
- పొడి జీవనియంత్రణ మందులు వాడిన తరువాత నాజిల్స్‌ని జాగ్రత్తగా శుభ్రపరచుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9502943807**

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయశాఖ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న "రైతు నేస్తం"

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 04.03.2025 | వివిధ పంటల్లో రకాలు/విత్తనాలు ఎంపిక సూచనలు | **డా॥ యం.వి.నగేష్ కుమార్,** డైరక్టర్ (సీడ్స్) పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్, ఫోన్ నెం. 8008404874 |
| 11.03.2025 | వేసవి ఉష్ణోగ్రతలో వివిధ పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు | **డా॥ జి. శ్రీనివాస్,** డైరక్టర్ (ఎ.ఆర్.ఐ.) పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9000407408 |
| 18.03.2025 | రానున్న వేసవిలో చేపట్టవలసిన యాజమాన్యం | **డా॥ సయ్యద్ అహ్మద్ హుస్సేన్,** సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి)&హెడ్, కాలేజ్ ఫామ్, పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9849281608 |
| 25.03.2025 | వేసవి పశుగ్రాస యాజమాన్యం | **డా॥ ఆర్.టి.వి. బాలాజీ నాయక్,** ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ ఫోరేజ్ క్రాప్స్, పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9440104717 |

# వేసవి అపరాలలో సస్యరక్షణ



**టి.లక్ష్మణ్, సి.యమున మరియు ఎం. రత్నమాల**
ఏరువాక కేంద్రం, తాండూర్

తెలంగాణ రాష్ట్రంలో పండించే పంటలలో ఒకటి అయిన ప్రత్తిని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ప్రత్తి పంటను తీసిన తర్వాత లేదా రబీ మొక్కజొన్న, వేరుశనగ తర్వాత లేదా పసుపు తీసిన తర్వాత లేదా రబీ వరి వేయని మాగాణి భూముల్లో 2 లేదా 3 నీటి తడులు ఇచ్చే సదుపాయం ఉన్నటువంటి పరిస్థితుల్లో వేసవి పంటగా స్వల్పకాలిక పంట అయిన పెసర, మినుము సాగు చేయడం వల్ల రైతులు అధిక దిగుబడి పొందడమే కాక, గృహ అవసరాలకు పప్పుదినుసులు అందుబాటులోకి వస్తాయి. అంతేగాక రైతులకు ఆర్థికంగా లాభసాటిగా ఉంటుంది.

వర్షాకాలంలో ఉండే వాతావరణ పరిస్థితులతో పోల్చితే వేసవిలో ఉండే వాతావరణ ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు, గాలిలో తక్కువగా ఉండే తేమ మరియు బెట్ట పరిస్థితుల్లో పెసర-మినుము పంటలలో రసంపీల్చు పురుగుల బెడద ఎక్కువగా ఉంటుంది. దాని వలన వైరస్ తెగుళ్ళు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశము ఉంది. కావున ఈ వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ కీటకాలు మరియు తెగుళ్ళ ఉధృతి సకాలంలో గుర్తించి తగిన నివారణ చర్యలు పాటించిన యెడల రైతులు అధిక దిగుబడిని పొందగలుగుతారు.

వేసవిలో పెసర-మినుము పంటలలో రసం పీల్చు పురుగులు ముఖ్యంగా తామర పురుగు, చిత్తపురుగులు, తెల్లదోమ, పేనుబంక ఎక్కువ ఆశించి నష్టం కలగజేస్తాయి. అదే విధంగా వైరస్ తెగుళ్ళలో పల్లాకు తెగులు మరియు సీతాఫలం తెగులు ఎక్కువ నష్టాన్ని కలుగజేయును.

**తెల్లదోమ:** పొడి వాతావరణం మరియు 7-10 రోజుల బెట్ట పరిస్థితులు ఉన్నట్లయితే తెల్లదోమ ఎక్కువగా ఆశిస్తుంది. ఈ పురుగులు ఆకుల్లోని రసాన్ని పీల్చి ఎల్లో మొజాయిక్ అనే వైరస్‌కి ప్రవేశ కారకాలుగా పనిచేస్తాయి. అంతేగాక మొక్కల్లోని రసాన్ని పీల్చేటప్పుడు ఈ వైరస్ మొక్కలోకి ప్రవేశించి ఆకులను పసుపు పచ్చ రంగుకు మారుస్తాయి. దీనిని పల్లాకు తెగులు అని అంటారు.

తెల్లదోమ నివారణకు 2 మి.లీ. మిథైల్ డెమటాన్ లేదా 2 మి.లీ. ట్రైజోఫాస్ లేదా 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ లేదా 1.5గ్రా. డైఫెన్ థయూరాన్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**చిత్తపురుగులు:** ఈ పురుగులు పైరుపై రెండు ఆకుల దశలో ఆశించి రంధ్రాలు చేస్తాయి. వీటి బెడద ఎక్కువగా ఉన్నప్పుడు నివారించకపోతే 80 శాతం మొక్కలు ఈ దశలోనే చనిపోతాయి. నివారణకు 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:** పొడి వాతావరణం మరియు పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు మరియు బెట్ట వాతావరణంలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉండును. తామర పురుగులు మొక్కను తొలి దశలో ఆశించి లేత ఆకులపై వృద్ధి చెంది ఆకుల అడుగు నుండి రసాన్ని పీలుస్తాయి. అప్పుడు ఆకులు డొప్పగా మారుతాయి. మొక్క నుండి రసాన్ని పీల్చడం ద్వారా మొక్కలు గిడసబారి ఎదుగుదల తగ్గిపోతుంది. అంతేగాక ఆకుముడత అనే వైరస్ వ్యాధిని కూడా వ్యాపింపచేస్తుంది. పూత దశలో ఆశించినట్లయితే పూతరాలుట మరియు కాయలు ఏర్పడవు. కాయ తొడిగే దశలో ఆశించినట్లయితే కాయలు వంకరలు తిరిగి సరిగా ఎదగక, గింజలు తాలుగా మారుతాయి. నివారణకు ఎసిఫేట్ 75 యస్.పి 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పెసర, మినుము పంటలను ఆశించు వైరస్ తెగుళ్ళు వాటి నివారణ:**

**సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు:** ఈ తెగులు సోకిన ఆకులపై గోధుమ రంగు గుండ్రని చిన్న చిన్న మచ్చలు కనిపించి అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఈ మచ్చలు పెద్దవై ఆకులు ఎండి రాలిపోతాయి. దీని వలన కాయల్లో గింజలు సరిగా నిండవు. నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా 1 గ్రా.

క్లోరోథలోనిల్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 1 గ్రా. థయోఫొనేట్ మిథైల్ కలిపి పిచికారి చేయడం ద్వారా ఆకుమచ్చ తెగులుతో పాటు బూడిద తెగులును కూడా నివారించవచ్చు.

**బూడిద తెగులు:** ఈ తెగులు విత్తిన 30-35 రోజుల తర్వాత గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, ముదురు ఆకులపై, బూడిద రూపంలో చిన్న చిన్న మచ్చలుగా కనపడి, అవి క్రమేణా పెద్దవై ఆకులపైన, క్రింది భాగాలకు మరియు కొమ్మలు, కాయలకు వ్యాపిస్తుంది. నివారణకు లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 1 గ్రా. థయోఫానేట్ మిథైల్ లేదా 2 మి.లీ. హెక్సాకొనజోల్ లేదా మైక్లోబూటానిల్ 0.5 గ్రా. లేదా డైఫెన్‌కొనజోల్ 1.0 మి.లీ. కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. నిర్దేశించిన కాలంలో విత్తుకోవాలి. మొక్కల సాంద్రత సరిపడా ఉండాలి. తెగులును తట్టుకునే రకాలను విత్తుకోవాలి.

**బాక్టీరియల్ బ్లైట్:** ఈ తెగులు సోకిన మొక్కల ఆకులపై గోధుమ వర్ణంలో చిన్న చిన్న మచ్చలు కనిపిస్తాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్ మరియు 100 మి.గ్రా. ప్లాంటోమైసిన్ కలిపి 12 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**ఆకుముడత తెగులు (మొవ్వుకుళ్ళు):** ఇది వైరస్ జాతి తెగులు. తామర పురుగుల ద్వారా ఈ తెగులు ఒక మొక్క నుండి వేరొక మొక్కకు వ్యాపిస్తుంది. తెగులు ఆశించిన మొక్కల ఆకుల అంచులు వెనుకకు ముడుచుకుని మెలికలు తిరిగి గిడసబారి రాలిపోతాయి. ఆకుల అడుగుభాగంలోని ఈనెలు రక్తవర్ణాన్ని పోలి ఉంటాయి. లేత దశలో వ్యాధి సోకినట్లయితే తలలు మాడి మొక్కలు ఎండిపోతాయి. ముదురు దశలో తెగులు పాక్షికంగా ఉండి అతి తక్కువ కాపు ఉంటుంది. ఈ తెగులు సోకిన మొక్కలను పీకి తగులబెట్టటం ద్వారా పైరులోని ఇతర మొక్కలకు వ్యాపించకుండా అరికట్టవచ్చు. నివారణకు లీటరు నీటికి 1 గ్రా. ఎసిఫేట్ లేదా 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1.5 మి.లీ. ఫిప్రోనిల్ మందును కలిపి పిచికారి చేయాలి. యం.జి.జి.-295, యల్.బి.జి.-460 పెసర రకాలు ఈ తెగులును కొంతవరకు తట్టుకొంటాయి.

**పల్లాకు తెగులు:** పొడి వాతావరణం, బెట్ట పరిస్థితులు మరియు తేమ ఎక్కువగా ఉండటం వల్ల వేసవిలో సాగుచేసే పెసర, మినుము పంటలో తెగులు తీవ్రంగా ఉండటమే గాక అధిక నష్టాన్ని కలిగిస్తుంది. పల్లాకు తెగులు తెల్లదోమ ద్వారా జెమిని వైరస్ అనే వైరస్ వల్ల సోకుతుంది. ఈ వైరస్ తెగులు సోకిన కలుపు మొక్కలు లేదా పిల్లిపెసర నుండి మినుము, పెసర పంటకు తెల్లదోమ ద్వారా వ్యాపించును. తెగులు మొదటగా లేత ఆకులపై ప్రకాశవంతమైన పసుపు మచ్చలుగా ఏర్పడి క్రమేపి నిండు పసుపు రంగుకు మార్పు చెందును. ఆకులపైన పసుపు మరియు ఆకుపచ్చ మచ్చలు కనిపిస్తాయి. అందువల్ల ఈ తెగులును మొజాయిక్ తెగులు అంటారు. తెగులు ఆశించిన మొక్కలు ఆలస్యంగా మొగ్గ తొడిగి పూత, కాయ తక్కువగా ఉండును. కాయదశలో తెగులు సోకినట్లయితే గింజలు పసుపు రంగుకు మారును మరియు తాలు గింజలు కూడా ఏర్పడును.

**ఈ తెగులు నివారణకు చేపట్టవలసిన చర్యలు:**

1. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి.
2. పంట విత్తే సమయంలో పొలం చుట్టూ నాలుగు వరుసల్లో మొక్కజొన్న/ జొన్న/ సజ్జ పంటను విత్తుకుంటే పక్క పొలం నుంచి తెల్లదోమ పురుగు రాకుండా నివారించవచ్చు.
3. పొలంలో అక్కడక్కడా జిగురు అట్టలు ట్రాప్స్‌ను ఉంచినట్లయితే తెల్లదోమలు వాటికి అతుక్కొని చనిపోవును. తద్వారా ఉధృతిని అరికట్టవచ్చును.
4. 5% వేప కషాయం లేదా వేపగింజల నూనె 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే తెల్లదోమను అరికట్టవచ్చును.


తెల్లదోమ


తామర పురుగులు


సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు










5. పెసరలో డబ్ల్యు.జి.జి-37, డబ్ల్యు.జి.జి-42 మరియు యం.జి.జి - 351 రకాలు అదేవిధంగా మినుములో ఎల్.బి.జి - 752, ఎల్.బి.జి-787 మరియు పి.యు-31 రకాలు పల్లాకు తెగులును కొంత వరకు తట్టుకోగలవు.
6. తెల్లదోమ నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1.5 మి.లీ. ట్రైజోఫాస్ లేదా 1.0 గ్రా. ఎసిఫేట్ లేదా 0.3 గ్రా. ఎసిటామిప్రిడ్ మందును కలిపి పిచికారి చేసిన యెడల ఈ పురుగును అరికట్టవచ్చును.

**సీతాఫలం తెగులు:** పొడి వాతావరణం, బెట్ట పరిస్థితులలో మరియు పేనుబంక ద్వారా ఈ తెగులు సోకుతుంది. ఈ వైరస్ తెగులు సోకిన మొక్కల లేత ఆకులు, కాడలు, ఆకులు పెద్దవిగా మారి ఆకుపై ఉబ్బెత్తుగా అయి ముడుతలు పడి సీతాఫలం కాయ మాదిరిగా కనిపిస్తుంది. ఆకులు ముదురు ఆకుపచ్చ రంగుకు మారుతాయి. ఈ తెగులు 70% వరకు విత్తనం ద్వారా కూడా వ్యాప్తి చెందును. పేనుబంక నివారణకు విత్తనశుద్ధి తప్పని సరిగా చేసుకోవాలి. ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9704246094**

**పి.జె.టి.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 05.03.2025 | గ్రామీణాభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలు |
| | వేసవి నువ్వు సాగు విధానం |
| 12.03.2025 | వ్యాధులు మరియు వాటి నివారణ చర్యలు |
| | జగిత్యాల వారి నూతన వరి వంగడాలు |
| 19.03.2025 | రక్తపుష్టి - ఆరోగ్యమైన మహిళలు |
| | వరిలో జింకు లోప నివారణ చర్యలు |
| 26.03.2025 | పారిశుధ్యాన్ని మెరుగు పరచడంలో ఎస్.హెచ్.జి. ల పాత్ర |
| | వరిలో చీడపీడల నివారణ |

# వేసవి నువ్వులలో చీడపీడల యాజమాన్యం

డా॥ ఓ. శైల, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, డా॥ బి. రాజశేఖర్,
డా॥ ఆదిశంకర్, కె. రామకృష్ణ,
ఇ. జ్యోత్స్న, వై. సుల్తాన్ మరియు ఆర్. రఘువరన్ సింగ్
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం



తెలుగు రాష్ట్రాలలో నువ్వులు విస్తృతంగా సాగు చేయబడుతుంది. తక్కువ పెట్టుబడితో సాగు చేయబడుతున్న నూనెగింజల పంటలలో నువ్వుల పంట ఒకటి. స్వల్పకాలంలో చేతికి అందివచ్చే పంట. నువ్వులలో 50% నూనె మరియు 20% ప్రోటీన్లు ఉంటాయి. తక్కువ నీటి వసతి, తక్కువ పెట్టుబడితో రైతులు సాగు చేయవచ్చును. నువ్వులను వేసవి పంటగా జనవరి 2వ వారం నుండి ఫిబ్రవరి 2వ వారం వరకు విత్తుకోవచ్చు. తక్కువ సమయంలో తక్కువ వనరులతో అధిక నికర లాభాన్ని ఆర్జించే పంటగా నువ్వులను చెప్పవచ్చును. నువ్వుల పంటకు మురుగు నీరు నిల్వని తేలికపాటి నేలలు అనుకూలంగా ఉంటాయి.

వేసవి పంటగా నువ్వులను సాగుచేసినప్పుడు అధిక ఉష్ణోగ్రతల వల్ల నువ్వుల పంటకు వివిధ రకాల పురుగులు మరియు తెగుళ్ళ బెడద ఉంటుంది. వీటి నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడిని సాధించవచ్చును.

**పురుగులు:**

**పేనుబంక:** పంట వేసిన 25 రోజుల నుండి పంటలో ఈ పురుగు ఆశించడం జరుగుతుంది. పిల్ల మరియు తల్లి పురుగులు ఆకులు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం ద్వారా ఆకులు పాలిపోయి తరువాత ఎండిపోతాయి. వాటి యొక్క ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఆకుల నుండి తేనె లాంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల మొక్క చుట్టూ ప్రక్కల చీమలు చేరుతాయి.

**నివారణ:** ఈ పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**బీహారి గొంగళి పురుగు:** పంట వేసిన తొలిదశలో చిన్న గొంగళి పురుగులు గుంపులుగా ఆకులలోనికి చేరి ఆకు యొక్క పత్రహరితాన్ని గోకి తినడం వలన ఆకులు జల్లెడ ఆకులలాగా మారుతాయి. ఎదిగిన గొంగళి పురుగు ఆకుల వెంబడి ప్రాకుతూ మొగ్గలకు, పువ్వులకు మరియు కాయలకు రంధ్రాలు చేస్తూ విత్తనాలను తింటాయి.

**నివారణ:** ఎకరాకు 16 నుండి 20 పక్షి స్థావరాలను అమర్చాలి. హెక్టారుకు ఒక దీపపు ఎరను అమర్చాలి. అదేవిధంగా వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తర్వాత దశలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు:**

**వేరుకుళ్ళు మరియు కాండం కుళ్ళు తెగులు:** కాండం మీద నల్లని చారలు ఏర్పడతాయి. వేర్లను చీల్చి పరిశీలిస్తే గోధుమ రంగు చారలు కనిపిస్తాయి. వేర్లు పూర్తిగా లేదా పాక్షికంగా కుళ్ళిపోతాయి. ఎండుతెగులు సోకిన కాండం మీద గులాబి రంగు శిలీంధ్ర బీజాలు సముదాయం కనిపిస్తుంది. తెగులును కలిగించే శిలీంధ్రం భూమిలోను విత్తనాలు మరియు పంట అవశేషాల పై జీవిస్తుంది. పంట మార్పిడి తప్పకుండా చేయాలి.

**నివారణ:** కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మ్యాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**బూడిద తెగులు:** లేత ఆకులపై తెల్లని బూడిద మచ్చలు ఏర్పడతాయి. క్రమేపి ఆకు మొత్తం బూడిద పొడి వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకిన ఆకులు వాడి రాలిపోతాయి.

**నివారణ:** నీటిలో కరిగే గంధకపు పొడి 3 గ్రా. లేదా మైక్లోబ్యుటానిల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఫిల్లోడి లేదా వెర్రి తెగులు:** ఈ వ్యాధి దీపపు పురుగులు / పచ్చదోమ ద్వారా వ్యాపిస్తుంది. పూల భాగాలు పచ్చని ఆకులతో













కూడిన నిర్మాణాలుగా రూపాంతరం చెందుతాయి. తరువాత వివిధ పువ్వు భాగాల్లో ఉన్న ఈనెలు తొలగించబడతాయి. అలాగే మొలి తిరిగిన ఆకులు చిన్న పత్ర వృత్తాలలో కాండం మీద దగ్గరగా కుచ్చులుగా రూపాంతరం చెందుతాయి.

నివారణ: విత్తనం విత్తేటప్పుడు ట్రైకోడెర్మా విరిడే 4 గ్రా. లేదా సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ 10 గ్రా. లేదా కార్బండాజిమ్ 2 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు:** ఆకులపై నిర్దిష్టమైన ఆకారంలేని రంగు మచ్చలు ఏర్పడును. ఉధృతి ఎక్కువైనప్పుడు ఆకులు అంతటా వ్యాపించి ఆకులు అన్ని రాలిపోతాయి. ఈ మచ్చలు కాండం మరియు కాయల పైన ఏర్పడి పంట నష్టం జరుగుతుంది.

**నివారణ:** తొలిదశలో 2.5 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి 7-10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9951461694**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి బుధవారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. మార్చి, 2025 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 06.03.2025 | మామిడి పూత పిందె సమయంలో పాటించవల్సిన సస్యరక్షణ | డా॥ ఎ. శంకర్ ఎస్.యం.ఎస్. (హార్టికల్చర్) కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, 9912604549 |
| 13.03.2025 | వేసవి పంటలలో తెగుళ్ళ యాజమాన్యం | డా॥ వి. దివ్య రాణి, శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 9603012196 |
| 20.03.2025 | యాసంగి ఆముదం సాగు వివరాలు | డా॥ కె. సదయ్య, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 8885331799 |
| 27.03.2025 | ఆహార నాణ్యత నిర్వహణలో ప్రయోగశాల పాత్ర | డా॥ కె. లక్ష్మీ ప్రసన్న, శాస్త్రవేత్త (సీడ్ టెక్నాలజీ) యం.ఎఫ్.పి.ఐ. - క్యూ.సి.ఎల్. రాజేంద్రనగర్, 9493451857 |

**రైతులు కాల్ చేయవలసిన ఫోన్ నంబర్ : 040-23244834 / 040-23244836**

# తెలంగాణలో వెదురు సాగుకు అనువైన జాతులు మరియు అవకాశాలు

డా॥ ఎ.వి. రామాంజనేయులు, డా॥ టి. చైతన్య, డా॥ పి. వెంకటేశ్వర్లు మరియు డా॥ సి.హెచ్. రామకృష్ణ
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్



తెలంగాణ రాష్ట్రంలో 196 లక్షల ఎకరాలలో వివిధ పంటలు పండిస్తున్నారు. అయితే రైతులు ఎక్కువగా సాంప్రదాయ పంటలైన ప్రత్తి, మొక్కజొన్న, వరి, కంది, వేరుశనగ, జొన్న, మిరప పంటల వైపే మొగ్గు చూపుతున్నారు. కానీ బెట్ట పరిస్థితులు, నీటి కొరత, చీడపీడలు, సరైన మార్కెట్ సదుపాయం లేకపోవడం, ప్రకృతి వైపరిత్యాల వలన దిగుబడులు రాక ఆదాయాలు అంతంత మాత్రమే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్రంలో వెదురు సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ వెదురు మిషన్ పథకం (2006 మరియు 2018) కింద రైతులకు రాయితీ ఇవ్వడంతో పాటుగా, గిరిజన ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా వెదురు సాగును చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది.

వెదురు పంట సమాజానికి ఆర్థిక, పారిశ్రామిక మరియు పర్యావరణ ప్రయోజనాలను చేకూరుస్తోంది. కావున దీనిని "ఆకు పచ్చ బంగారం" గా పిలుస్తారు. క్రింద పేర్కొన్న విధంగా వెదురు పంట బహుముఖ ప్రయోజనాలను కలుగజేస్తుంది.

వెదురు బలమైనది మరియు తేలికైనది కాబట్టి నిర్మాణ రంగంలో ఫర్నీచర్ (బల్లలు, కుర్చీలు మరియు పడకలు), ప్యానెల్లు మరియు బోర్డులు తయారీలో వాడతారు. వెదురు ఫాబ్రిక్ మృదువైనది మరియు యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి టెక్స్టైల్స్ మరియు ఫ్యాబ్రిక్ రంగంలో దుస్తులు, నారలు, తువ్వాళ్ళు, నూలు తయారు చేయడానికి ఉపయోగిస్తారు. కాగితం పరిశ్రమలో రైటింగ్ పేపర్, ప్యాకేజింగ్ మెటీరియల్స్ మరియు టిష్యూపేపర్‌తో సహా అధిక-నాణ్యత కాగితాన్ని ఉత్పత్తి చేయడానికి వెదురు ఫైబర్‌లను ఉపయోగిస్తారు. వెదురు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం. దీనిని చెంచాలు, ఫోర్కులు, ప్లేట్లు, చాపింగ్ బోర్డ్‌లు, కిచెన్ టూల్స్, కంటైనర్‌లు మరియు గిన్నెలు తయారు చేయడానికి వినియోగిస్తారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా బొగ్గు అలాగే బయోచార్ తయారీలో విరివిగా వాడవచ్చు. వెదురును ల్యాండ్ స్కేపింగ్ మరియు హార్టికల్చర్‌లో, అలంకారమైన తోట నిర్మాణాలు, కంచెలు మరియు సరిహద్దులను రూపొందించడానికి ఉపయోగిస్తారు. వెదురు యొక్క వేరు వ్యవస్థ మట్టిని స్థిరీకరించడంలో సహాయపడుతుంది కాబట్టి కొండ లేదా తీర ప్రాంతాల్లో నేల కోత నివారణకు వాడతారు. క్రాఫ్ట్ మరియు డెకర్ రంగంలో కళాకారులు బుట్టలు, చాపలు, నగలు వంటి వివిధ వస్తువులను రూపొందించడానికి, దీపాలు, అద్దాలు, కర్టెన్ రాడ్‌లు మరియు ఇతర గృహాలంకరణ వస్తువులను తయారు చేయడానికి ఉపయోగిస్తారు. వ్యవసాయంలో వెదురును అధిక గాలుల నుండి పొలాల్లోని పంటలను రక్షించడానికి వెదురును సహజ అవరోధంగా లేదా విండ్‌బ్రేక్‌గా నాటుతారు. అలాగే నేలకి సేంద్రియ పదార్థాన్ని అందించడం ద్వారా భూసారాన్ని పెంపొందిస్తుంది. రవాణా మరియు చేపల వేట కోసం పడవలను నిర్మించేందుకు వెదురును ఉపయోగిస్తారు. క్రీడా సామగ్రి తయారీలో వాడతారు. వంటలలో తినదగిన రెమ్మలను సూప్‌లు మరియు సలాడ్‌లలో వినియోగిస్తారు.

వెదురులో అధిక తేమ (60-80%), అధిక ఫైబర్ (20-30%), తక్కువ కొవ్వు (1-3%), ఆకులలో (4-12%) మరియు కాండాలలో (1-5%) మాంసకృత్తులు, కాల్షియం మరియు పొటాష్ లాంటి ఖనిజాలు ఉంటాయి. కావున గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయ పశుగ్రాస వనరులు తక్కువగా ఉన్నప్పుడు, పశువులకు, గొర్రెలకు మరియు మేకలకు మిశ్రమ పశుగ్రాసంలో భాగంగా 30% వరకు వెదురు ఆకులను, రెమ్మలను మరియు లేత కాండాలను ఉపయోగిస్తారు.

**వెదురులో వివిధ వర్గాలు మరియు జాతులు:** భారతదేశం వెదురు జాతుల యొక్క వైవిధ్యానికి గొప్ప నిలయం. మనదేశంలో 29 వర్గాలకు చెందిన సుమారు 148 జాతులు ఉన్నాయి. అయితే, బాంబుసా (37 జాతులు మరియు 2 రకాలు), డెంద్రోకలామస్ (18 జాతులు) మరియు ఓక్లాంద్రా (11 జాతులు మరియు 1 రకం) వర్గాలు, అత్యధిక సంఖ్యలో జాతులు కలిగి సమిష్టిగా 45% వరకు ఉన్నాయి. వెదురును పండించాలనుకునే రైతులకు ఉత్పాదకత మరియు లాభదాయకతను పెంపొందించడానికి అనువైన జాతుల గురించి అవగాహన ఉండడం చాలా అవసరం. (పట్టిక-1)

పట్టిక-1: వెదురు పంటలో వివిధ జాతుల వివరాలు

| వ.సం. | వర్గం/ జాతి | ఆవిర్భావం/ విస్తరణ | పెరిగే ఎత్తు (మీటర్లు) | ఆకులు | కాండం(కల్మ్) | ఉపయోగాలు |
|---|---|---|---|---|---|---|
| 1. | బాంబుసా నూటన్స్ | ఆగ్నేయాసియాతో సహా ఉష్ణమండల మరియు ఉప ఉష్ణమండల ప్రాంతాలు | 15-20 | లాన్స్ ఆకారంలో, మధ్యస్థ పరిమాణం | లేత ఆకుపచ్చ రంగులో నునుపైన, మధ్యస్థ పరిమాణం | నిర్మాణం, ఫర్నీచర్ మరియు చేతి పనులలో |
| 2. | బాంబుసా వల్గారిస్ (ఆకుపచ్చ) | ఆగ్నేయాసియాకు చెందినది మరియు ఉష్ణమండల ప్రాంతాల్లో విస్తృతంగా సాగు చేస్తారు | వేగంగా పెరుగుతూ 20-30 మీటర్ల వరకు చేరుకుంటుంది | పెద్ద/పొడవైన ఆకులు | ఆకుపచ్చ, దృఢమైన మరియు 10 సెం.మీ. వరకు వ్యాసంతో మందముగా ఉంటాయి | ఫర్నీచర్, నిర్మాణం, కాగితం మరియు హస్తకళలలో |
| 3. | బాంబుసా బాల్కోవా | ఆగ్నేయాసియా, ప్రత్యేకించి ఫిలిప్పీన్స్ మరియు మలేషియాకు చెందినది | 20-25 మీటర్ల వరకు పెరుగుతాయి | పెద్దగా, పొడవుగా | 12 సెం.మీ. వరకు వ్యాసం కలిగిన మందపాటి గోడ; ముదురు ఆకుపచ్చ రంగు | ప్రధానంగా నిర్మాణం, మరియు సపోర్ట్ కర్రల కోసం ఉపయోగిస్తారు |
| 4. | బాంబుసా మల్టీప్లెక్స్ వారిగేటా | ఆగ్నేయాసియాకు చెందినది మరియు ఉష్ణమండల వాతావరణంలో విస్తృతంగా సాగు చేయబడుతుంది | తక్కువ నుండి మధ్యస్థ పరిమాణం, సాధారణంగా 6-10 మీటర్ల ఎత్తు వరకు | ఆకుపచ్చతో కూడిన రంగురంగుల నమూనాతో చిన్న ఆకులు | పసుపు మరియు ఆకుపచ్చ చారలు | అలంకారమైన వెదురు, తోటలు మరియు ప్రకృతి దృశ్యాలలో ఉపయోగిస్తారు |
| 5. | బాంబుసా టుల్డా | భారత ఉపఖండం మరియు ఆగ్నేయాసియాకు చెందినది | 15-20 మీటర్ల పొడవు వరకు పెరుగుతాయి | మధ్యస్థ-పరిమాణ లాన్సోలేట్ ఆకులు | 10 సెం.మీ. వరకు వ్యాసంతో మందంగా, బలంగా మరియు ఆకుపచ్చగా ఉంటుంది | నిర్మాణం, ఫర్నీచర్ కాగితం ఉత్పత్తిలో, అగర్‌బత్తి కర్రల తయారీకి ఉపయోగిస్తారు. దీని రెమ్మలు తినదగినవి. |
| 6. | బాంబుసా మెంబ్రనేసియస్ | ఆగ్నేయాసియాలో కనుగొన బడింది | మధ్యస్థ-పరిమాణ వెదురు, 8-15 మీటర్ల వరకు పెరుగుతుంది | పొడవైన మరియు ఆకుపచ్చ ఆకులు | 4-5 సెం.మీ. వ్యాసంతో సన్నగా, నునుపైన మరియు ఆకుపచ్చగా ఉంటుంది | ఎక్కువగా చిన్న ఫర్నీచర్, హస్తకళలు మరియు అలంకార ప్రయోజనాల తయారీలో ఉపయోగిస్తారు |

| వ. సం. | వర్గం/ జాతి | ఆవిర్భావం/ విస్తరణ | పెరిగే ఎత్తు (మీటర్లు) | ఆకులు | కాండం(కల్మ్) | ఉపయోగాలు |
|---|---|---|---|---|---|---|
| 7. | బాంబుసా బాంబోస్ | భారత ఉపఖండం మరియు ఆగ్నేయాసియాలో కనుగొన బడింది | 20–30 మీటర్ల వరకు పెరుగుతుంది | వెడల్పుగా మరియు పొడవుగా ఉంటాయి | 8–12 సెం.మీ. వ్యాసం మరియు మందపాటి గోడలతో బలంగా ఉంటాయి | నిర్మాణం మరియు సపోర్ట్ కర్రలకు ఉపయోగిస్తారు. దీని రెమ్మలు తినదగినవి |
| 8. | బంబుసా పాలిమార్ఫా | ఆసియాలోని ఉష్ణమండల ప్రాంతాలకు చెందినది | సాధారణంగా 8–12 మీటర్ల పొడవు పెరుగుతుంది | సన్నగా మరియు పొడవుగా ముదురు ఆకుపచ్చ రంగు | 4–5 సెం.మీ. వ్యాసంతో సన్నని గోడలు మరియు ఆకుపచ్చరంగు | ప్రధానంగా అలంకార ప్రయోజనాల కోసం మరియు చిన్న హస్తకళల కోసం ఉపయోగిస్తారు |
| 9. | డెండ్రోకలామస్ బ్రాండిస్ | భారత ఉపఖండం మరియు ఆగ్నేయాసియా | చాలా పొడవైన జాతులు, 25 మీటర్ల ఎత్తుకు చేరుకుంటాయి | పెద్ద, లాన్సోలేట్ ఆకులు | బలమైనవి మందపాటి గోడలు మరియు 12–15 సెం.మీ. వ్యాసంతో ఉంటాయి | ప్రధానంగా నిర్మాణం, ఫర్నీచర్ మరియు కాగితం ఉత్పత్తికి ఉపయోగిస్తారు |
| 10. | డెండ్రోకలామస్ ఆస్పర్ | ఆగ్నేయాసియాకు చెందినది, ముఖ్యంగా థాయిలాండ్ మరియు మయన్మార్‌లో | 30 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది | పొడవాటి, లాన్సోలేట్ ఆకులు | 15 సెం.మీ. వరకు వ్యాసంతో మందంగా, బలిష్టంగా మరియు దృఢంగా ఉంటుంది | నిర్మాణం, సపోర్ట్ కర్రలు మరియు ఫర్నీచర్ తయారీకి ప్రసిద్ధి చెందింది |
| 11. | డెండ్రోకలామస్ స్ట్రిక్టస్ | భారతదేశం మరియు ఆగ్నేయాసియాకు చెందినది | 15–20 మీటర్ల వరకు చేరుకుంటాయి | మధ్యస్థ పరిమాణం, సన్నగా మరియు పొడవుగా ఉంటాయి | దృఢమైన మరియు మందపాటి గోడలు, 10 సెం.మీ. వరకు వ్యాసం కలిగి ఉంటాయి | సాధారణంగా ఫర్నీచర్, నిర్మాణం మరియు కాగితం తయారీకి ఉపయోగిస్తారు |
| 12. | డెండ్రోకలామస్ సిక్కిమెన్సిస్ | భారతదేశం, భూటాన్ మరియు నేపాల్‌లోని హిమాలయ ప్రాంతాలలో కనుగొనబడింది | పొడవైన వెదురు, 25 మీటర్ల వరకు పెరుగుతుంది | పెద్దగా, విశాలంగా మరియు లాన్స్ ఆకారంలో ఉంటాయి | 10–15 సెం.మీ. వ్యాసంతో మందంగా మరియు దృఢంగా ఉంటుంది | నిర్మాణం, సపోర్ట్ కర్రలు మరియు కాగితం ఉత్పత్తి కోసం ఉపయోగిస్తారు |

| వ. సం. | వర్గం/ జాతి | ఆవిర్భావం/ విస్తరణ | పెరిగే ఎత్తు (మీటర్లు) | ఆకులు | కాండం(కల్మ్) | ఉపయోగాలు |
|---|---|---|---|---|---|---|
| 13. | డెండ్రోకలామస్ జైగాంటియస్ | ఆగ్నేయాసియాకు చెందినది, ముఖ్యంగా మయన్మార్ మరియు థాయిలాండ్ | అతిపెద్ద వెదురు జాతులలో ఒకటి, 40 మీటర్ల పొడవు వరకు పెరుగుతుంది | పెద్దవి మరియు విశాలమైనవి | 30 సెం.మీ. వరకు వ్యాసం కలిగి మందంగా ఉంటాయి | నిర్మాణం, ఫర్నీచర్ మరియు కాగితం, అలాగే తినదగిన రెమ్మల కోసం ఉపయోగిస్తారు |
| 14. | డెండ్రోకలామస్ స్టాక్సీ | భారతదేశం, నేపాల్ మరియు ఆగ్నేయాసియాలో కనుగొనబడింది | 12–20 మీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది | పెద్దవి, వెడల్పుగా మరియు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి | 8–12 సెం.మీ. వ్యాసంతో బలంగా మరియు దృఢంగా ఉంటుంది | నిర్మాణం, సపోర్ట్ కర్రలు మరియు తినదగిన రెమ్మల కోసం ఆహార వనరుగా ఉపయోగిస్తారు |
| 15. | థైర్సోస్టాకిస్ ఒలివెరి | ఆగ్నేయాసియాకు చెందినది | మధ్యస్థ–పరిమాణ వెదురు, సాధారణంగా 6–10 మీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది | సన్నని మరియు లాన్సోలేట్ ఆకులు | 3–4 సెం.మీ. వ్యాసంతో ఆకుపచ్చ రంగులో మృదువుగా ఉంటాయి | అలంకార ప్రయోజనాల కోసం మరియు చిన్న చేతిపనుల కోసం ఉపయోగిస్తారు |
| 16. | మెలకోనా బాసిఫెరా | భారతదేశం మరియు ఆగ్నేయాసియాలో కనుగొనబడింది | మధ్యస్థం నుండి పెద్ద జాతులు, 10–15 మీటర్ల వరకు పెరుగుతాయి | సన్నని, లాన్స్ ఆకారపు ఆకులు | మృదువైన ఉపరితలాలు మరియు 5–7 సెం.మీ. వ్యాసం కలిగిన బలమైన ఆకుపచ్చ రంగు కాండం | ప్రధానంగా నిర్మాణం, హస్తకళలు మరియు కాగితాల ఉత్పత్తికి ఉపయోగిస్తారు |
| 17. | జైగాంటోక్లోవా అత్తర్ | ఆగ్నేయాసియా, ప్రత్యేకించి ఇండోనేషియా మరియు మలేషియాలకు చెందినది | 20 మీటర్ల పొడవు వరకు పెరుగుతుంది | మధ్యస్థం నుండి పెద్దగా మరియు ముదురు ఆకుపచ్చ రంగు | 10 సెం.మీ. వ్యాసం కలిగి మందంగా మరియు దృఢంగా ఉండే కాండం | సాధారణంగా నిర్మాణం, సపోర్ట్ కర్రలు మరియు ఫర్నీచర్ తయారీకి ఉపయోగిస్తారు |
| 18. | ఓక్లాండ్రా ట్రావన్కోరికా | భారతదేశంలోని పశ్చిమ కనుమలకు చెందినది | 6 మీటర్ల పొడవు వరకు పెరుగుతుంది | లాన్సోలేట్ లేదా దీర్ఘచతురస్రాకార ఆకులు, 9–30 సెం.మీ. పొడవు, 5–12 సెం.మీ. వెడల్పు | బూడిద ఆకుపచ్చ రంగులో ఉండి కనుపులు ఉబ్బి ఉంటాయి | కాగితపు గుజ్జు, బుట్ట మరియు ఇంటి నిర్మాణం కోసం ఉపయోగిస్తారు |

పైన పేర్కొన్న వెదురు యొక్క అనేక జాతులలో, తెలంగాణ, దాని పాక్షిక శుష్క వాతావరణం మరియు విభిన్న నేల రకాలు, కరువును తట్టుకోగల, వేగంగా అభివృద్ధి చెందుతున్న మరియు వివిధ పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండే వెదురు జాతులు: బాంబుసా బాంబోస్ (జెయింట్ థార్నీ వెదురు), బాంబుసా వల్గారిస్ (సాధారణ వెదురు), డెండ్రోకలామస్ స్ట్రిక్టస్ (బలమైన వెదురు), డెండ్రోకలామస్ ఆస్పర్ (జెయింట్ వెదురు), బాంబుసా బాల్కోవా, బాంబుసా టుల్డా, బాంబుసా హామిల్టోని, బాంబుసా న్యూటన్స్ మరియు డెండ్రోకలామస్ బ్రాండిసై.

**తెలంగాణ రాష్ట్రంలో వెదురును ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ప్రణాళిక:** తెలంగాణ వ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో వెదురు సాగు చేయాలని ప్రభుత్వం టార్గెట్‌గా నిర్ణయించింది. ప్రస్తుతం కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో సుమారు 2200 ఎకరాల్లో వెదురు పంటను సాగు చేస్తున్నారు. రానున్న 4 ఏళ్ళలో 7 లక్షల ఎకరాల్లో సాగు చేయడం ద్వారా 75 వేల మంది ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఆశిస్తుంది. దేశవ్యాప్తంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుండి వెలువడే కాలుష్యం నియంత్రణకు వెదురు కలపను తప్పనిసరిగా వాడాలని ఇంధన నూతన విధానంలో కేంద్రం పేర్కొంది. బొగ్గుకు బదులుగా వెదురును వాడాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వం వెదురు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. చెట్టుకు రూ. 120 వరకు రాయితీ అందిస్తుంది.

మహిళా సాధికారతలో భాగంగా తెలంగాణలోని స్వయంసహాయక సంఘాల ద్వారా 32 జిల్లాల్లో వెదురు సాగు చేపట్టేలా వారిని ప్రోత్సహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముందుకొచ్చింది. సెర్ప్ ద్వారా ఈ కార్యక్రమం చేపట్టనుంది. వెదురు సాగుకు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనున్నట్లు తెలిసింది. నర్సరీల్లో మొక్కల్ని పెంచి వాటిని రైతులకు పంపిణీ చేయనున్నారు. తొలి విడతలో భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, ములుగు, భూపాలపల్లి, కుమురంభీం జిల్లాల్లో మహిళా సంఘాలను ఎంపిక చేసి ఇటీవల పంట సాగుపై హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించనున్నారు. తొలుత పైలట్ ప్రాజెక్ట్ భద్రాద్రి జిల్లాను ఎంపికచేసి, వెదురు సాగుకు 5000 మంది రైతులను ఎంపిక చేస్తారు.

నేలను, నీటి వసతిని మరియు ఉపయోగమును బట్టి ఎకరంలో 60-160 వరకు మొక్కల్ని నాటవచ్చు (5-8 మీ. × 5-8 మీ.). 30 ఏళ్ళ వరకూ వెదురును సాగు చేసుకోవచ్చు. ఎకరాకు రూ. 20 వేల పెట్టుబడితో ఏడాదికి రూ. 40,000 - రూ. 60,000 ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా. వెదురు వస్తువులకు, వెదురు నుండి తీసే ఇథనాల్‌కు డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ పంట సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇసుక లోమ్ మరియు బంకమట్టి లోమ్ నేలలు వెదురు సాగుకు బాగా సరిపోతాయి. మొక్కజొన్న, కంది, పెసర, మినుము, నువ్వులు, పసుపు, అల్లం, పూల పంటలు, పశుగ్రాస పంటలను వెదురు పంట మధ్య వరుస స్థలంలో విజయవంతంగా మరియు లాభదాయకంగా పండించవచ్చు.

**కింది సంస్థల నుండి వెదురు పెంపకంపై సాంకేతిక సమాచారం రైతులు పొందవచ్చు.**

1. అటవీ వ్యవసాయ విభాగం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్
2. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ములుగు (8977714250)
3. అటవీ జీవ వైవిధ్య సంస్థ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ, ఐఎఫ్‌బి), దూలపల్లి, హైదరాబాద్

అయితే రాష్ట్రంలో వెదురు సాగు ప్రోత్సహించడానికి వెదురు సాగుపై రైతులకు సదస్సులు ఏర్పాటు చేయడం, నాణ్యమైన మొక్కలను తక్కువ ధరకు అందుబాటులో ఉంచడం, వెదురు సాగులో విజయవంతమైన రైతుల పొలాలను సందర్శించడం, శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహించడంతో పాటు, మార్కెట్ సదుపాయాన్ని కల్పించడం లాంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441312264**

# ఈ-కెనాన్ - అడవి పందులను పారద్రోలే సమగ్ర పరికరం

డా॥ వి. సునీత, డా॥ ఐ. అరుణ శ్రీ, డా॥ ఎస్. శ్రీనివాస రెడ్డి,
డా॥ పి. రజనీకాంత్, డా॥ పి. వెంకటేశ్వర్లు
మరియు ఏ.వి.ఎల్.ఎన్.ఆర్. రావు
అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం,
రాజేంద్రనగర్, హైదరాబాద్



ప్రస్తుతం రాష్ట్రంలో అడవి పందులు, కోతులు మరియు పక్షుల వలన పంటనష్టం జరుగుతుంది. ఈ జంతువులు పంటలను మొలకెత్తే దశలో మరియు గింజ పాలుపోసుకునే దశ నుండి గింజ గట్టి పడే దశ వరకు నష్టాన్ని కలిగిస్తాయి. అడవి పందులు నాటిన గింజలను మరియు పక్వదశలో వివిధ రకాల పంటలను ఆశించి నష్టపరుస్తాయి. కోతులు పండ్లు మరియు కూరగాయల పంటలపై ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. నెమళ్ళు, పావురాలు, కాకులు వంటి పక్షులు ఆహారధాన్య పంటల గింజలను, పండ్లను మరియు కూరగాయ పంటలను కూడా తినడం ద్వారా నష్టాన్ని కలిగిస్తాయి.

ఈ సమస్యను ఎదుర్కొనుటకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం వారు ఎలక్ట్రానిక్ కెనాన్‌ను రూపొందించడం జరిగింది.

**ఎలక్ట్రానిక్ కెనాన్ (ఈ-కెనాన్) ముఖ్య లక్షణాలు:**

1. సౌరశక్తి సహాయంతో పనిచేయు ధ్వనిని వెలువరించే పరికరం.
2. ఈ పరికరం స్పీకర్ సహాయంతో శబ్దాలను ఉత్పత్తి చేసి జంతువులకు అసౌకర్యాన్ని కలిగించి పంటల నుండి పారద్రోలుతుంది.
3. ఈ పరికరంలో మొత్తం 57 రకాల శబ్దాలు క్రోడీకరించబడ్డాయి. స్పీకర్ సహాయంతో పొలంలో వెలువరించినప్పుడు ఈ అడవి జంతువులు మరియు పక్షులు బెదిరి మన పొలంలోకి రాకుండా దూరంగా వెళ్ళిపోతాయి. ఈ శబ్దాల వరుసక్రమం మారుతూ ఉండడం వలన జంతువులు మరియు పక్షులు అలవాటుపడే అవకాశం తక్కువగా ఉంటుంది.
4. ఈ పరికరం పగటివేళల్లో కోతులు మరియు పక్షులను రాత్రి సమయంలో అడవి పందులను పారద్రోలుటకు అనువైనది.
5. సౌరశక్తి ద్వారా ఈ పరికరాన్ని చార్జ్ చెయ్యవచ్చు. పూర్తి చార్జ్‌తో ఇది 16-18 గంటలు నిరంతరం పనిచేస్తుంది.
6. ఈ పరికరం వినియోగదారులకు అనుకూలంగా ఉంటుంది. దీనిని సులభంగా అమర్చుకోవచ్చు. విత్తనం విత్తే దశలో భూమి నుండి ఒక అడుగు ఎత్తులో పంట పరిపక్వదశలో పంట నుండి ఒక అడుగు ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి.
7. ఈ పరికరంను ఉపయోగించుట సులభం దీనికి ఆన్ ఆఫ్ బటన్ ఉంటుంది. దీని సహాయంతో ఈ పరికరంను ఆన్ చేయవచ్చు మరియు ఆఫ్ చేయవచ్చు.
8. ఈ పరికరం జంతువులకు, పక్షులకు, పర్యావరణానికి హాని చేయని నికెల్, క్రోమియంతో తయారు చేయబడినది. కావున ఎలాంటి వాతావరణస్థితిలో కూడా పాడవకుండా ఉంటుంది.

**ఉపయోగాలు:**

**వ్యవసాయం:** పక్షులు, కోతులు మరియు పందుల నుండి పంటలను రక్షించవచ్చు.

**మత్స్య పరిశ్రమ:** చేపలు మరియు రొయ్యలు చెరువులను పక్షుల నుండి రక్షించవచ్చు

**ఉద్యాన పంటలు:** పండ్ల తోటలు మరియు నర్సరీలను పక్షులు మరియు కోతుల నుండి రక్షించవచ్చు

**విమానాశ్రయాలు:** రన్‌వేల సమీపంలో నుండి పక్షులను పారద్రోలుటకు ఉపయోగించవచ్చు

**వ్యయ ప్రయోజనాలు:**

ధర సుమారు రూ. 18,500 + 18% జిఎస్‌టి

ఒక పంట సీజన్ దీనిపై పెట్టిన పెట్టుబడిని తిరిగి లాభం పొందే అవకాశం ఉంది.

**రైతులకు లాభాలు:**

- ఈ పరికరం 3-4 ఎకరాల విస్తీర్ణం వరకు పనిచేస్తుంది.
- మానవ శ్రమ అవసరం లేదు.
- ఇది పర్యావరణహితమైన పద్ధతిలో నష్టం లేకుండా జంతువులను భయపెడుతుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9985581919




# జాతీయ బడ్జెట్ 2025-26లో - వ్యవసాయ రంగ కేటాయింపులు

డా॥ ఆర్. సునీతా దేవి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
రాజేంద్రనగర్, హైదరాబాద్

కేంద్ర బడ్జెట్ 2025-26ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి '1'న లోక్‌సభలో ప్రవేశ పెట్టడం జరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 50.65 లక్షల కోట్ల అంచనాలతో భారీ బడ్జెట్టును సమర్పించారు. సమ్మిళిత అభివృద్ధి, పెట్టుబడులు సాధనే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. రక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం, ఐటీ, పట్టణాభివృద్ధి రంగాలకు అధిక నిధులు కేటాయించడం ద్వారా భారతదేశం 2047 నాటికి "వికసిత్ భారత్" లక్ష్యాన్ని చేరుకోవడానికి అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ రంగానికి రూ. 1 లక్ష 45 వేల కోట్లు కేటాయించడం జరిగింది. పంటల ఉత్పత్తి ఉత్పాదకత పెంచడం కోసం వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కొత్తగా ఆరు పథకాలను ప్రవేశపెట్టారు.

### వ్యవసాయరంగ ప్రాధాన్యతలు:

#### ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకం:

- వ్యవసాయ ఉత్పాదకత పెంచడమే లక్ష్యంగా పిఎం ధన ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రాల భాగస్వామ్యంతో ప్రారంభించబడే ఈ కార్యక్రమం, వ్యవసాయ ఉత్పాదకత తక్కువగా ఉన్న 100 జిల్లాల్లో అమలు చేయాలని నిర్ణయించారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, ఋణ సౌలభ్యాన్ని మెరుగుపరచడం ద్వారా 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.
- కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే ఋణపరిమితిని ఇప్పుడున్న రూ. 3 లక్షల నుండి రూ. 5 లక్షలకు పెంచారు. తద్వారా 7.7 కోట్ల మంది రైతులు, మత్స్యకారులు, పాడి రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

**పప్పుధాన్యాల దిగుబడి పెంపునకు ఆత్మనిర్భర్ మిషన్:** కంది, మినుము, ఎర్రకంది దిగుబడి పెంచడానికి రూ. 1000 కోట్లతో ఆరేళ్ళ ప్రణాళికతో ఆత్మనిర్భర్ మిషన్‌ను చేపడతామని తెలిపారు. రూరల్ ప్రాస్పారిటీ అండ్ రెజిలెన్స్ ప్రోగ్రాం కింద మినుములు, మసూర్ పప్పు కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

**చీడపీడలను తట్టుకుంటూ అధిక దిగుబడులనిచ్చే విత్తనాల అభివృద్ధి:** ఎక్కువ దిగుబడి ఇస్తూ.. చీడపీడలను, వాతావరణ విపత్తులను తట్టుకునే వంగడాలను రూపొందించేందుకు పరిశోధన వ్యవస్థను ఏర్పాటుచేసి, వందకుపైగా వంగడాలను వాణిజ్యపరంగా విడుదల చేయాలని నిర్ణయించారు.

**ప్రత్తి దిగుబడి పెంచేందుకు ఐదేళ్ళ ప్రణాళిక:** ప్రత్తి సాగు ఉత్పాదకత మెరుగు పరచడానికి మరియు అదనపు పొడవైన ప్రధాన ప్రత్తి రకాలను ప్రోత్సహించడానికి రూ. 500 కోట్లతో ప్రత్యేక మిషన్ ప్రారంభించబడుతుందని తెలిపారు.

**కూరగాయలు మరియు పండ్ల ఉత్పత్తి పెంచడానికి జాతీయ స్థాయిలో కొత్త పథకం:** రైతులకు ఉత్పత్తి, సమర్థవంతమైన సరఫరాలు, ప్రాసెసింగ్ మరియు లాభదాయక ధరలను ప్రోత్సహించడానికి రైతు ఉత్పత్తి సంస్థలు, సహకార సంఘాలను కలుపుకొని రాష్ట్రాల భాగస్వామ్యంతో సమగ్ర కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

- వంట నూనెల్లో స్వయం సమృద్ధి కోసం ఎడిబుల్ ఆయిల్ సీడ్ నేషనల్ మిషన్‌ను అమలు చేయనున్నట్టు తెలిపారు.
- ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా ఆర్ఎల్ఐ స్కీం-వ్యవసాయంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రీసెర్చ్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీం 6 ఏళ్ళు అమలు చేయనున్నట్లు తెలిపారు.

గ్రామీణాభివృద్ధి పథకం క్రింద గ్రామీణ ప్రాంతాల్లో అవకాశాలు పెంపొందించి, తద్వారా వలసలు నివారించడం దీని యొక్క లక్ష్యం అని, రాష్ట్రాల భాగస్వామ్యంతో గ్రామీణ సమృద్ధి, పురోగమన కార్యక్రమం చేపట్టమన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామీణ మహిళలకు, యువ రైతులకు, గ్రామీణ యువతకు చిన్న, సన్నకారు రైతులు భూమిలేని కుటుంబాలకు ప్రయోజనం కలిగిస్తుందని తెలిపారు.

- రైతుల శ్రేయస్సు కోసం బీహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటుకు రూ. 100 కోట్లు కేటాయించారు.
- ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనకు నిధులు 64.33% పెంచారు.
- ఈ సదుపాయాలను వినియోగించుకొని రైతులు మరింత లాభపడతారని ఆశిస్తున్నాం.







# "వ్యవసాయ డిజిటల్ యాప్‌లు: రైతాంగానికి సమయోచిత సేవలు"

ఆర్. శివశంకర్, కె. ప్రవల్లిక, డా॥ సి.హెచ్. వేణు గోపాల రెడ్డి మరియు ఏ. హిమ కుమార్
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్

వ్యవసాయం ప్రపంచ ఆహార ఉత్పత్తికి మూలాధారం. ఈ రంగాన్ని డిజిటల్ సాంకేతికతలతో అనుసంధానిస్తే విప్లవాత్మక మార్పులను సృష్టించవచ్చు. కృత్రిమ మేధస్సు (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి), ఉపగ్రహ చిత్రాలు మరియు డేటా విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి అన్నదాతలు సాగులో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి.

## డిజిటల్ వ్యవసాయ యాప్‌ల ప్రాముఖ్యత:

**డిజిటల్ వ్యవసాయం విస్తృత శ్రేణి లక్షణాలను కలిగి ఉంటుంది. అవి ఏంటంటే..**

**వాతావరణ సూచనలు:** వర్షపాతం, ఉష్ణోగ్రతలలో మార్పులకనుగుణంగా సాగు సూచనలు

**ఖచ్చితమైన సాగు విధానాలు:** అధిక దిగుబడి కోసం సరైన వ్యవసాయ మార్గదర్శకాలు

**చీడపీడల నిర్ధారణ & నివారణ:** చీడపీడలను గుర్తించి, సమర్థవంతమైన నిర్వహణ సూచనలు

**నీటి వినియోగం & మట్టి ఆరోగ్య పర్యవేక్షణ:** నీటి నిర్వహణ, భూసారం మెరుగుపరిచే మార్గదర్శకాలు

**మార్కెట్ సమాచారం:** రైతులకు లాభదాయకంగా తమ ఉత్పత్తులను అమ్ముకునే సేవలు

**ప్రభుత్వ పథకాలు & ఆర్థిక మద్దతు:** రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ అవకాశాలపై సలహాలు

**సాంప్రదాయ వ్యవసాయ & ఆధునిక సాంకేతికతల అనుసంధానం:** రైతులకు సాంప్రదాయ వ్యవసాయ విధానాలను ఆధునిక సాంకేతికతతో అందించడం ద్వారా శాస్త్రీయ అవగాహన కల్పించడంతోబాటు ఆర్థిక మద్దతు మరియు మార్కెట్ సమాచారాన్ని అందిస్తుంది. రైతులకు మార్కెట్‌పై అవగాహన కల్పించడం ద్వారా మధ్యవర్తులపై ఆధారపడకుండా వీరి ఉత్పత్తులకు సరైన ధరలను పొందేందుకు వీలు కల్పిస్తుంది.

## డిజిటల్ వ్యవసాయ యాప్‌లు:

**1. కిసాన్ సువిధా:** భారత ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఈ యాప్ రైతులకు వాతావరణ సూచనలు, మార్కెట్ ధరలు, నేల ఆరోగ్యం సమాచారం మరియు కిసాన్ కాల్ సెంటర్ ద్వారా నిపుణుల సూచనలు అందిస్తుంది.

**2. పూసా కృషి:** ఈ యాప్‌ను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసిఏఆర్) అభివృద్ధి చేసింది. ఈ యాప్‌లో నూతన పంట రకాలు, ఆధునిక సాగు సాంకేతికతలు, వ్యవసాయ యంత్రాలు, స్థిరమైన వ్యవసాయ విధానాల పై సూచనలు అందిస్తుంది. ఫీడ్‌బ్యాక్ సెక్షన్ ద్వారా వినియోగదారులతో (స్టేక్‌హోల్డర్) ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం కూడా కలదు.

**3. సాయిల్ హెల్త్ కార్డ్ (ఎస్‌హెచ్‌సి) మొబైల్ యాప్:** దీనిని భారత ప్రభుత్వ వ్యవసాయశాఖ అభివృద్ధి చేసింది. ఈ యాప్ ద్వారా ముఖ్యంగా మట్టిలో పోషక స్థాయిలను అంచనా వేయడం, తగినంత ఎరువుల మోతాదులను నిర్ణయించవచ్చును

**4.ఐఎఫ్ఎఫ్‌సిఓ కిసాన్ వ్యవసాయ యాప్:** ఐఎఫ్ఎఫ్‌సిఓ అభివృద్ధి చేసిన ఈ యాప్ వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, వ్యవసాయ సలహాలను అందిస్తుంది. రైతులు చీడపీడల బారిన పడిన మొక్కల ఫోటోలను అప్‌లోడ్ చేస్తే నిపుణులు సరైన సూచనలు అందిస్తారు.

**5. ఫామ్ కాల్క్యులేటర్ యాప్:** ఈ యాప్‌తో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ఖచ్చితమైన మోతాదులను లెక్కించవచ్చును. ఇంగ్లీష్, తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మరాఠీ మరియు గుజరాతీ భాషల్లో ఈ యాప్ రైతులకు సందేహాలను నివృత్తి చేస్తుంది.

**6. ఎరువుల (ఎన్ పి కె) కాల్క్యులేటర్:** దీని ద్వారా భూసార పరీక్ష ఆధారంగా ఎన్ పి కె మోతాదులను లెక్కించవచ్చును. తద్వారా అధిక ఎరువుల వినియోగాన్ని నివారించవచ్చును.

**7. క్రాప్ డాక్టర్ యాప్:** ఐజికెవి-ఎన్ఐసి ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. దీని ద్వారా పంటలకు సోకిన వ్యాధులు, పురుగులు అలాగే పోషక లోపాలను గుర్తించి పరిష్కారాలను తెలుసుకొన్నాయి. ధాన్యం, కూరగాయలు, నూనెగింజలపై ప్రత్యేక సమాచారం కూడా అందిస్తుంది.

**8. ఖేతి-బడి యాప్:** ఈ యాప్ పంటల నిర్వహణ, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై

పూసా కృషి | ఐఎఫ్ఎఫ్‌సిఓ కిసాన్ వ్యవసాయ యాప్ | ఫామ్ కాల్క్యులేటర్ యాప్ | క్రాప్ డాక్టర్ యాప్ | క్రాప్ ఇన్స్యూరెన్స్ యాప్

ఖేతి-బడి యాప్ | అగ్రి మార్కెట్ యాప్ | ఈనామ్ మొబైల్ యాప్ | అగ్రి మార్కెట్ యాప్ | మైక్రోమిత్ర యాప్

సమాచారం అందిస్తుంది. రైతులకు పంటల చీడ నియంత్రణపై మార్గదర్శకాలు అందజేస్తుంది.

**9. అగ్రి మార్కెట్ యాప్:** భారత ప్రభుత్వం అభివృద్ధి చేసింది. జిపిఎస్ ఆధారంగా సమీప మార్కెట్ ధరల సమాచారాన్ని అందిస్తుంది. తద్వారా మార్కెట్‌ల మధ్య ధర వ్యత్యాసాలను తెలుసుకొనే అవకాశం ఉంది.

**10. ఈనామ్ మొబైల్ యాప్:** వ్యవసాయ మార్కెట్లను అనుసంధానించే వాణిజ్య వేదిక. రైతులు తాజా పంటల ధరలు & బిడ్డింగ్ అవకాశాలను పొందే అవకాశం ఉంది.

**11. అగ్రియాప్:స్మార్ట్ ఫార్మింగ్:** వ్యవసాయ సలహాలు, వాతావరణ సమాచారం, కల్పవాసి మందుల వివరాలను తెలియజేస్తుంది. వీడియో & శిక్షణ మెటీరియల్ ద్వారా రైతులకు మార్గదర్శకాలను అందిస్తుంది.

**12. కృషి విజ్ఞాన్ యాప్:** ఈ యాప్‌ను ఆంధ్రప్రదేశ్, శ్రీకాకుళం జిల్లా అమదాలవలస కెవికె కేంద్రం అభివృద్ధి చేసింది. ఆధునిక శాస్త్రీయ వ్యవసాయ విధానాలు మరియు పంటల్లో తెగుళ్ళు, వ్యాధులను గుర్తించి నిపుణుల సూచనలు అందిస్తుంది.

**13. ఈ-థిల్హన్ యాప్:** ఐసిఏఆర్-ఐఐఓఆర్ హైదరాబాద్ వారిచే అభివృద్ధి చేయబడింది. ఇందులో నువ్వులు మరియు ప్రొద్దుతిరుగుడు పంటలపై సమగ్ర సమాచారం, మార్కెట్ ధరలు, ఏఐసిఆర్‌పి కేంద్రాల సమాచారం తెలియజేస్తుంది.

**14. మైక్రోమిత్ర యాప్:** ఐసిఏఆర్-ఎన్‌బిఏఐఎమ్ ఉత్తరప్రదేశ్ వారి చేత అభివృద్ధి చేయబడింది. ఇందులో నేలలోని సూక్ష్మజీవుల సమాచారం, జీవన ఎరువులు, నియంత్రణ కారకాలు, నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం ఉత్పత్తి చేసే బ్యాక్టీరియా లిక్విడ్ ఫార్ములేషన్స్ తదితర వివరాలు తెలియజేస్తుంది.

**15. ప్లాంటిక్స్ యాప్:** ఈ యాప్ పంటలలో రోగాలు మరియు పోషక లోపాలను గుర్తిస్తుంది. పంటల ఫోటోలు అప్‌లోడ్ చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చు. ప్రత్తి, గోధుమ, కూరగాయల పంటల సాగులో ప్రధాన మార్గదర్శకాలు మరియు సమయోచిత సలహాలను అందిస్తుంది.

**16. క్రాప్ ఇన్స్యూరెన్స్ యాప్:** ఈ యాప్ ప్రధానంగా రైతులకు వివిధ క్రాప్ ఇన్స్యూరెన్స్ పథకాలు, సులభ తరమైన రిజిస్ట్రేషన్, అనుకూలమైన పాలసీ ఎంపికలు మరియు క్లెయిమ్ ప్రాసెసింగ్ సమాచారం తెలియజేస్తుంది.

భవిష్యత్తులో డిజిటల్ వ్యవసాయ యాప్‌లు కృత్రిమ మేధస్సు, బిగ్‌డేటా మరియు డీప్ లెర్నింగ్ వంటి సాంకేతికతల ఆధారంగా రైతులకు కస్టమైజ్ సేవలు అందించే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈ యాప్‌లు వ్యవసాయ సవాళ్ళను స్మార్ట్‌గా అంచనా వేసి, సమయానికి మార్గదర్శకాలు మరియు మార్కెట్ మేధస్సును అందజేస్తాయి.

# అజొల్లా సాగుతో - పాడి రైతు బాగు

ఆర్. రఘువరణ్ సింగ్, వై. సుల్తాన్, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి,
కె. రామకృష్ణ, యం. రాజేశ్ కుమార్,
వి. పుష్పలత మరియు బి. హరీష్
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం



- అజొల్లా అజొప్లేసీ అనబడే పుష్పించని ఆకుపచ్చని ఫెర్న్‌జాతికి చెందిన మొక్క ఇది. అజొల్లా నీటి మీద తేలుతూ పెరిగే నాచులాగా ఉంటుంది. ఇది పంట సాగులో పచ్చిరొట్టగా, జీవన ఎరువులుగా ఉపయోగపడుతుంది.
- ఎరువులు, పురుగుమందుల రాకతో తొలినాళ్లలో కళ్ళు చెదిరే దిగుబడులు వచ్చాయి. కానీ కాలక్రమంలో తిరిగి సేంద్రియ విధానంలో సంప్రదాయ వంగడాల వైపు రైతు ఆలోచిస్తున్నాడు.
- రైతులు అజొల్లా సాగు చేపట్టి వారి పొలంలో వేసుకోవడం, పాడి పశువులకు, కోళ్ళు, మేకలు గొర్రెలు, చేపలకు దాణాగా అందించడం ద్వారా అతి తక్కువ ఖర్చుతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చు. అజొల్లాలో ఉండే అధిక మాంసకృత్తులు (25-35%) ఉండటం వల్ల దీనిని దాణాకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్నారు.
- అజొల్లాను తక్కువ పెట్టుబడితో, తక్కువ విస్తీర్ణంలో, తక్కువ కాలంలో సాగు చేయవచ్చును. దీనిలో అధికంగా మాంసకృత్తులు, తక్కువగా లిగ్నిన్ ఉండటం వలన పశువులు దీనిని తేలికగా జీర్ణం చేసుకుంటాయి. రెండు కిలోల అజొల్లా, ఒక కిలో దాణాతో సమానం.
- రెండు కిలోల అజొల్లాను రోజు పశువుల దాణాతో కలిపి పాడి పశువులకు పెడితే పాల ఉత్పత్తిలో 15-20% వృద్ధి కనిపిస్తుంది. వేరుశనగ వంటి వాటికి బదులు అదే పరిమాణంలో అజొల్లాను వాడినప్పుడు పాల ఉత్పత్తి మీద ఎటువంటి ప్రభావం ఉండదు. దీనితో పాటు అజొల్లా వాడకం పాల నాణ్యతను పెంచడమే గాక పశువుల ఆరోగ్యాన్ని పెంచి పశువు జీవిత కాలాన్ని పొడిగిస్తుంది.

**అజొల్లా ఉత్పత్తి:**

- అజొల్లా పెంచడానికి చెట్ల నీడలో గోతులు తవ్వుకొని గాని, సిమెంట్ తొట్టెలను ఏర్పాటు చేసుకొని గాని లేదా పోర్టబుల్ కంటైనర్‌ను ఉపయోగించి గాని అజొల్లాను పెంచుకోవచ్చు. గోతులు తవ్వుకొని అజొల్లా పెంచినప్పుడు బయటి నుండి ఎటువంటి వేర్లులోనికి రాకుండా ప్లాస్టిక్ సంచులను గోతి లోపల పరచాలి. దాని మీద పాలిథీన్ షీట్ పరిచి నీరు నిలువ ఉంచే కృత్రిమ తొట్టి లాగా తయారు చేయాలి.
- 10-15 కిలోల భూసారం గల మట్టిని జల్లెడ పట్టాలి. మెత్తని మట్టిని షీట్ మీద గోతిలో ఒకే విధంగా ఉండేలా చల్లుకోవాలి.
- ఆవుపేడ 2 కిలోలు, 30 గ్రా. సూపర్ పాస్ఫేట్ 10 లీటర్ల నీటిలో కలిపి గుజ్జుగా తయారుచేసి ఆ మట్టి మీద పోయాలి. 10 సెం.మీ. నీటి మట్టం ఉండేలా చూసుకోవాలి. దాని కొరకు మరింత నీటిని కలపాలి. 500 గ్రా. నుండి 1 కిలో వరకు కలుపులేని తాజా అజొల్లా కల్చరు ఈ బెడ్ మీద సమానంగా చల్లుకోవాలి.
- అలా చల్లుకోవడం ద్వారా అజొల్లా త్వరగా పెరుగుతుంది. గొయ్యి మొత్తాన్ని ఆక్రమిస్తుంది. 10-15 రోజుల తరువాత రోజుకు 500 నుండి 600 గ్రా. ఉత్పత్తిని పొందవచ్చు.

**అజొల్లా పశువుల దాణాగా తయారు చేయడం:**

- 1 చ.సె.మీ. వెడల్పయిన రంధ్రాలు గల ప్లాస్టిక్ ట్రేలో సేకరించిన అజొల్లాను ఒక బకెట్‌లోనికి తీసుకొని పేడ వాసన పోయేలా కడగాలి. చిన్న అజొల్లా మొలకలు కూడా రంధ్రాల ద్వారా బకెట్‌లోనికి వస్తాయి. ఆ నీటిని మరలా గోతిలో అజొల్లా మీద చల్లుకోవాలి. కడిగిన శుభ్రమైన తాజా అజొల్లాను 1:1 నిష్పత్తిలో పశువుల దాణాలో కలిపి వాడవచ్చును.


**అజొల్లా పెంపకంలో జాగ్రత్తలు:**

- తగినంత సూర్యకాంతి లభించే చెట్లనీడలో అజొల్లా ఉత్పత్తిని చేపట్టాలి. నేరుగా సూర్యకాంతి పడే పరిస్థితి మాత్రం ఉండకూడదు. గ్రీన్ నెట్ వంటి వాటిని ఉపయోగించడం వలన సూర్యకాంతి నుండి మరియు చెట్ల యొక్క ఆకులు గాలి ద్వారా పడకుండా చేయవచ్చు. అజొల్లా తయారు చేసే గోతిలో నీటి మట్టం ఒకే విధంగా ఉండేలా చూడాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 8555007282

# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ ఆర్. సునీత దేవి




**అడ్డం:**

1. టమాటలో ఏ ధాతులోపం వలన కాయ ఎండుతెగులు వస్తుంది? (3)
2. నూనెగింజల విత్తనం నిల్వకు అనువైన తేమ శాతం? (4)
4. వరి పొలంలో ఎలుకల నివారణకు వాడే మందు పేరు? (6)
9. క్యాబేజీలో డైమండ్ బ్యాక్ మాత్ నివారణకు అంతర పంటగా ఏ పంటను వేసుకోవాలి? (3)
10. వరి పంట పూత దశలో ఉన్నప్పుడు మబ్బులతో కూడిన వర్షపు జల్లులు లేదా మంచు కురవడం వలన ఏ తెగులు ఆశిస్తుంది? (7)
13. పట్టుపురుగులను పెంచడం, తద్వారా ముడి పట్టును ఉత్పత్తి చేసే ప్రక్రియను ఏమంటారు? (5)

**నిలువు:**

1. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూరు నుండి ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేయబడుతున్న కుసుమ నూనె? (4)
3. వేరుశనగలో ఏ పోషక లోపం వలన పూత ఆలస్యంగా రావడం, ఊడలు తక్కువగా దిగడం, కాయలు డొల్లగా తయారవడం జరుగుతుంది? (3)
5. రైతాంగం కోసం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ప్రచురితమయ్యే తెలుగు మాసపత్రిక (4) (క్రింది నుండి పైకి)
6. వరిలో ఆశించే ఏ తెగులుకు ఐసోప్రోథయోలేన్ మందు వాడమని సిఫారసు చేస్తున్నారు? (5)
7. ఐసిపిహెచ్-2740 హైబ్రిడ్ కంది రకం పేరు? (6) (క్రింది నుండి పైకి)
8. ప్రకృతి వ్యవసాయంలో భూమిలో పోషక విలువలు పెంచడానికి ఏమి వాడాలి? (4)
10. దశేరి, బంగెన్‌పల్లి రకాలు ఏ పండ్లకు సంబంధించినవి? (3) (క్రింది నుండి పైకి)
11. తీగజాతి కూరగాయలను ఆశించి నష్టం కలగజేస్తుంది. ఈ పురుగు నివారణకు విషపుఎరను తయారు చేసి పొలంలో అక్కడక్కడ పెట్టాలి. ఏ పురుగు (4)
12. అరటిలో బంచీటాప్ (వెర్రి తెగులు) తెగులు వైరస్ ఏ పురుగు వ్యాపింప జేస్తుంది? (4)

సమాధానాలు 40వ పేజీలో



# మార్చి మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
**వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట**

**మామిడి:** ఆలస్యంగా పూత, పిందె వచ్చిన తోటలలో పిందె రాలుటను నివారించుటకు 4.6 లీటర్లు నీటిలో 1 మి.లీ. ప్లానోఫిక్స్‌ను కలిపి పిచికారి చేయాలి. తేనెమంచు పురుగు ఉధృతి, అధికంగా ఉన్నట్లైతే నల్లపూత దశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.కాయతొలుచు (ముద్ది పుచ్చు) పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా 5 శాతం వేపగింజల కషాయం లేదా డెల్టామెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి గోలీకాయ దశలో 15 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.టెంక పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి మార్చి మార్చి గోలీకాయ దశ నుండి రెండు సార్లు పిచికారి చేయాలి. నేల స్వభావాన్ని, వాతావరణాన్ని బట్టి కంది గింజె సైజు పిందె నుండి 15-20 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి.

**జామ:** జామలో పిండినల్లి ఉధృతి అధికంగా కనిపిస్తున్నది. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. + వేపనూనె 5 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలిపి చెట్టుపై మరియు పాదులో పిచికారి చేయాలి. ఆకు, కాయ మచ్చతెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

**అరటి:** ఈ మాసంలో ప్లీబీటిల్స్ ఉధృతి అధికంగా ఉంటుంది. ఇవి విచ్చుకొని లేత ఆకుల మీద తింటూ ఆకుల అడుగు భాగాన దాక్కొంటాయి. మధ్య ఆకు మీద వీటి ప్రభావం అధికంగా ఉంటుంది. కాయల మీద మచ్చలు ఏర్పడటం వల్ల మార్కెటింగ్‌కు పనికిరావు. కొత్తగా వచ్చే ఆకులమీద ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**బత్తాయి, నిమ్మ:** ప్రస్తుత వాతావరణం నల్లి ఆశించడానికి అనుకూలం. నివారణకు 3 మి.లీ. ప్రాపర్‌గైట్ మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఈ మాసంలో పిందె రాలుతుంటే 2,4-డి 1 గ్రా. యూరియా 1 కిలో, కార్బండాజిమ్ 100 గ్రా. లను 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. అదేవిధంగా ఈ మాసంలో ఉష్ణోగ్రత 35-40 డిగ్రీ సెం.గ్రే మధ్యలో ఉంటే 2,4-డి 1 గ్రా. పొటాషియం పర్మాంగనేటు 1 కిలోను 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** పండ్లలో నాణ్యతను పెంచేందుకు నీటిని తగ్గించాలి. ఎకరాకు 60 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి. పండ్ల పరిమాణం 7-8 మి.మీ. ఉన్నప్పుడు 2 పిపియం ఇథరిల్ మరియు 40 పిపియం, జిబ్బరెల్లిక్ ఆమ్ల ద్రావణంలో గుత్తులను ముంచడం వల్ల కాయలు బాగా సాగుతాయి.

**బొప్పాయి:** పండు ఈగ నివారణకు చెట్ల కిందరాలిన పండ్లను ఏరి నాశనం చేయాలి. మిథైల్ యుజినాల్ 1 మి.లీ. 2 గ్రా. కార్బోఫ్యూరాన్‌లను ఒక లీటరు నీటిలో కలిపి వెడల్పాటి మట్టి పళ్ళేలలో పోసి అక్కడక్కడా ఉంచాలి.

**జీడిమామిడి:** కాయ, గింజ తినే పురుగు. కాయ, గింజల మధ్య గల ప్రదేశం ద్వారా లోపలికి ప్రవేశించి పండులోని గుజ్జును, గింజలోని పప్పును తింటుంది. వీటి నివారణకు ఈ మాసంలో లామ్డా సైహలోత్రిన్ 0.6 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. మాడు తెగులు వల్ల పుష్పగుచ్ఛాలు, ఎదుగుతున్న గింజలు మెత్తబడి,





పూర్తిగా ఎదగక ఎండి రాలిపోతాయి. అవసరాన్ని బట్టి కార్బండాజిమ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆపిల్ రేగు:** కోత పూర్తయిన తోటల్లో ఈ మాసంలో కత్తిరింపులు చేయాలి. ప్రధాన కొమ్మలు 3-4లను 15-20 కణుపులుంచి మిగతావి కత్తిరించాలి. కత్తిరింపులకు ముందు 10 గ్రా. పొటాషియం నైట్రేటును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల త్వరగా చిగురిస్తాయి.

**కూరగాయలు:**

**టమాట:** వేసవి టమాట నాటిన 30, 45 రోజులకు, లీటరు నీటికి 5 గ్రా. జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారి చేసినట్లైతే దిగుబడులు పెరుగుతాయి. పూతదశలో లీటరు నీటికి 20 గ్రా. యూరియాను కలిపి పిచికారి చేస్తే 20 శాతం దిగుబడి పెరుగుతుంది.

**వంగ:** కొమ్మ, కాయతొలుచు పురుగుల నివారణకు 0.2 గ్రా. ఫ్లూబెండమైడ్ లేదా 0.4 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. నాటిన 30వ, 45వ రోజున ఎకరాకు 50 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి. పూతదశలో లీటరు నీటికి 5 గ్రా. సూక్ష్మధాతు పోషక పదార్థాల మిశ్రమంను పిచికారి చేయడం వల్ల దిగుబడులు పెరుగుతాయి.

**మిరప:** కాయకుళ్ళు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులు నివారణకు 1 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ లేదా 0.4 గ్రా. మైక్లోబ్యుటానిల్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. మిరప కాయలను కోసే ముందు సస్యరక్షణ మందులను పిచికారి చేయకూడదు. అఫ్లోటాక్సిన్లు వృద్ధి చెందకుండా మిరప కాయలను పట్టాల మీద ఎండబెట్టాలి. రాత్రిళ్ళు మంచు బారిన పడకుండా కాయలను కప్పి ఉంచాలి.

**పందిరి**

**కూరగాయలు:**

సొర, కాకర, బీరకాయలలో పండు ఈగ నివారణకు ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. పెంకు పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పేనుబంక నివారణకు పెరుగుదల దశ నుండి పూత వచ్చే వరకు 5 శాతం వేపగింజల కషాయాన్ని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. ఉధృతి అధికంగా ఉంటే 2 మి.లీ. డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆకుకూరలు:** ఆకు తినే గొంగళి పురుగుల నివారణకు 2 మి.లీ. మలాథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు మందు పిచికారి చేసిన తరువాత కనీసం 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకు కోయాలి. అన్ని రకాల కూరగాయలలో రసంపీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది. నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ఆగాకర:** ఆగాకర పంట వేయాలనుకునేవారు ఈ మాసం చివరిలో నారుపోసుకుంటే జూన్ నాటుటకు తయారవుతాయి. నారుమడిని 4×1 మీ. సైజులో తయారుచేసుకొని వరుసల మధ్య 15 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ. ఉండేటట్లు విత్తనాలు విత్తుకోవాలి. 40-45 రోజులలో మొలకలు వస్తాయి.

పసుపు: ఉడికిన పసుపు తొందరగా ఎండకపోవడం వల్ల అఫ్లోటాక్సిన్లు వృద్ధి చెందే అవకాశం ఉంది. నివారణకు వండిన పసుపును ఆరబెట్టేటప్పుడు పైకి, కిందకు తిప్పుతుండాలి. తేమశాతం 8 వచ్చే వరకు ఎండబెట్టాలి. ఎండబెట్టేటప్పుడు వర్షంలో తడవకుండా కప్పి ఉంచాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 9441168156**



# మామిడి పూత, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా॥ ఇ. రాంబాబు, డా॥ ఎస్. మాలతి, డా॥ ఎన్. కిషోర్ కుమార్ మరియు బి. క్రాంతి కుమార్
కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల్, మహబూబాబాద్





ఈ సంవత్సరం మామిడి తోటలలో పూత సంతృప్తికరంగా వచ్చింది. ప్రస్తుతం చాలా వరకు మామిడి చెట్లు పూత, పిందె దశలలో ఉన్నాయి. ఈ దశలలో రైతులు చేపట్టే యాజమాన్యంపైన పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. తెలిసి, తెలియక ఈ దశలలో రైతులు పొరపాట్లు చేస్తే దిగుబడి, నాణ్యతపైన ప్రభావం చూపుతుంది.

**పూత దశలో:**

- మామిడిలో పూత రాకముందు తేనె మంచు పురుగులు, చెట్ల మొదళ్ళు, చెట్ల బెరళ్ళలో దాగి ఉంటాయి. పూత సమయానికి ఇవి చెట్టు పైకి ఎగబాకి పూగుత్తులను ఆశించి నష్టపరుస్తాయి.
- పూత ప్రారంభదశలో ఉన్నప్పుడు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.4 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. + లీటరు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. నీటికి కలిపి పిచికారి చేస్తే తేనెమంచు పురుగుతోపాటు బూడిద తెగులను అరికట్టవచ్చును.
- మామిడి చెట్లలో పూత పూర్తిగా విచ్చుకున్న దశలో (తెల్ల పూత) ఎలాంటి పురుగుమందులు పిచికారి చేయకూడదు. ఈ దశలో మందులు చల్లడం వల్ల పిందెలు ఏర్పడడానికి సహాయపడే తేనెటీగలు, కీటకాలు చనిపోతాయి మరియు మందు ద్రావణంలో పూతలోని పుప్పొడి కొట్టుకుపోతుంది. కాబట్టి పూత పిందెలు సరిగా ఏర్పడవు.

**పిందె దశలో:**

**1. నీటి తడులు, హార్మోన్ల పిచికారి:**

- మామిడిలో పూత రాలటం సహజం, మగ పుష్పాలు ఫలదీకరణం చెందని పుష్పాలు రాలిపోతాయి. ఒక పూరెమ్మకు 5-6 పిందెలు కడతాయి. ఈ 5-6 పిందెలలో చివరికి 1 లేదా 2 పిందెలు మాత్రమే ఎదిగి కాయలుగా మారుతాయి. కావున పిందె దశలో ఎక్కువ పిందెలు రాలకుండా తగు జాగ్రత్తలు వహించాలి.
- మామిడిలో పిందెలు రాలిపోవడం పెద్ద సమస్య. నీటి ఎద్దడి, హార్మోన్ల అసమతుల్యత, పోషకాల లోపాలు, అధిక ఉష్ణోగ్రత, అధిక తేమ వలన పిందెలు, కాయలు రాలిపోతాయి.
- పిందెలు ఏర్పడే దశలో 15-20 రోజుల వ్యవధిలో అవకాశం ఉన్న చోట్ల చెట్లకు 2-3 నీటి తడులు ఇస్తే పిందెలు రాలడం తగ్గడమే కాకుండా కాయలు పెద్ద సైజులో వస్తాయి.
- పిందెలు రాలటం తగ్గించడానికి 20 పి.పి.యం నాఫ్తలిన్ ఎసిటిక్ ఆసిడ్ (ప్లానోఫిక్స్) 1.0 మి.లీ. 4.6 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**2. ఎరువుల వాడకం:**

- మామిడిలో పిందెలు ఏర్పడి పెరిగే దశలో చెట్ల వయస్సును బట్టి 500-1000 గ్రా. యూరియా + 500-1000 గ్రా. పొటాష్ + 2 కిలోల వేపపిండితో కలిపి ప్రతి చెట్టుకు వేసుకోవడం వలన కాయలు పెద్ద సైజుకు వచ్చి నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి.
- పిందెలు పసుపు రంగులోకి మారి రాలిపోతే అది పోషకాల లోపం వలన అని గమనించాలి. దీని నివారణకు 1% యూరియా (10 గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి) + పొటాషియం నైట్రేట్ (13-0-45) 10 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ఇదే పోషక మిశ్రమంను కాయలు నిమ్మ పరిమాణంలో ఉన్నప్పుడు 15-20 రోజుల వ్యవధిలో 2-3 సార్లు బోరాన్ 3 గ్రా. లీటరు నీటితో కలిపి పిచికారి చేస్తే కాయల మీద పగుళ్ళు రాకుండా, మంచి సైజుతో పాటు నాణ్యమైన కాయలను పొందవచ్చు.

**3. చీడ, పీడలు:**

- మామిడిలో చిన్న పిందెలు ఏర్పడే దశలో తేనెమంచు పురుగు, తామర పురుగులు, బూడిద తెగులు ఆశించి పిందెలు రాలిపోతాయి. రసంపీల్చే పురుగులు (తామర పురుగులు) ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తేనెమంచు పురుగుల ఉధృతి ఎక్కువైనప్పుడు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- బూడిద తెగుల నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మామిడి కాయలు నిమ్మ సైజులో ఉన్నప్పుడు ఫాస్ఫోమిడాన్ 2.5 మి.లీ.+ వేపనూనె (1500 పిపియం) 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దీంతో టెంక పురుగును, కాయ తొలిచే పురుగును, పండు ఈగల బెడదను నివారించవచ్చును.

అదేవిధంగా పండు ఈగ నివారణకు ఫిబ్రవరి చివరి వారం నుండి మార్చి నెలలో మిథైల్ యూజినాల్ ట్రాప్‌లను ఎకరానికి 4-6 చొప్పున అమర్చుకొని చాలా వరకు తగ్గించవచ్చును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8247350264**

**ఫిబ్రవరి 2025 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు**

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1. | 06.02.2025 | యాసంగి వరి కాండం తొలుచు పురుగు - నివారణ |
| 2. | 15.02.2025 | పంటలలో అడవి పందుల వలన కలుగు ఇబ్బందులు వాటి యాజమాన్యం పద్ధతులు |
| 3. | 21.02.2025 | మామిడి పూత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు |
| 4. | 22.02.2025 | వేసవి నువ్వులో తెగుళ్ళ నివారణ |

# మిరపలో ఆశించు వైరస్ తెగుళ్లు - యాజమాన్య పద్ధతులు



డా॥ యం. వెంకటేశ్వర్ రెడ్డి, డా॥ యం. విజయలక్ష్మి,
డా॥ ఎ. నిర్మల మరియు డా॥ కె. చైతన్య
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

**మిరపలో మూడు రకాల వైరస్ తెగుళ్లు వివిధ దశల్లో ఆశించి నష్ట పరుస్తాయి**

1. జెమిని వైరస్ (లేదా) ఆకుముడత (లేదా) బొబ్బర తెగులు
2. కుకుంబర్ మొజాయిక్ వైరస్ (లేదా) వెర్రి తెగులు
3. పీనట్‌బడ్ నెక్రోసిస్ (లేదా) మొవ్వకుళ్ళు తెగులు

**జెమిని వైరస్ (లేదా) ఆకుముడత (లేదా) బొబ్బర తెగులు:** మిరపలో బొబ్బర తెగులు అనునది జెమిని వైరస్ లేదా చిల్లి లీఫ్ కర్ల్ వైరస్ వలన వస్తుంది. ఇది పంట తొలి దశ నుండి కోత వరకు ఎప్పుడైనా ఆశించవచ్చును. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు మరియు రాత్రి వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది.

**లక్షణాలు:** ఇది ముఖ్యంగా లేత ఆకు మీద గమనించవచ్చును. వైరస్ సోకిన మొక్కల ఆకులు చిన్నవిగా మారి ముడుచుకొనిపోయి పడవ ఆకారంలో కన్పిస్తాయి.


ఆకుల ఈనెలు ఆకుపచ్చగా ఉంటూ ఈనెల మధ్య భాగం లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఈనెలు గట్టిగా, మందంగా ఉండి, ఉబ్బినట్లుగా కన్పిస్తాయి. ఆకుల మీద ఉబ్బిన బొబ్బర్లుగా కన్పిస్తాయి. అంతేకాకుండా మొక్కలో కణుపుల మధ్య దూరం తక్కువగా ఉండి మొక్కలు గిడసబారినట్లు కన్పిస్తాయి. మొక్కల యొక్క పూబాగం పూర్తిగా విడిపోయి రాలిపోతాయి.

**నివారణ చర్యలు:** బొబ్బర తెగులు ఒక మొక్క నుండి ఇంకొక మొక్కకు తెల్ల దోమ వలన వ్యాపిస్తుంది. తెల్ల దోమకు నవంబర్ – డిసెంబర్ మాసాలు అనుకూలంగా ఉండటం వలన, బొబ్బరు తెగులు వ్యాప్తి కూడా ఈ మాసాలలో ఎక్కువగా ఉంటుంది.

**తెల్ల దోమ నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలి**

1. విత్తనశుద్ధి – కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 6 మి.లీ. కలిపి విత్తనశుద్ధి చేయాలి
2. జెమిని వైరస్ సోకిన మొక్కలను ఎప్పటికప్పుడు గుర్తించి పొలం నుండి తొలగించాలి
3. పసుపు రంగు కలిగిన జిగురు పూసిన అట్టలను ఎకరాకు 10 చొప్పున పొలంలో అక్కడక్కడ ఏర్పాటు చేసుకోవాలి
4. పంట నాటిన 20 రోజుల నుండి, వేప నూనె 1500 పిపియమ్ 5 మి.లీ. లీటరు నీటికి పది రోజుల కొకసారి పిచికారీ చేయాలి.







**కుకుంబర్ మొజాయిక్ వైరస్ (లేదా) వెర్రి తెగులు:** ఇది పేనుబంక వలన ఒక మొక్క నుండి మరొక మొక్కకు వ్యాపిస్తుంది. మొక్కలు గిడసబారి, ఎదుగుదల లోపించి, పొట్టిగా ఉంటాయి. ఆకులూ పత్ర హరితాన్ని కోల్పోయి, ఆకారం కోల్పోయి, కొనలు సాగి మొజాయిక్ లక్షణాలను కనబరుస్తాయి. ఆకులూ ముదురు, లేత ఆకుపచ్చ రంగు మేళవింపుతో కన్పిస్తాయి. ఆకు కొనలు సాగి వికృతంగా కన్పిస్తాయి. పూత పిందె కట్టకుండ గొడ్డు పూతగా ఉంటుంది.

**పీనట్ బడ్ నెక్రోసిస్ (లేదా) మొవ్వకుళ్ళు తెగులు:** ఇది తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది పొలం గట్ల మీద ఉండే వయ్యారి భామ మరియు తుత్తిరి బెండ అను కలుపు మొక్కల మీద వృద్ధి చెందుతుది. ఈ కలుపు మొక్కల మీద నుండి తామర పురుగులు పంట మొక్కలకు చేరి రసం పీల్చుట వలన ఈ తెగులు వ్యాపిస్తుంది. అధిక వర్షపాతము తరువాత, బెట్ట పరిస్థితులు వలన తామర పురుగులు వృద్ధి చెంది ఎక్కువగా ఉంటుంది.

ఈ తెగులు నారు మడులలోను మరియు ప్రధాన పొలంలో కూడా ఆశిస్తుంది. ఈ తెగులు సోకిన మొక్క మువ్వ లేదా చిగురు భాగం ఎండిపోతుంది. మొక్కల కాండం మీద మరియు ఆకులు మీద నల్లని మచ్చలు మాడినట్లుగ ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోతాయి.

**నివారణ చర్యలు:**

- వైరస్ తెగుళ్ల తట్టుకొనే రకాలను సాగు చేయాలి
- పంట మార్పిడి పద్ధతులు పాటించాలి
- పచ్చి రొట్ట ఎరువును భూమిలో కలియదున్ని, ఆకరుదుక్కిలో ఎకరాకు 200 కిలోలు వేప పిండి వేసుకోవాలి
- గట్ల మీద, వైరస్ మొక్కలకు స్థావరాలుగా ఉన్న కలుపు మొక్కలకు ఎప్పటికప్పుడు నిర్మూలించి / గట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- పొలం చుట్టూ జొన్న/మొక్కజొన్న పంటను 2-3 వరసలు, కంచె పంటగా పెంచితే, ప్రక్క పొలం నుండి వ్యాపించే రసం పీల్చు పురుగులను అరికట్టవచ్చును

  విత్తనశుద్ధి ద్వారా లీటరు నీటికి 150 గ్రా. ట్రై సోడియం ఆర్థో ఫాస్ఫేట్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 20 నిమిషాలు నానబెట్టి నీడలో ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత కిలో విత్తనానికి 8 మి. లీ ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేయాలి. దీని వలన విత్తిన తరువాత 20 - 25 రోజుల వరకు రసం పీల్చు పురుగుల నుండి రక్షణ పొందవచ్చును.
- నాటేటప్పుడు ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యురాన్ 3 సిజి గుళికలు వేసినట్లయితే ప్రారంభ దశలో రసం పీల్చు పురుగుల తాకిడి తక్కువగా ఉంటుంది.
- నత్రజని, భాస్వరం, పోటాష్ ఎరువును సిఫారసు చేసిన మోతాదులో వేసు కోవాలి. ఎరువుల సమతుల్యతను పాటించాలి.
- సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడటం వలన మొక్కలలో వ్యాధి నిరోధక వ్యాప్తి పెరిగిపోతుంది.
- ఇష్టానుసారంగా కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువగా వాడటం వలన భాస్వరం ఎరువులు భూమిలో స్థిరీకరించే బడతాయి. మొక్కలు సూక్ష్మ పోషకాలను గ్రహించలేవు అందులో ఎక్కువగా జింక్ లోపం బయటు పడుతుంది.
- జింక్ లోపం వలన మొక్కలు బలహీనపడి వైరస్ బారిన పడతాయి. అందువలన సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడాలి.
- జిగురు పూసిన అట్టలను పొలంలో అక్కడక్కడ ఉంచుకోవాలి. తామర పురుగుల నివారణకు బ్ల్యూ కలర్ అట్టలు మరియు తెల్ల దోమ నివారణకు పసుపు రంగు అట్టలుపెట్టడం వలన ఉధృతిని కొంతవరకు అరికట్టవచ్చును.
- వైరస్ సోకిన మొక్కలను గుర్తుంచి తొలగించాలి. వైరస్ స్థావరాలైన కలుపు మొక్కలు లేకుండా శుభ్రం చేయాలి
- తామర పురుగులు నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా డైఫెన్‌థయూరాన్-1.5 గ్రా. లేదా స్పైనొటోరం 1.0 గ్రా. లేదా క్లోరోఫినాఫిర్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి
- తెల్ల దోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సమ్ 0.2 మి.లీ. లేదా స్పైరోయోసిఫెన్ 0.2 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారి చేయాలి

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9491151524**

# అధిక కొవ్వు, ఉప్పు మరియు చక్కెర తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు

ఎ. పోశాద్రి, డి. మోహన్ దాస్, డా॥ యం. సునీల్ కుమార్,
డా॥ జి. శివచరణ్, కె. రాజశేఖర్ మరియు
డా॥ వై. ప్రవీణ్ కుమార్
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్




మన పొలంలో మన యజమాన్య పద్ధతులలో పండించిన బియ్యం, జొన్నలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల నుండి తీసిన నూనె, మనతోట మిరపకాయలు పసుపు కొమ్ముల నుండి తీసిన కారంపొడి, పసుపుపొడి, మరియు అప్పుడే తయారు చేసుకున్న తాజా అల్లం-వెల్లుల్లి పేస్ట్, పెరటితోట నుండి పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు మరియు పెరటికోళ్ల నుండి చికెను, గుడ్లు, పాడిపశువుల నుండి పాలు, పెరుగు, గొర్రెల మరియు మేకల మంద నుండి మాంసం, మన చెరువులో పట్టిన చేపలు, రొయ్యలు మరియు అచ్చ తెలుగు వారి వంటకాలు మరియు పానీయాలు మనకు నచ్చినట్టుగా వండుకోకుండా హోటల్ ఫుడ్‌కు మరియు ప్యాకెట్ ఫుడ్‌కు అలవాటుపడి కల్తీ మరియు కలుషితానికి గురైన ఆహారాన్ని తిని ఆరోగ్యాన్ని పాడుచేసుకుని అనేక జీవన సంబంధిత వ్యాధులకు ప్రజలు గురి అవుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ద్వారా తెలిసింది. సామాజిక మాధ్యమాల వల్ల బయట దొరికే ఆహారానికి విపరీతమైన ప్రాచుర్యం రావడం వలన హోటల్ ఫుడ్స్, రోడ్ సైడ్ బండ్లు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొలుసు ఆహార రెస్టారెంట్స్, వివిధ రకాల కేఫ్స్, వివిధ రకాల పానీయాలు తయారుచేసే అంకుర సంస్థల నుండి జాతీయ మరియు అంతర్జాతీయ పేరుపొందిన ఆహార పరిశ్రమలు తయారుచేసే ప్యాకెట్‌ఫుడ్‌కు అలవాటు పడిపోయి, కొన్నిసార్లు వాటి నిల్వకోసం, రుచికోసం, మంచి రంగు, వాసనకోసం మోతాదుకు మించిన ఉప్పు, చక్కెర, నూనెపదార్థాలు, మరియు ఇతర రసాయన పదార్థాలు ఉండటం వలన అవి తిన్నవారు వివిధ జీవన సంబంధిత రుగ్మతలకు గురి అవుతున్నారు. జాతీయ పోషకాహార సంస్థ సూచించిన దానికంటే అధిక మోతాదులో ఫ్యాట్, సాల్ట్, షుగర్, కలుపుతున్నారని, కృత్రిమ రంగులు, రుచి అందించే మోనోసోడియం గ్లూటమేట్ (ఎమ్ఎస్‌జి) లేదా చైనీస్ సాల్ట్, నిలువ చేయడానికి మోతాదుకు మించిన ప్రిజర్వేటివ్స్, సిట్రిక్ యాసిడ్, కృత్రిమ యాంటీ ఆక్సిడెంట్, సువాసన మరియు మంచి వాసననిచ్చే వివిధ రకాల కృతిమ ఫ్లేవర్స్ మోతాదుకు మించి కలుపుతున్నారని కేంద్ర ఆహార భద్రత ప్రమాణాల సంస్థ నాణ్యత ప్రమాణాల తనిఖీలలో పట్టుకోవడం జరిగినది.

మనం తీసుకునే ఆహారంలో తక్కువ మోతాదులో చెక్కెర, ఉప్పు మరియు తక్కువ పాలిష్ చేసిన ఆహారధాన్యాలు ఉండేటట్టు చూసుకోవాలి. ప్రతిరోజు మనం తీసుకునే వివిధ ఆహారపదార్థాల ద్వారా మన శరీరంలోకి 5 గ్రా. కన్నా ఎక్కువ ఉప్పు తీసుకోరాదు. మానవ శరీరానికి కావలసిన శక్తి 2000 క్యాలరీలలో అధికభాగం (సుమారు 15% కంటే ఎక్కువ) మోతాదులో నూనె పదార్థాల వలన వస్తే సుమారు 30 గ్రాముల నూనె లేదా కొవ్వు రోజు ఆహారంగా తీసుకున్నట్లయితే దానిని ఎక్కువ నూనె పదార్థముగా పరిగణిస్తారు. ప్రతిరోజు నూనెలు లేదా కొవ్వు పదార్థాలు వండటానికి వాడే ఏదైనా నూనె పదార్థాలు 27 గ్రా. కంటే ఎక్కువగా ఒక మనిషి తీసుకోరాదు. అధిక ఉప్పు, అధిక కొవ్వు పదార్థాలు లేదా నూనె రోజు తినే ఆహారంలో అధికంగా ఉండడం వలన రక్తంలో కొలెస్ట్రాల్ పేరుకు పోవడానికి దోహదపడుతుంది. ఒక నెలలో వివిధ రకాల వంట నూనెలను వాడటం వలన సమపాళ్ళలో శరీరానికి కావలసిన కొవ్వు ఆమ్లాలు మరియు ఇతర సూక్ష్మపోషకాలు లభిస్తాయి. ప్రతిరోజు మనం ఉదయం నుండి రాత్రివరకు తినే వివిధ ఆహార పదార్థాల ద్వారా సుమారు 25 గ్రాముల కంటే ఎక్కువ షుగర్ తీసుకున్నట్లయితే దానిని ఎక్కువ షుగర్ మన శరీరానికి తీసుకున్నట్లుగా పరిగణిస్తారు. సాల్ట్, షుగర్, ఫ్యాట్ సూచించిన దానికంటే ఎక్కువ మోతాదులో తీసుకున్నట్లయితే అనేక అనారోగ్య సమస్యలు

వెంటాడుతాయి. కలుషితమైన వాతావరణ పరిస్థితులలో రోడ్డు పైన దొరికే జంక్ ఫుడ్స్ తినడం వలన శరీరంలోకి విష పదార్థాలు వెళ్ళే ఆస్కారం ఉంది. దేశంలో తలసరి వార్షిక మాంసం వినియోగం 5.4 కిలోలు ఉండగా మనరాష్ట్రంలో ఇది 21.17 కిలోలుగా ఉంది. ఎక్కువగా ఎర్రని మాంసం తినడం వలన అనేక రోగాలతోపాటు సుస్థిర మానవాభివృద్ధి లక్ష్యాలకు విఘాతం కలిగే అవకాశం ఉంది. మాంస వినియోగం తగ్గించి పప్పుధాన్యాల, ప్రత్యామ్నాయ వనరుల వినియోగం పైన దృష్టి సారించవలసిన అవసరం ఉంది.

**ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి పోషకాహారం మరియు సుస్థిర వ్యవసాయం కోసం తీసుకోవలసిన చర్యలు:**

- రోజుకు 8 గ్లాసుల నీళ్లు (రెండు లీటర్లు) తప్పనిసరిగా త్రాగాలి.
- తక్కువ నుండి ఎక్కువ వ్యవసాయ ఉత్పత్తులు చేస్తూ మిక్కిలి ఆహార భద్రత కోసం కృషి చేయడం
- పిండిపదార్థాలు అధికంగా ఉన్న పంటలను తగ్గిస్తూ ఎక్కువ ప్రోటీన్లు కలిగిన ఆహార ఉత్పత్తుల సాగు మరియు పెంపకాన్ని ప్రోత్సహించడం.
- **వ్యవసాయ సైకిల్:** న్యూట్రిస్మార్ట్ క్రాప్స్ (బలవర్ధకమైన పోషక విలువలు కలిగిన పంటలను) సాగుచేయడం – మానవ ఆరోగ్యానికి మిక్కిలి మేలుచేసే పంటలను ముఖ్యంగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, పండ్లు కూరగాయలు– అధిక మోతాదులో సాగు చేయడం – పర్యావరణానికి హానిచేయని పంటలను సాగు చేయడం – పంట సాగుతోపాటు జీవనోపాధికి ఉపయోగపడే సమీకృత వ్యవసాయం చేయడం – ప్రాసెసింగ్ మరియు విలువ జోడింపుతో యువతకు, మహిళలకు మరియు గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించడం – చివరగా ప్రజలకు సరసమైన ధరల్లో నాణ్యమైన కల్తీ లేని ఆహారాన్ని అన్ని ప్రాంతాలలో మరియు మార్కెట్లో అందుబాటులో ఉండే విధంగా చూడడం.
- ఆర్గానిక్ పద్ధతిలో వివిధ రకాల ఆహార పదార్థాలను పండించడం మరియు విరివిగా తినడం చేయాలి.
- పాలు మరియు పాల సంబంధిత పదార్థాలు, గుడ్లు, మాంసం, చేపలు మరియు పప్పుధాన్యాలలో అధిక మోతాదులో ప్రోటీన్లు లభించును. జంతువుల నుండి లభించే ఆహార పదార్థాలలో అధిక మోతాదులో నాణ్యమైన ప్రోటీన్లు ఉంటాయి. ముఖ్యంగా శరీరానికి కావాల్సిన అన్ని రకాల అమైనో యాసిడ్స్ దొరుకుతాయి. అందుకే గుడ్లను సంపూర్ణ ఆహారంగా పరిగణిస్తారు.
- అన్నం, గోధుమలు, చిరుధాన్యాలు మరియు పప్పుదినుసులలో కొన్ని రకాల అమైనో ఆసిడ్స్ లభించవు. అందుకనే అన్నం-పప్పు, ఇడ్లీ, దోస వంటి ఆహారంలో ధాన్యము మరియు పప్పుదినుసుల కాంబినేషన్లో తీసుకోవడం ద్వారా శరీరానికి కావలసిన అన్ని రకాల అమైనో యాసిడ్లు లభిస్తాయి.
- చిరుధాన్యాలను (మిల్లెట్స్) తరచుగా ఆహారంగా తీసుకోవడం వలన మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, ఆర్థరైటిస్, ఎనీమియా, ఊబకాయం మొదలగు రుగ్మతలు రాకుండా కాపాడుకోవచ్చు.
- వరి, గోధుమల కన్నా జొన్నలు, చిరుధాన్యాలలో అధిక పోషక విలువలు ఉంటాయి. ముఖ్యంగా వీటిలో అధికమొత్తంలో పీచుపదార్థం, గ్లూటెన్ ఫ్రీ ప్రోటీన్లు, తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ మరియు ఇతర బయోయాక్టివ్ సమ్మేళనాలు కూడా అధికంగా ఉంటాయి.
- జొన్న లేదా చిరుధాన్యాల గటక లేక ఇతర జావా వంటి ఆహార పదార్థాలను పెరుగు లేదా లస్సి లేదా మజ్జిగ వంటివి కలుపుకుని తినడం ద్వారా పెరుగులో ఉన్నటువంటి ఉపయోగకరమైన సూక్ష్మజీవులు శరీరంలో ప్రవేశించి ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ పెంపొందించడానికి తోడ్పడతాయి.
- బత్తాయిలు, కమలాలు, నిమ్మకాయలు మొదలగు సిట్రస్ జాతిపండ్లతో పాటు జామ, ఉసిరి వంటివి తినడంవలన శరీరానికి అధిక మొత్తంలో విటమిన్-సి దొరుకుతుంది తద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇంట్లో మనం తయారు చేసుకునే వివిధ కూరలు మరియు ఆహార పదార్థాలలో పసుపు, అల్లం, వెల్లుల్లి, మిరియాలు వాడడం వలన కుటుంబ ఆరోగ్యం బాగుంటుంది.
- చక్కని శరీర బరువు కోసం మొలకెత్తిన పప్పు ధాన్యాల గింజలు, తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, నట్స్, తక్కువ కొవ్వు కలిగిన పాల పదార్థాలు సమపాళ్లలో తినాలి.
- ఇక్రిసాట్ వారు జొన్నలు మరియు చిరుధాన్యాలతో చేసిన ఆహార ఉత్పత్తులను స్మార్ట్‌ఫుడ్స్‌గా పేర్కొంటారు. ఎందుకంటే ఇవి ఆరోగ్యానికి మంచివి, ప్రకృతిని విషతుల్యం చేయదు మరియు తక్కువ వనరులతో పండించవచ్చు. మార్కెట్లో వీటికి

మంచి ధర ఉంది తద్వారా అధిక లాభాలను రైతులు పొందవచ్చు.

- వన్ హెల్త్ – విధానం ముఖ్యంగా నేల ఆరోగ్యం, పశు సంపద ఆరోగ్యం – మానవ ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ఆహార ఉత్పత్తులు చేయవలసిన అవసరం ఉంది.
- గ్రామీణ మార్కెట్ల అభివృద్ధి మరియు విత్తనం నుండి తయారుచేసిన ఆహార పదార్థాలు వినియోగదారుడి వంటశాలకు చేరే వరకు విలువ గొలుసు (వాల్యు చైన్) ను అభివృద్ధి పరచడం.
- అన్ని కాలాలకు అనుగుణంగా పండే వ్యవసాయ ఉత్పత్తులను విలువ ఆధారిత పదార్థాలుగా మార్చడం ద్వారా అన్ని సమయాలలో ప్రజలకు అందుబాటులో ఉంచవచ్చు.
- వెయ్యి సంవత్సరాల తర్వాత భూమిలో కలిసి పోయే ప్లాస్టిక్‌ను 10 నిమిషాల అవసరం కోసం వాడడం ఎందుకు. ప్రజలందరూ దుకాణానికి సంచి తీసుకొని వెళ్లి పర్యావరణాన్ని కాపాడుకుందాం.

ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే వంగడాలు, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి మరియు సరఫరా, క్షేత్రస్థాయిలో చీడపీడల మరియు తెగుళ్ళ నియంత్రణ, పంటకోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట నిల్వ, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ నిర్వహణ ద్వారా విత్తనం నుండి వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి, విలువ ఆధారిత పదార్థాలు తయారుచేసి ప్యాకేజింగ్ మెటీరియల్లో వినియోగదారుడికి సులభంగా వాడుకునే విధంగా ఉండి వంట గదికి మరియు వినియోగదారుడు ఆహారం తీసుకునే డైనింగ్ టేబుల్‌కు చేరే అంతవరకు తగిన యజమాన్య పద్ధతులు పాటించి సరసమైన ధరలో అమ్మినట్లయితే నాణ్యమైన ఆహారం ప్రజలకు అంది రైతు నుండి వినియోగదారుని వరకు ఆరోగ్యంగాఉండి ఆరోగ్యకరమైన రాష్ట్రం మరియు దేశ నిర్మాణం జరుగుతుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9492828965**

## 31వ పేజీలోని వ్యవసాయ పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 కా | ల్షి | యం | | | 2 ఎ | ని | మి | ది | | | 3 బో |
| ర్త | | సా | | | | | | కం | | | రా |
| గో | | వ | | | | 4 బ్రో | మ | డ | యో | లో | న్ |
| ల్డ్ | | వ్య 5 | | | | | | కొం | | | |
| | | | | | 6 అ | | | న్నెం | | | |
| డి | | | | | గ్గి | | | 7 మ | | 8 జీ | |
| మి | | | | | తె | | | | 9 ఆ | వా | లు |
| 10 మా | ని | 11 పం | డు | తె | గు | లు | | | | మృ | |
| | | డు | | | లు | | | 12 పే | | తం | |
| | | ఈ | | | | | | ను | | | |
| | | గ | | | | | | బం | | | |
| | | | | | | 13 సె | రి | క | ల్చ | ర్ | |

# పాడి పశువుల్లో వచ్చే ఉత్పాదక వ్యాధులు - చికిత్స మరియు నివారణ పద్ధతులు

డా॥ జె. శశాంక్, డా॥ ఎమ్. ఫిబి రాణి మరియు డా॥ జె. జ్యోతి
పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, మామునూరు, వరంగల్



ఉత్పాదక వ్యాధులు లేదా జీవ క్రియ సంబంధ వ్యాధులను ఆంగ్లంలో 'ప్రొడక్షన్' లేదా 'మెటబాలిజమ్ డిసీసెస్' అంటారు. ఈ వ్యాధులు సాధారణంగా అధిక పాల దిగుబడినిచ్చే ఆవులు మరియు గేదెల జాతుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. అంతేకాకుండా పాల ఉత్పత్తి ఎక్కువగా ఉండే మేకలు మరియు గొర్రెల్లో కూడా కనిపిస్తాయి. ఈ ఉత్పాదక వ్యాధుల వలన పాడి పశువులలో పాల దిగుబడి తగ్గిపోవడమే కాకుండా, పశువులు అకస్మాత్తుగా చనిపోవడం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. సాధారణంగా ఈ ఉత్పాదక వ్యాధులు, పశువులకు మనం ఆహారం రూపంలో అందించే శక్తికి మరియు దాని యొక్క ఉత్పాదకతకు సమతుల్యం లోపించినప్పుడు బయటపడతాయి. అంటే అధిక పాల దిగుబడినిచ్చే పశువులకు, పోషక లోపాలున్న ఆహారం ఇవ్వడం ద్వారా ఈ వ్యాధులు వస్తాయి. ఆవులు మరియు గేదెలు ఈనడానికి మూడు వారాల ముందు మరియు ఈనిన మూడు వారాల తర్వాత దశలో ఒత్తిడికి లోనవుతాయి. దీనినే పరివర్తన దశ అంటారు. ఈ సమయంలో పశువు యొక్క శరీరానికి సాధారణ సమయంలో కంటే ఎక్కువ మోతాదులో పోషకాలు, జీవసంబంధ పదార్థాలు మరియు ఖనిజ లవణాల అవసరం ఉంటుంది. ఎందుకంటే ఈనడానికి ముందు చూడి చివరి దశలో గర్భంలో వేగంగా పెరిగే దూడ కోసం మరియు ఈనిన తర్వాత జున్నుపాల ఉత్పత్తి ప్రారంభమవడానికి మరియు ఆ తర్వాత దశలో పాల ఉత్పత్తికి, అధిక శక్తి మరియు కొన్ని ఖనిజ లవణాలు ముఖ్యంగా కాల్షియం, భాస్వరం మరియు మెగ్నీషియంల ఆవశ్యకత ఎక్కువగా ఉంటుంది. ఇవే కాకుండా పశువు యొక్క శరీరంలో ఈ పరివర్తన దశలో (ఈనడానికి మూడు వారాల ముందు మరియు ఈనిన మూడు వారాల తర్వాత) అసాధారణమైన హార్మోన్లు మరియు ఎంజైముల ఉత్పత్తి వలన అసమతుల్యత ఏర్పడి ఉత్పాదక వ్యాధులు సంభవిస్తాయి.

**1. పాలజ్వరం (పాక్షిక లేదా అసంపూర్ణ ప్రసవ పక్షవాతం) :** పాల జ్వరం అనగా పాల వల్ల వచ్చే జ్వరం కాదు. అధిక పాలిచ్చే ఆరోగ్యవంతంగా ఉన్న పాడి పశువుల్లో రక్తంలోని కాల్షియం పరిమాణం అకస్మాత్తుగా తగ్గిపోవడం, తద్వారా రక్తప్రసారంలో అంతరాయం, కండరాల బలహీనత, వెనుక కాళ్ళు పడిపోవడం మరియు అపస్మారక స్థితికిలోనై పశువు మరణించడం జరుగుతుంది.

**పాల జ్వరం రావడానికి కారణాలు:** పాడి పశువులు ఈనిన మొదటివారంలో, ముఖ్యంగా మొదటి రెండు నుండి మూడు రోజుల్లో పాల జ్వరం సంభవిస్తుంది. సాధారణంగా ఈ వ్యాధి 5-10 సంవత్సరాల వయస్సున్న పాడిపశువుల్లో 3-7 ఈతల మధ్యకాలంలో ఎక్కువగా సంభవిస్తుంది. ముఖ్యంగా జఫార్బాడి గేదెలు, జెర్సీ ఆవులలో ఎక్కువగా వస్తుంది.

పశువుల 100 మి.లీ. రక్తంలో కాల్షియం పరిమాణం 8-10 మి.గ్రా. ఉంటుంది. పాడిపశువులలో అధిక పాల ఉత్పత్తి వల్ల ఒత్తిడిలకు, శ్రమకు లోనైనప్పుడు కాల్షియం 6-8 మి.గ్రా.లకు పడిపోయి పాలజ్వరం ఏర్పడుతుంది. పశువు గర్భంతో ఉన్నప్పుడు ఇచ్చే ఆహారంలో కాల్షియం తక్కువగా ఉండడం, ఎక్కువగా వట్టి గడ్డి పెట్టడం, గర్భస్త పశువుల్లో అజీర్తి సమస్య ఎక్కువగా ఉన్నప్పుడు, పారాథైరాయిడ్ గ్రంథి పనిలోపం వల్ల ఎముకల్లో నిలువ ఉన్న కాల్షియం రక్తంలోనికి త్వరగా అందకపోవడం, తద్వారా రక్తంలో కాల్షియం పరిమాణం తగ్గడం సంభవిస్తుంది.

పశువులు ఈనిన తర్వాత జున్నుపాల ద్వారా, మామూలు పాల ద్వారా కాల్షియం ఎక్కువగా పోతుంది. ఆ సమయంలో ప్రేగుల నుండి కాల్షియం తగినంతగా పీల్చుకోలేనప్పుడు, ఎముకలనుండి కాల్షియం తగినంతగా భర్తీ కానందువల్ల, కాల్షియం శాతం సాధారణ స్థాయికంటే తగ్గుతుంది. విటమిన్ డి లోపం, కాల్షియం, ఫాస్పరస్ నిష్పత్తిలో లేదా మొదలగు కారణాల వల్ల కూడా శరీరంలో కాల్షియం వినియోగం కుంటుపడుతుంది. అంతేగాకుండా చల్లని వాతావరణం, ఎక్కువ దూరం పశువులను రవాణా చేయడం, ఆక్సలేట్లు కలిగిన గడ్డిని ఎక్కువగా పెట్టడం వలన శరీరంలో కాల్షియం శాతం తగ్గుతుంది.

**పాలజ్వరం లక్షణాలు:** వ్యాధి లక్షణాలు మూడు దశలలో ఉంటాయి. మొదటి దశలో మేత సరిగ్గా మేయకపోవడం, నెమరు వేయకపోవడం, పళ్ళు కొరుకుతూ బెదురు చూపులతో చికాకుగా ఉండి, నిలబడి వణుకుతూ కదలలేకుండా ఉంటాయి. పాలజ్వరం వ్యాధిలో పశువు జ్వరం కలిగి ఉండకుండా, వ్యాధి ప్రారంభంలో శరీర ఉష్ణోగ్రత మామూలుగా ఉండి, ఆ తర్వాత సాధారణ స్థాయి కంటే తగ్గి ఒళ్లంతా చల్లబడుతుంది. రెండవ దశలో పశువులు సరిగా నిలబడలేకపోతాయి. శ్వాస, నాడి రేటు తగ్గి పశువులు కదలకుండా ఉంటాయి. ఈ స్థితిలో పాడి పశువులు తలను పొట్టపై డొక్కలో ఆనించి "ఎస్" ఆకారంలో ఉండి మగతగా పడుకుని ఉంటాయి. ఇది పాలజ్వరం కేసుల్లో సాధారణంగా కనబడే ప్రత్యేక లక్షణం. మూడవ దశ లేదా వ్యాధి చివరిదశలో శ్వాస మరియు నాడి వేగం తగ్గిపోతాయి. పశువు ఒక వైపు పడిపోవడం, తద్వారా కడుపు ఉబ్బరం మొదలగు లక్షణాలు కనబడతాయి. కండరాల వణుకుతో చలనం లేకుండా, అపస్మారక స్థితిలోకి వెళతాయి.

**వ్యాధి చికిత్స:** పాలజ్వరం ఆలస్యం చేస్తే పశువు చనిపోవడం లేదా పడక జబ్బు (డౌనర్ కౌ సిండ్రోం) కు దారితీస్తుంది. పాలజ్వరం కేసులో రోగనిర్ధారణ అవ్వగానే వెంటనే కాల్షియం బోరో గ్లూకోనేటు 25 శాతం 400-800 మి.లీ. పశువు రక్తనాళాల్లోకి ఎక్కించడం ద్వారా 70-80 శాతం పాడిపశువుల్ని రక్షించుకోవచ్చు. 10 నుండి 12 గంటల వ్యవధిలో కాల్షియం బోరో గ్లూకోనేటు ను మళ్ళీ ఇవ్వాలి.

**వ్యాధి నివారణ:** పాలజ్వరం వ్యాధి నివారణలో భాగంగా పాలిచ్చే పశువులు చూడితో ఉన్నప్పుడు దాణాలో సరిపోయే పాళ్లలో కాల్షియం ఉండేలా జాగ్రత్త పడాలి. లెగ్యూం పశుగ్రాసాలు, పచ్చిమేత, ఎముకలపొడి, ఎండు చేపల్లో కాల్షియం అధికంగా లభ్యమవుతుంది. అలాగని చూడితో ఉన్నప్పుడు అవసరానికి మించి కాల్షియం ఎక్కువగా ఇవ్వడం వల్ల కూడా ఈనిన తర్వాత పాలజ్వరం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అధిక శాతం ఫాస్పరస్, తక్కువ శాతం కాల్షియం (1:3 నిష్పత్తి) తో కూడిన దాణా పశువులు చూడితో ఉన్న చివరి నెలలో ఇవ్వడం ద్వారా పారాథైరాయిడ్ గ్రంధి చురుకుగా పనిచేసి ఈనిన తర్వాత పాలజ్వరం నివారించబడుతుంది. పశువులు ఈనే 24 గంటల ముందు, ఈనిన 10 నుండి 14 గంటల తర్వాత రోజుకు మూడుసార్లు 150 గ్రా. కాల్షియం తాగించడం ద్వారా పాలజ్వరం రాకుండా జాగ్రత్తపడవచ్చు. అమ్మోనియం క్లోరైడ్ 25 గ్రా. చొప్పున చూడి చివరి వారాల్లో అందిస్తూ, ఈనే సమయం చేరేటప్పటికి 100 గ్రా. ప్రతిరోజు అందివ్వాలి. మాక్స్ కాల్ జెల్ ట్యూబు (నియోస్పార్క్ కంపెనీ) పశువు ఈనే ముందు ఒకటి, ఈనిన 6-12 గంటల తర్వాత మరొక ట్యూబులోని మందును నోటి ద్వారా తినిపించాలి. మెటబొలైట్ పౌడర్‌ను (విర్బాక్ కంపెనీ) చూడి పశువులకు చూడి చివరి 20 రోజులు రోజుకు 100 గ్రా చొప్పున తినిపిస్తే, కాల్షియం, భాస్వరం పశువులకంది, ఈనిన తర్వాత పాలజ్వరం సమస్య రాకుండా ఉంటుంది. చూడి, పాడి పశువులు అనవసరపు ఉద్రేకతలకు గురికాకుండా చూడాలి. అధిక పాలిచ్చే పశువులు ఈనిన తర్వాత ప్రారంభంలో పాలు పూర్తిగా పితకకూడదు. ఈ విధమైన చర్యలు చేపట్టడం ద్వారా పాలజ్వరం నివారించబడుతుంది.

**2. ఎండు వాతం (కీటోసిస్):** దీనినే అసిటోనిమ్నియా మరియు హైపోగ్లెసిమియా అనికూడా అంటారు. కీటోసిస్ ముఖ్యంగా అధిక పాల దిగుబడినిచ్చే సంకరజాతి ఆవులలో, ముర్రా గ్రేడెడ్ గేదెలలో వస్తుంది. ఈ వ్యాధి పశువు ఈనిన నెలలోపు రావడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి మొదటి ఈతలో కన్నా మూడు, నాల్గవ ఈత పశువులలో ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి వలన పాడి పశువుల్లో గ్లూకోజు శాతం తగ్గిపోవడం తద్వారా కిటోనిమియా మరియు కిటోన్యూరియా కనపడుతాయి.

**వ్యాధి కారణాలు:** సైలేజి ఎక్కువగా తినిపించడం ఇందులో బ్యూటిరిక్ ఆమ్లం అనే కిటోన్ బాడి ఎక్కువగా ఉంటుంది. తక్కువ శక్తినిచ్చే ఆహార పదార్థాలు తినిపించడం ముఖ్యంగా ఈనిన తరువాత, పోషకాహార లోపం వలన కోబాల్ట్, భాస్వరం వంటి ఖనిజ లవణాల లోపం వలన, కాలేయం సరిగా పనిచేయక పోవడం వలన, థైరాయిడ్ గ్రంది తక్కువగా పనిచేయడం వలన మరియు కొన్ని హార్మోన్ల కొరత వలన కీటోసిస్ వస్తుంది.

**వ్యాధి లక్షణాలు:** ఈ వ్యాధి లక్షణాలు రెండు రకాలుగా ఉంటాయి.

**మొదటి రకం:** గేదెలలో ఎక్కువగా వస్తుంది. దీనినే 'వేస్టింగ్ ఫామ్' అంటారు. మేత మేయవు, దాణా తినవు కాని చొప్ప తింటాయి. పశువులు చురుకుదనం కోల్పోయి మగతగా ఉంటాయి. శరీర

బరువు త్వరగా తగ్గుతుంది. పేడ గట్టిగా వేస్తుంది. అరల పొట్టలో కదలికలు తగ్గుతాయి. పశువు నడక బిగబట్టినట్లుగా ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత, శ్వాస, నాడి సాధారణంగా ఉంటాయి. చర్మం గరుకుగా, జీవం కోల్పోయినట్లుగా ఉంటుంది. వ్యాధి ముదిరిన కొద్ది శ్వాస, పాలలో తియ్యటి వాసన (కిటోన్ బాడీస్ వాసన) వస్తుంది.

**రెండవ రకం:** సంకరజాతి ఆవులలో నరాల సంబంధమైన లక్షణాలు కనిపిస్తాయి. పశువు గుండ్రంగా తిరగడం, కాళ్ళు అడ్డంగా పెట్టడం, చర్మాన్ని, వస్తువుల్ని అతిగా నాకుతాయి. చొంగ అధికంగా కారుతుంది. కండరాలలో వణుకు, గుడ్డితనం, గమ్యం లేకుండా తిరగడం వంటి లక్షణాలు గంట నుండి రెండు గంటల వరకు ఉండి, మళ్ళీ ప్రతి ఎనిమిది నుండి పన్నెండు గంటల్లో కనిపిస్తాయి. ఈ దశలో పశువుకు గాయాలు అయ్యే అవకాశాలు ఎక్కువ.

**వ్యాధి చికిత్స:** 20 % గ్లూకోజ్ 500 మి.లీ.-1 లీటరు వరకు రక్తంలోకి రోజుకు రెండుసార్లు ఎక్కించాలి. గ్లిసరిన్ లేదా ప్రొపైలిన్ గ్లైకాల్ 225 గ్రా. రోజుకి రెండుసార్లు మొదటి రెండు రోజులు మరియు తరువాత రెండు రోజులు 125 గ్రా. జాగ్రత్తగా పశువుకి త్రాగించాలి. సోడియం ప్రొపయినేట్ 100-200 గ్రా. మూడు రోజులు తినిపించాలి. లాక్టేటులు ముఖ్యంగా (కాల్షియం, సోడియం, అమ్మోనియం) రోజుకి 200 గ్రా. ఇవ్వాలి. ఇన్సులిన్ సూది మందులు 200-300 యూనిట్లు ఒక్కో పశువుకి ఇప్పించాలి. దీనివలన గ్లూకోజ్ వినియోగం ఎక్కువవుతుంది. కోబాల్ట్, భాస్వరం ఉన్న ఖనిజ లవణాల మిశ్రమం తినే ఆహారంలో వాడాలి. కార్టికోస్టిరాయిడ్ వంటి ఇంజక్షన్లు ఇవ్వాలి. కిటోనిల్ జెల్, మెటబొలైట్, కిటోనెక్స్ గోళీలు మరియు ఈ-బూస్టర్ వంటి మందులను నోటి ద్వారా ఇవ్వాలి.

**వ్యాధి నివారణ:** పశువు మరీ సన్నగా, మరీ లావుగా కాకుండా చూడాలి. ముఖ్యంగా పాల ఉత్పత్తి తగ్గే సమయంలో, పశువు ఈనే సమయంలో అధికంగా మేపకూడదు, ఉపవాసం ఉంచకూడదు. పాడి పశువులకు ప్రతీ రోజు వ్యాయామం చేయించాలి. ఈనిన తరువాత, పాల దిగుబడి పెరుగుతున్న సమయంలో దాణా పరిమాణం పెంచాలి. పశువుల మందలో మెటబాలిక్ ప్రొఫైల్ పరీక్షలు నిర్వహించాలి. ఈనిన ఆరు వారాల వరకు సోడియం ప్రొపయనేట్ 100 గ్రా. రోజుకు అందివ్వాలి. మొక్కజొన్నలను తినే దాణాలలో భాగంగా ఇవ్వాలి. దాణాలో సరైన పాళ్ళలో కోబాల్ట్, అయోడిన్ ఉండాలి. సైలేజి ఎక్కువగా ఇవ్వకూడదు.

**3. పడకజబ్బు:** పశువు ఈనిన 24 గంటల తరువాత రెండు సార్లు కాల్షియం మందును రక్తంలోనికి ఎక్కించినప్పటికీ పైకి లేచి నిలువలేని పశువును 'డౌనర్' అని అంటారు.

**వ్యాధి కారణాలు :** మొదటిగా కండరాలు దెబ్బ తినటం వలన, రెండవదిగా నరాలు దెబ్బ తినటం వలన. ఈనిన వెంటనే పశువును బలవంతంగా పైకి లేపినప్పుడు లేదా జారుడు గచ్చుపై నడిపించినప్పుడు లేదా దూడ పెద్దదిగా ఉన్నప్పుడు, పశువు తొంటి చుట్టూ ఉన్న కండరాలు దెబ్బతిని పశువులు పడకజబ్బుకు లోనైతాయి. పశువు ఈనేటప్పుడు, వెనుక కాళ్ళలోని అబురేటర్ మరియు సయాటిక్ నరాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. పాలజ్వరం వచ్చిన పశువు ప్రక్కకి పడిపోయి లేదా నందిపాటులో ఉన్నప్పుడు రేడియల్ మరియు పెరినియల్ నరాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. కనుక కారణం ఏదైనా నరాలు దెబ్బతినటం వలన పశువులు పడక జబ్బుబారిన పడతాయి.

**వ్యాధి నివారణ :** ఈనిన పశువులలో పాల జ్వరంను గుర్తించి సకాలంలో చికిత్స చేయించాలి. నందిపాటులో ఉన్న పశువులను నిలబడేటట్లుగా ప్రయత్నం చేయాలి. ప్రక్కకి పడి ఉన్న పశువులను నందిపాటులో ఉండేటట్లుగా చేయాలి. ఒక ప్రక్కనుండి ఒక ప్రక్కకు తరచుగా పొర్లించాలి. ఈనే పశువులను వేరుగా ఉంచి, ఈనిన 48 గంటల వరకు జాగ్రత్తగా గమనించాలి. పశువుల పాకలో జారని గచ్చు ఉండేటట్లు జాగ్రత్తపడాలి.

ఈ ఉత్పాదక వ్యాధులను నిర్లక్ష్యం చేసినట్లైతే అవి ముదిరి, తీవ్రత అధికమై రైతుకు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తాయి. పరివర్తన దశలో (ఈనడానికి మూడు వారాల ముందు మరియు ఈనిన మూడు వారాల తర్వాత) పశువు యొక్క ఆరోగ్యం మరియు ఆహారం గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. ఈ సమయంలో అధిక శక్తితో కూడిన ఆహారం మరియు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పశువుల పాకలో ప్రత్యేక పర్యవేక్షణ చేయవలసి ఉంటుంది. ఇందులో భాగంగా కొన్ని పరీక్షలు చేయాలి. వాటినే 'మెటబాలిక్ ప్రొఫైల్ పరీక్షలు' అంటారు. దీనికి గాను చూడి చివరి దశలో మరియు ఈనిన తర్వాత పశువు యొక్క రక్తంలోని గ్లూకోస్ మరియు కొన్ని లవణాలు ముఖ్యంగా కాల్షియం, భాస్వరం మరియు మెగ్నీషియం అంచనా వేయించాలి. ఈ రకంగా లోపాలను ముందుగా కనుగొని, సంబంధిత పోషకాలను లేదా లవణాలను ఎక్కువ మోతాదులో ఇవ్వగలిగితే చాలా వరకు ఈ ఉత్పాదక వ్యాధులను తగ్గించుకోవచ్చు. పైన చెప్పిన విధంగా రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోగలిగితే ఈ ఉత్పాదక వ్యాధులను నివారించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9866922336



# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా॥ ఆర్. విజయ కుమారి, జి. రామకృష్ణ, పి. వెంకటేష్ మరియు ఏ. శ్రీనివాస్
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2024-25 సంవత్సరం యాసంగి (రబీ) మరియు ఎండాకాలంలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంట కోత సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 22 సంవత్సరాల నెలవారి మోడల్ ధరలు మరియు 7 సంవత్సరాల పక్షం రోజుల మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2024-25 రబీ మరియు ఎండా కాలం పంటకోత సమయంలో ధర ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది, దానిని అనుసరించి:

### 2024-25 యాసంగి (రబీ) పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు :

| క.సం. | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి.) |
|---|---|---|---|---|
| 1. | వరి (సాధారణం) | సూర్యాపేట్ | మార్చి-మే | 2320-2530 |
| 2. | వరి (గ్రేడ్ ఏ) | జమ్మికుంట | మార్చి-మే | 2630-2970 |

### 2024-25 ఎండాకాలం పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు

| క.సం. | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి.) |
|---|---|---|---|---|
| 1. | టమాట | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 850-1050 |
| 2. | వంకాయ | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 1730-2180 |
| 3. | బెండ | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 1850-2250 |
| 4. | బత్తాయి | గడ్డిఅన్నారం | మార్చి-ఏప్రిల్ | 3400-3700 |
| 5. | మామిడి | గడ్డిఅన్నారం | మార్చి-మే | 4100-4850 |

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.
మొబైల్ నెం. : 9948780355, 9154828514, ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com
వెబ్ సైట్ : https://pjtsau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక :** గత 20 సంవత్సరాల ధరలను విశ్లేషించి పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును, కావున భవిష్యత్‌లో పంటల ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

# చిన్న జీవాలలో పీపీఆర్ వ్యాధి: కారణాలు, లక్షణాలు మరియు నివారణ

డా॥ జి. మిథున్ మరియు డా॥ జి. త్రివేణి
పశువైద్య మరియు పశుసంవర్ధక విస్తరణ విభాగము, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం,
పశువైద్య కళాశాల, తిరుపతి

మేకలు మరియు గొర్రెలు పశుపోషణలో ముఖ్యమైన స్థానం కలిగిన జీవాలు. వీటి ద్వారా రైతులు ఆదాయాన్ని, ఆహార భద్రతను పొందుతారు. కానీ, చిన్న జీవాలకు పీపీఆర్ వంటి వైరస్ వ్యాధులు వ్యాప్తి చెందితే, వాటి ఆరోగ్యం, ఉత్పత్తి మరియు రైతుల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కాబట్టి, ఈ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండటం, అవసరమైన నివారణ చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ వ్యాధి పెద్ద రోగము లేక ముసర వ్యాధిని పోలి ఉంటుంది. పీపీఆర్ చాలా ప్రమాదకరమైన వ్యాధి, ఇది వేగంగా వ్యాపించి, మేకలు మరియు గొర్రెలను ప్రాణ నష్టం కలిగించే సామర్థ్యం కలిగి ఉంటుంది.

## వ్యాధి కారకం ..?

- ఈ వ్యాధి "మొర్బిల్లి వైరస్" వలన వస్తుంది.
- ఇది అంటువ్యాధి.
- సాధారణంగా కొత్తగా కొనుగోలు చేసిన మేకలను మందలో చేర్చిన తరువాత వ్యాధి వ్యాపిస్తుంది.
- ఒక దాని నుండి మరొక దానికి వ్యాప్తి చెంది 4 నుండి 10 రోజులలో లక్షణాలు కనబడతాయి.

## రోగ లక్షణాలు :

- వ్యాధి సోకిన మేకలలో జ్వరం తీవ్రంగా ($104^0$ – $106^0$ఎఫ్) ఉంటుంది.
- జ్వరం వచ్చిన రెండు మూడు రోజుల తరువాత, మేకలు పలుచగా పారడం, రక్తంతో కూడిన విరేచనాలు అవడం, కొన్ని సందర్భాలలో నలుపు రంగులో విరేచనాలు అవడాన్ని గమనించవచ్చును.
- దగ్గు ఎక్కువగా రావడంతో పాటు కళ్ళు మరియు ముక్కుల నుండి నీరు కారుతూ ఉంటుంది.
- ఈ నీరు క్రమంగా చీమిడిగా మారి ముక్కు రంధ్రాలు మూసుకుపోయి ఊపిరి తీసుకోలేక ఇబ్బంది పడుతుంటాయి.
- నోరు, పెదవులు, నాలుక, చెంపలు, కండరాల లోపలి భాగాలు మరియు ఆడ గొర్రెల్లో యోని పెదవులు ఉబ్బి, పొక్కులు ఏర్పడతాయి.
- వ్యాధి సోకిన మేకలు నీరసంగా ఉంటాయి. మేత మేయక 5 – 6 రోజులలో చనిపోతాయి.
- చూడి మేకలు ఈడుసుకుపోవడం గమనించవచ్చును.



## చికిత్స :

- ఈ వ్యాధికి సరైన చికిత్స లేనప్పటికి, వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే దగ్గరలోని పశువైద్యున్ని సంప్రదించి యాంటీబయోటిక్స్, ఇతర మందులతో చికిత్స చేసినట్లైతే వ్యాధి తీవ్రతను తగ్గించి కాపాడుకోవచ్చును.
- పొటాషియం పర్మాంగనేట్ 1% ద్రావణంతో పొక్కులు కడగాలి.
- ఉప్పు, గ్లూకోజు కలిపిన గంజిని తాగించడం వల్ల త్వరగా కోలుకుంటాయి.

## నివారణ చర్యాలు :

- నాలుగు నెలలు నిండిన ప్రతి గొర్రె మరియు మేక
- పిల్లలకి తప్పనిసరిగా పి.పి.ఆర్. టీకాలు వేయించవలెను. గొర్రెలు మరియు మేకలకు జనవరి మాసంలో ఈ టీకాలను ప్రతి సంవత్సరం ఇవ్వవలెను.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7799804000


# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

**డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి**
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| | | **I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00** | |
| 1. | 04.03.2025 | సమస్యాత్మక కలుపు మొక్కల యాజమాన్యం | డా॥ బి. పద్మజ, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ వీడ్ మెనేజ్‌మెంట్, రాజేంద్రనగర్, 9440040605 |
| 2. | 10.03.2025 | అగ్రో ఫారెస్ట్రీ విధానంతో లాభసాటియైన వ్యవసాయం | డా॥ ఎ.వి. రామాంజనీయులు, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ అగ్రో ఫారెస్ట్రీ, రాజేంద్రనగర్, 9441312264 |
| 3 | 13.03.2025 | ప్రస్తుతం ఉన్న వివిధ పంటలలో తెగుళ్ళు - సమగ్ర సస్యరక్షణ | డా॥ ఎ. విజయభాస్కర్, సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్, 9849817896 |
| 4 | 18.03.2025 | వేసవి అపరాల సాగు మరియు అపరాల విత్తనోత్పత్తిలో మెళకువలు | డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్(ప్లాంట్ బ్రీడింగ్) వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర 7675050041 |
| 5 | 24.03.2025 | వేసవి పంటలలో చీడపీడల యాజమాన్యం | శ్రీ కె. రాహుల్ విశ్వకర్మ, శాస్త్రవేత్త (ఎంటమాలజీ) ఏరువాక కేంద్రం, జోగిపేట, 7013192530 |
| 6 | 25.03.2025 | సమగ్ర వ్యవసాయ విధానంతో రైతుకు నిరంతర ఆదాయం | డా॥ ఫిరోజ్ షెహెన, శాస్త్రవేత్త (అగ్రానమి) ఆర్.ఎస్. & ఆర్.ఆర్.ఎస్., రుద్రూర్ 9182375732 |
| 7 | 26.03.2025 | పుట్టగోడుగుల పెంపకంలో మెళకువలు | డా॥ యం. ప్రమీల, సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్, రాజేంద్రనగర్, 9866706545 |
| 8. | 27.03.2025 | భూసార పరీక్ష - మట్టి నమూన సేకరణ పద్ధతులు - ఉపయోగాలు | డా॥ ఎ. మాధవి, ప్రధాన శాస్త్రవేత్త (ఎస్.ఎస్.) & హెడ్ ఐ.ఎన్.హెచ్.యం., రాజేంద్రనగర్, 9848976765 |

**II. టి-శాట్ (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 4.00-5.00**

| | | | |
|---|---|---|---|
| 1. | 03.03.2025 | వివిధ పంటలలో పోషక సమస్యలు - నివారణ | డా॥ కె. శేఖర్, శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూర్, 9032128124 |
| 2. | 10.03.2025 | పందిరిపై తీగజాతి కూరగాయల పెంపకం | డా॥ యు. స్రవంతి, ఎస్.యం.ఎస్. (హార్టికల్చర్) కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, 9490844782 |
| 3. | 17.03.2025 | ప్రస్తుతం ఉద్యాన పంటలలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు | డా॥ వి. చైతన్య, ఎస్.యం.ఎస్. (హార్టికల్చర్) కృషి విజ్ఞాన కేంద్రం, వైరా, 9441632227 |
| 4. | 24.03.2025 | ప్రస్తుతం యాసంగి వరి పంట సాగు - సూచనలు | డా॥ ఎల్. కృష్ణ, ప్రధాన శాస్త్రవేత్త (జి.పి.బి.ఆర్.) వరి పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, 9866091711 |

**III. టి-శాట్ - (శనివారం): సాయంత్రం 4.00-5.00**

| | | | |
|---|---|---|---|
| 1. | 01.03.2025 | వరిలో తెగుళ్ళ యాజమాన్యం | డా॥ టి. కిరణ్ బాబు, శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) వరి పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, 9848329394 |
| 2 | 08.03.2025 | లాభసాటి సమగ్ర వ్యవసాయంలో మెళకువలు | డా॥ కె. చిరంజీవి, శాస్త్రవేత్త (అగ్రానమి) ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ ఐ.ఎఫ్.ఎస్., రాజేంద్రనగర్, 8374334031 |
| 3 | 15.03.2025 | వేసవి నూనెగింజల పంటల్లో సస్యరక్షణ | డా॥ బి. మల్లయ్య, సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) మొక్కజొన్న పరిశోధన స్థానం, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 9440504167 |
| 4 | 22.03.2025 | వేసవి పంటలలో సూక్ష్మ పోషకాల యాజమాన్యం | డా॥ టి. సుకృత్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (ఎస్. ఎస్.) ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ మైక్రోన్యూట్రిన్స్, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 9491402702 |
| 5 | 29.03.2025 | వేసవి పంటలలో పోషకాల యాజమాన్యం | డా॥ జె.ఎస్. సుధారాణి, శాస్త్రవేత్త (అగ్రానమి) ఎలక్ట్రానిక్ వింగ్, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 9550526096 |



# రైతన్నకో ప్రశ్న...

**డా॥ ఆర్. సునీత దేవి**
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. ఈ క్రింది వాటిలో ఎరువుల వినియోగ సామర్థ్యం, ప్రభావితం చేసే అంశాలు ఏవి? డి**

ఎ) నేల లక్షణాలు  బి) వాతావరణం
సి) పంటలు  డి) పైవన్నీ

**2. ఐ సి ఏ ఆర్ ఆధ్వర్యంలోని జాతీయ సోయా పరిశోధన సంచాలనాలయం ఎక్కడ ఉన్నది?**

ఎ) చెన్నై  బి) జబల్‌పూర్
సి) ఇండోర్  డి) హైదరాబాద్

**3. మామిడిలో పిందె రాలటం తగ్గించడానికి ఈ క్రింద పేర్కొన్న ఏ హార్మోను పిచికారి చేయాలి?**

ఎ) నాఫ్తలిన్ ఎసిటిక్ యాసిడ్
బి) జిబ్బరెల్లిక్ యాసిడ్
సి) ఆబ్‌సైసిక్ యాసిడ్  డి) పైవన్నీ

**4. పొటాషియం నైట్రేట్‌లో ఎంత శాతం పొటాషియం ఉంటుంది?**

ఎ) 13%  బి) 19%
సి) 60%  డి) 46%

**5. అపరాల నిల్వలో ప్రధానంగా ఆశించే పురుగు ఏది?**

ఎ) నుసి పురుగు  బి) పిండి పురుగు
సి) పెంకు పురుగు  డి) తుట్టె పురుగు

**6. వేసవి పంటగా పెసర, మినుమును రైతులు ఎప్పటి వరకు వేసుకోవచ్చు?**

ఎ) మార్చి 15 వరకు  బి) ఏప్రిల్ 15 వరకు
సి) ఏప్రిల్ చివరి వరకు  డి) ఏదీకాదు

**7. అన్ని రకాల నెలలకు అనుకూలమైన పశుగ్రాస పంట ఏది?**

ఎ) జీలుగ  బి) ఉలవ
సి) అలసంద  డి) జనుము

**8. పెంచడానికి అనుకూలమైన తేనెటీగల రకాలు ఏవి?**

ఎ) పుట్ట తేనెటీగలు (ఎపిస్ సెరానా ఇండికా)
బి) ఐరోపా తేనెటీగలు (ఎపిస్ మెల్లిఫెరా)
సి ఎ మరియు బి
డి) ఏదీకాదు

**9. బెండలో పల్లాకు తెగులు (శంఖు రోగం) ఏ పురుగు ద్వారా వ్యాప్తి చెందుతుంది?**

ఎ) పేనుబంక  బి) తెల్లదోమ
సి) పచ్చదోమ  డి) తామర పురుగులు

**10. లాభాదాయ వ్యవసాయం కొరకు సరియైన పంటల ప్రణాళికలో భాగంగా రైతులు సాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

ఎ) అంతర పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి
బి) ఏక పంటకు బదులు బహుళ పంటలు ఎన్నుకోవాలి
సి) ప్రాంతాలకనువైన వివిధ చీడపీడలను తట్టుకునే రకాలను ఎన్నుకోవాలి
డి) పైవన్నీ

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు




## విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన అమెరికాలోని ఆబర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ఉన్నత స్థాయి బృందం

అమెరికాలోని ఆబర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ఉన్నత స్థాయి బృందం ఫిబ్రవరి 7న విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య విశ్వవిద్యాలయ బోధన, పరిశోధన మరియు విస్తరణ విభాగాలలో చేస్తున్న కార్యక్రమాల గురించి వారికి వివరించారు. అదేవిధంగా అంతర్జాతీయ సంస్థలతో విస్తృతంగా ఒప్పందాలు కుదుర్చుకుని బోధన, పరిశోధన తదితర రంగాల్లో పరస్పరం కలిసి పనిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికల్ని రూపొందిస్తున్నామని తెలిపారు.

## విశ్వవిద్యాలయంతో భారతీయ వరి పరిశోధన సంస్థ అవగాహన ఒప్పందం

విశ్వవిద్యాలయంతో భారతీయ వరి పరిశోధనా సంస్థ, హైదరాబాద్ ఫిబ్రవరి 17న అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పరిశోధనలు ప్రాధాన్యతా పద్ధతిలో చేపట్టాలని, వరిలో ఉత్పత్తి, ఉత్పాదకతల పెంపుతో పాటు రైతులకు, వినియోగదారులకు కూడా ప్రయోజనాలు కలిగించే విధంగా ఇరు సంస్థలు కలిసి పనిచేయాలన్నారు. వరిలో కార్బన్ క్రెడిట్ ద్వారా రైతులు మరింత ఆర్థికపరమైన ప్రయోజనం కలిగించే విధానాలపై దృష్టి నిలపాలన్నారు. వరిలో వాతావరణ మార్పులను తట్టుకునే వరి రకాల రూపకల్పన ప్రస్తుత అవసరమన్నారు. అంతేకాకుండా ప్రస్తుతం తెలంగాణ 5 మిలియన్ టన్నుల మేర వరి ధాన్యం మిగులు ఉత్పత్తి చేస్తోందని, అందుకు ఎగుమతులే సరైన విధానమని, రైతులను అటువైపు మళ్లించడానికి అవసరమైన సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## విశ్వవిద్యాలయంతో ఇండో క్లైమేట్ సెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం

వ్యవసాయ విశ్వవిద్యాలయంతో, హైదరాబాద్‌కు చెందిన ఇండో క్లైమేట్ సెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫిబ్రవరి 6న నేలలోని పోషకాల స్థాయిలని గుర్తించే సెన్సార్ల పై ఇరు సంస్థలు కలిసి పని చేసేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది.

## మానసిక మరియు పోషకాహార నాణ్యతలు, వ్యక్తి వికాసంపై ఉండే ప్రభావం అన్న అంశం పై శిక్షణ కార్యక్రమం

మానసిక మరియు పోషకాహార నాణ్యతలు, వ్యక్తి వికాసంపై ఉండే ప్రభావం అన్న అంశం పై 21 రోజుల శిక్షణ కార్యక్రమం రాజేంద్రనగర్‌లో ఫిబ్రవరి 25న ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ, మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులు, పట్టణీకరణ, వాతావరణ మార్పులు, కుటుంబ, వ్యక్తిగత పరిస్థితుల కారణంగా అనేక కొత్త సవాళ్ళు ఎదురవుతున్నాయని, వాటిని ఎదుర్కొనే విధంగా ప్రస్తుత విద్యా వ్యవస్థ లేదని అభిప్రాయపడ్డారు. వ్యక్తి సంతులన జీవితం సాగించే విధానాలు అలవర్చుకునేలా విద్యావ్యవస్థ మారాలని సూచించారు. అదే విధంగా దేశంలో ఆహార నాణ్యతకి పెద్దగా ప్రాముఖ్యత ఇవ్వకపోవడం వల్ల కల్తీ ఆహారం దైనందిన జీవితంలో భాగం అయింది అని, దీనిని అరికట్టక పోతే ముందు మానవ వనరుల నాణ్యతపై తీవ్ర ప్రభావం ఉంటుందని అన్నారు.

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ హెల్త్ సైకాలజీ, స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విభాగాధిపతి డా॥ జి. పద్మజ మాట్లాడుతూ ప్రస్తుతం మనుషుల జీవిత కాలం పెరుగుతున్నప్పటికీ జీవితాల్లో నాణ్యత కొరవడిందన్నారు. మొబైల్ ఫోన్ వల్ల సమాచారం అధికంగా అందుబాటులోకి వచ్చి మనుషులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మెరుగైన సామాజిక జీవనం కోసం ఆహారం, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన సిబ్బంది, శిక్షణ పొందువారు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో యంత్ర ప్రదర్శన మేళా

వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్‌లోని ఫాం ఇంప్లిమెంట్స్ స్కీంలో భాగంగా వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శనను ఫిబ్రవరి 3న ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ యంత్ర పరికరాల విభాగం ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ డా॥ రాజయ్య మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు, వ్యవసాయ యాంత్రీకరణను ప్రస్తుత 3.5 కెడబ్ల్యు నుండి 2030 నాటికి 6 కెడబ్ల్యు వరకు పెంచాల్సిన అవసరం ఉందని, అలాగే 2047 నాటికి యాంత్రీకరణ స్థాయి ప్రస్తుతం ఉన్న 45% నుండి 75% వరకు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. వరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ డా॥ దామోదర్ రాజు మాట్లాడుతూ నూతన వ్యవసాయ యంత్ర పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి, సమయం మరియు శ్రమను ఆదా చేయడానికి కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. మొక్కజొన్న పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ డా॥ ఎమ్. సుజాత మాట్లాడుతూ మొక్కజొన్న మరియు ఆముదము పంటల్లో ఉపయోగించే యంత్రపరికరాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పి. సుధాకర్ మరియు మార్ఫ్ బాబు

# జనుము విత్తనోత్పత్తి - కోతులకు మరియు అడవి పందులకు పరిష్కారమా?

డా।। సిహెచ్. పల్లవి మరియు జె. విజయ్
ఏరువాక కేంద్రం, తోర్నాల



రసాయన ఎరువులు, పురుగుమందులతో భూసారం తగ్గిపోతుంది. పంటలను పండించడానికి పనికిరాకుండా నేల తయారవుతుంది. ఈ తరుణంలో భూమిలో పోషకాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నది. పొలంలో పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు.

పచ్చి రొట్టెను సాగు చేయడం ద్వారా నేలలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి, పంటలకు పోషకాల లభ్యత పెరుగుతుంది. అంతేకాకుండా నేల భౌతిక, రసాయనిక పరిస్థితులు మెరుగుపడతాయి. నీరు నిల్వ ఉండే పొలాలతో పాటు భీడు భూముల్లో పచ్చిరొట్ట సాగు ద్వారా నేల భౌతిక లక్షణాలు మెరుగుపడతాయి. ఇతర పంటలు పండించడానికి అనువుగా మారతాయి. అయితే రైతులు ఎక్కువగా ప్రభుత్వ సబ్సిడీ విత్తనాలపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. అవి అందుబాటులో లేకపోవడంతో ఎక్కువగా రసాయన ఎరువులపైనే ఆధారపడి పెట్టుబడి ఖర్చులను పెంచుకుంటున్నారు.

అయితే ప్రతిసారి విత్తనం కొనుగోలు చేయడం ఖర్చుతో కూడుకున్న పని. ఈ నేపథ్యంలో రబీలో రైతులే స్వంతంగా పచ్చిరొట్ట పంటైన జనుము విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నారు. ముఖ్యంగా సిద్దిపేట జిల్లాలోని అక్కన్నపేట మండలంలోని గొల్లెకుంట, గండిపల్లి, నందారం, కుందనవాని పల్లె, రామవరం, పోతారం గ్రామాలలో దాదాపుగా 400-500 ఎకరాలలో రైతులు రబీలో జనుమును గత మూడు సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. పచ్చిరొట్ట గానే కాకుండా విత్తన ఉత్పత్తితో అదనపు ఆదాయంతో పాటు భూసారం పెంపొందించుకోవచ్చును.

సాధారణంగా రైతులు నీటి వసతి ఉన్న ప్రాంతాలలో వరికి ముందు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి, తర్వాత దాన్ని కలియదున్ని వరి సాగు చేసి దాని ఎదుగుదలకు అవసరమైన పోషకాలను పెంపొందించుకుంటారు.

దాదాపుగా సిద్దిపేటలోని వానాకాలంలో 40 వేల ఎకరాలలో పచ్చిరొట్ట పైర్లను వరికి ముందు సాగు చేస్తున్నారు. అయితే 400-500 టన్నుల పచ్చి రొట్ట విత్తనాలు మనకు అవసరమైపోతాయి. అయితే సకాలంలో సబ్సిడీలో విత్తనాలు అందుబాటులోకి రాక రైతులు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయలేకపోతున్నారు. మెట్ట రైతులు యాసంగిలో జనుమును విత్తనానికి పండించి భూమిని సారావంతంగా చేసుకోవడమేగాక, ఎరువుల వాడకంతో పాటు సాగు ఖర్చును కూడా తగ్గించుకుంటున్నారు. ఈ ప్రాంతంలో నీటి సౌకర్యం లేనందున మరియు అడవి పందుల బెడద ఎక్కువగా ఉన్నందున మొక్కజొన్న సాగు చేయడం బాగా సమస్యగా మారింది.

**రైతుల అభిప్రాయం:** రైతులు కావున జనుమును విత్తనోత్పత్తిని చేపట్టి మంచి లాభాలు పొందుతున్నారు. ఒకసారి కల్టివేటర్‌తో దున్ని 10 కిలోల జనుము విత్తనాన్ని చల్లి, రోటవేటర్ వేస్తారు. తర్వాత ఒక తడి ఇస్తారు రెండు నెలలకు పూతకు వస్తుంది, 140-150 రోజుల్లో పంట చలికే వస్తుంది. పై పాటుగా ఏ రకమైన ఎరువులను గాని, పురుగుమందులను గాని, నీటి తడిని గాని ఇవ్వకుండానే 4-5 క్వి./ఎకరాకు దిగుబడి వస్తుంది. మంచిగా నీటి సౌలత్ ఉన్న రైతులకు వరి, 7-8 తడులు ఉన్న రైతు మొక్కజొన్న, 4-5 తడులు ఉన్న రైతు ప్రొద్దుతిరుగుడు, 1-2 తడులు ఉన్న రైతు జనుము విత్తనోత్పత్తిని ఎంచుకొని, భూమి బీడు ఉంచకుండా జనుముతో భూసారాన్ని పెంపొందించుకుంటూ లాభాలు సాధిస్తున్నారు. ఒక ఎకరాకు తక్కువ ఖర్చుతో (6,800/-) నీటి వసతి లేని ప్రాంతాల్లో 15,000 నుంచి 25,000 వరకు లాభం వస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సుస్థిరత్వం కొనసాగింపు:** దాదాపుగా అక్కన్నపేట రైతులు 1600-2500 క్వింటాళ్ల జనుము విత్తనాన్ని ప్రైవేటు కంపెనీకి అందిస్తూ తమ పొలాలలో భూసారాన్ని పెంపొందించుకుంటూ, తక్కువ నీరు, ఖర్చుతో కోతులకు, అడివి పందులకు మంచి పరిష్కారంగా జనుమును సాగు చేస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా 400-500 ఎకరాలలో ఈ జనుము విత్తన ఉత్పత్తిని చేపడుతూ, ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**జనుము విత్తనోత్పత్తిలో సాగు వివరాలు(ఒక ఎకరాకు)**

| క్ర.సం. | వివరాలు | జనుము విత్తనోత్పత్తి ఖర్చు (రూ./ఎకరానికి) |
|---|---|---|
| 1. | నేల తయారీ | 2,400 |
| 2. | విత్తన ఖర్చు (100 రూ./కిలో) | 1,000 |
| 3. | నీటి తడుల (ఉంటె) ఒకటి లేదా రెండు తడుల ఖర్చు | 1,000 |
| 4. | కోత ఖర్చు (కంబైన్డ్ హార్వేస్టర్-గంట/ఎకరాకు) | 2,200 |
| | మొత్తం సాగు ఖర్చు | 6,800 |
| | దిగుబడి (క్వి./ఎకరానికి) | 4-5 |
| | జనుము కొనుగోలు ధర (క్వి.) | 5,500-6,500 |
| | స్థూల ఆదాయం | 22,000-32,500 |
| | నికర ఆదాయం | 15,200-25,700 |
| | నికర ఆదాయం : ఖర్చు నిష్పత్తి | 2.23 : 3.77 |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9963164507**

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు 1. డి 2. సి 3. ఎ 4. డి 5. సి 6. ఎ 7. బి 8. సి 9.బి 10. డి**

# సేంద్రియ వ్యవసాయంలో ఆచరించాల్సిన పద్ధతులు

డా॥ ఆర్. సునీతా దేవి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, రాజేంద్రనగర్



1. పశువుల పెంట వేయడం
2. వానపాముల ఎరువు వేయడం
3. పచ్చిరొట్ట పైర్లను పెంచడం
4. జీవనియంత్రణ సాధనాలు వాడటం
5. అంతర మరియు మిశ్రమ పంటల సాగు చేయడం
6. జీవన ఎరువులు వాడటం
7. వేప సంబంధిత పదార్థాలను వాడటం
8. పంట అవశేషాలను భూమిలో కలియ దున్నడం

RNI No : TELTEL/2015/60296 March, 2025
Total No. of Pages : 52

Postal Regd.No:HSE/1013/2024-2026
Date of Publication : 06.03.2025
Date of Posting : 09.03.2025



# తెలంగాణ పశుగ్రాసపు సజ్జ (టియస్‌యఫ్‌బి 15-4)

**మొదటి కోతను 50 రోజులకు మరియు తదుపరి కోతలను 30 రోజుల వ్యవధిలో పలు కోతలను కోసుకునే వీలున్న పశుగ్రాసపు సజ్జ**

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. R. Sunitha Devi on behalf of Professor Jayashankar Telangana Agricultural University,
Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. R. Sunitha Devi, RNI File No. 1262077, Title-Code: TELTEL00152